ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



12 కౌలురైతు చట్టం అమలు చేయాలి

07 వ్యవస్థ వైఫల్యమే కాదు... లక్షలాది యువత కలలపై దెబ్బ
ప్రతి పరీక్షా పత్రం లీక్, పరీక్షల రద్దుపై రాహుల్‌గాంధీ విమర్శలు



సంపుటి 28, సంచిక: 352 | మంగళవారం | 16-06-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## 'మెట్రో'ను అడ్డుకుంటున్నది

# ఆ ముగ్గురే

### కెసిఆర్, కెటిఆర్, మంత్రి కిషన్ రెడ్డి కలిసి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై కుట్రలు

• మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా అడ్డుపడుతున్నారు • ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చినప్పటికీ కిషన్‌రెడ్డి అడ్డుకోవడం వల్లే ఐఆర్‌ఎఫ్‌సి రుణాలు ఎల్ అండ్ టికి విడుదల కావడంలేదు • పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి కెసిఆర్ ఆంతర్గతంగా సహకరించినందుకు ఇప్పుడు గురుదక్షిణ చెల్లిస్తున్నారు • మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం • కేంద్రం ఎన్‌ఒసి ఇస్తే వందశాతం ప్రభుత్వ ఈక్విటీతో మెట్రో రైల్ రెండో దశ విస్తరణకు సిద్ధమని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా, మెట్రో ఫేజ్2 పనులను చేపట్టకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ నేతలు కెసిఆర్, కెటిఆర్, మంత్రి కిషన్ రెడ్డి ఈ ముగ్గురూ కలిసే హైదరాబాద్ మెట్రో ఫేజ్2ను అడ్డుకుంటున్నారని, కుట్రలు చేస్తున్నారని సిఎం ఆరోపించారు. హైదరాబాద్ మహానగరానికి అత్యంత ఆవశ్యకత కలిగిన మెట్రో విస్తరణ చేపట్టడానికి వీలుగా, ఎల్ అండ్ టి సంస్థ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి అన్ని రకాల ఒప్పందాలు కుదిరినప్పటికీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సి) నుంచి నిధులు ఎందుకు విడుదల కాలేదని సిఎం ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి అడగగానే అన్నీ ఇచ్చేస్తే తెలంగాణలో బిజెపి ఉండాలా లేదా అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌లను ప్రశ్నించడంతో మెట్రో ప్రాజెక్టులకు నిధులు మంజూరు ఆపేశారని కేంద్ర మంత్రులను వ్యక్తిగతంగా కలిసిన పరిస్థితులను సిఎం వెల్లడించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధాని మోదీ సూచిస్తున్నారని, ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే కిషన్ రెడ్డి ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. మెట్రో విస్తరణకు కిషన్ రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తరువాయి 8లో




## మోదీ హామీల లెక్క తేల్చండి..

### ఆ తర్వాతే నా రాజీనామా కోరండి

ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను, తన మంత్రివర్గం రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలి. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముందుగా వీటికి సమాధానం చెప్పాలి.మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి" అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సిఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా? అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన సవాల్‌పై సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పై విధంగా స్పందించారు.

# 19న సంతకాలు

## పశ్చిమాసియాలో యుద్ధ విరమణకు కుదిరిన ఒప్పందం

• శుక్రవారం నాడు తెరుచుకోనున్న హోర్ముజ్ జలసంధి • ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేతకు ఆదేశించా : ట్రంప్ కీలక ప్రకటన • తక్షణమే యుద్ధం ముగిసింది : ఇరాన్ • లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో యుద్ధం ఆగిపోతుంది: షరీఫ్ • సుంకాలు లేకుండా హోర్ముజ్ జలసంధిలో రాకపోకలు • స్తంభించిన ఇరాన్ ఆస్తుల్లో 12 బిలియన్ డాలర్ల విడుదల • ఆసియా సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్ల జోరు






**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో యుద్ధ విరమణకు అవగాహన ఒప్పందం కుదిరింది, జూన్ 19వ తేదీన స్విట్జర్లాండ్ రాజధాని జెనీవాలో ప్రాథమిక ముసాయిదా అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై అమెరికా–ఇరాన్ నాయకులు సంతకాలు చేస్తారు. సంతకాలు జరిగిన తర్వాత శుక్రవారంనాడు హోర్ముజ్ జలసంధి తెరుచుకుంటుంది. రాబోయే 60 రోజుల్లో తుది ఒప్పందంపై రెండు దేశాలమధ్య సంభాషణలు కొనసాగుతాయి. దీంతో ఇరాన్‌పై విధించిన ఆంక్షలు ఎత్తివేసేందుకు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ,ఇటలీ దేశాలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. "ఇరాన్‌తో ఒప్పందం పూర్తయింది, దీంతో ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీసిన 107 రోజుల యుద్ధం ముగిసింది, ఇరాన్ ఓడరేవులపై ఇప్పటివరకూ అమలు చేసిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని ఆదేశాలు జారీ చేశాను, ఇక ప్రపంచవ్యాప్తంగా నౌకల ఇంజిన్లు స్టార్ట్ చెయ్యండి,హోర్ముజ్ ద్వారా చమురు రవాణా చేయండి" అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పిలుపు ఇచ్చారు. ఇక సకాలంలో చమురు ప్రవాహం కొనసాగుతుందని, హోర్ముజ్ జలసంధి ఇక శాశ్వతంగా ఎలాంటి సుంకాలూ లేని ప్రాంతంగా ఉంటుదని ప్రకటించారు. ఇరాన్‌తో కుదిరిన ఒప్పందంతో శాశ్వతంగా సైనిక చర్యలు ముగిశాయని, యావత్ పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి నెలకుంటుందని చెప్పారు. ఈ ఒప్పందం కుదరడానకి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన దేశాలకు ఆయన అభినందనలు తెలియజేశారు. హోర్ముజ్ జలసంధిలో ఎలాంటి సుంకాలు లేకుండానే తరువాయి 8లో

### ఒప్పందాన్ని ధ్రువీకరించిన ఇరాన్ సుప్రీం కౌన్సిల్

**టెహ్రాన్:** అమెరికాతో యుద్ధం ముగించేందుకు కుదిరిన ప్రాథమిక ఒప్పందాన్ని (ఎంఓయు)ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్ఎన్ఎస్‌సి) ధృవీకరించింది. దానికి ఆమోద తెలియజేసింది. ఈ మేరకు ఎస్ఎన్ఎస్‌సి సచివాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఒప్పందం "పాకిస్థాన్ మధ్యవర్తిత్వంలో కుదిరిన ఒప్పందం శనివారం అర్ధరాత్రి నుండే లెబనాన్ సహా అన్ని యుద్ధ రంగాలలోనూ దాడులను నిలిపివేస్తుంది, సైనిక కార్యకలాపాలన్నీ తక్షణం నిలిచిపోతాయి, ఇరాన్‌పై అమెరికా విధించిన దిగ్బంధనం నిబంధనలు కూడా తొలగిపోతాయి" అని ప్రకటన పేర్కొంది. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అమర నాయకుడు ఖమేనీ మార్గదర్శకత్వంలో,ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకుని ఆదేశాల మేరకు, ఇరాన్ ప్రజలందరి మద్దతుతో, ఇస్లామిక్ యోధుల అంకితభావంతో కూడిన కృషి ఫలితంగా, అనేక నెలలపాటు జరిగిన చర్చల ద్వారా జూన్ 14వ తేదీ రాత్రి ఈ అవగాహన ఒప్పంద పాఠాన్ని ఖరారు చేశాం" అని ప్రకటించింది. అవతలిపక్షం తన బాధ్యతలను పూర్తిగా నెరవేర్చిన తర్వాత తుది ఒప్పందంపై చర్చలు ప్రారంభమవుతాయని ప్రకటన పేర్కొంది.



### ఏ ఒక్క విద్యార్థీ ఆకలితో ఉండొద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అల్పాహార పథకం ప్రారంభం
- విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ

ఏ ఒక్క విద్యార్థి ఆకలితో ఉండకూడదనే పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అల్పాహార పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తరువాయి 12లో

# సర్ కుట్రను అడ్డుకోవాలి




- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది
- ఓటు హక్కును రక్షించుకునేందుకు 'సర్' పట్ల వార్డు, గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో అవగాహన కల్పించాలి
- ఉద్దేశపూర్వకంగానే ఓట్ల తొలగింపు
- ప్రత్యేక సమగ్ర సవరణ రాష్ట్రస్థాయి సదస్సులో వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ద్వారా ప్రజలకు లేకుండా చేసేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఓటు హక్కును రక్షించుకునేందుకు 'సర్' పట్ల వా ర్డు, గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరముందని తెలిపారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన సోమవారం 'ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సకు ప్రముఖ తరువాయి 12లో



## భారత్–స్లోవేకియా సమగ్ర భాగస్వామ్యం

- స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం సత్వర అమలుకు కృషి
- 11 ఒప్పందాలపై సంతకాలు
- స్లోవేకియాలో పర్యటించిన తొలి భారత ప్రధాని మోదీ



**బ్రటిస్లావా:** భారత్–స్లోవేకియా మధ్య సమగ్ర భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడానికి 11 ఒప్పందాలపై రెండు దేశాల నాయకులు సంతకాలు చేశారు. ఇరు దేశాలమధ్య సంబంధాలు గతంకంటే ఉన్నత స్థాయికి చేరుకున్నాయి. వారం రోజులు యూరప్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్లోవేకియాలో సోమవారం పర్యటించారు. ఆ దేశ ప్రధానమంత్రి రోబెర్టో ఫికోను కలిశారు. ఆయనతో సమావేశమయ్యారు. ఈ విధంగా స్లోవేకియాలో పర్యటించిన మొట్టమొదటి భారతదేశ ప్రధానమంత్రిగా మోదీ రికార్డుల్లో తన పేరు నమోదు చేసుకున్నారు. వలసలు, డిజిటల్ టెక్నాలజీ,రక్షణ వంటి పలు రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించుకునేందుకు రెండు దేశాల నాయకులు 11 ఒప్పందాలను ఖరారు చేశారు. యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై కూడా మోదీ–ఫికోలు చర్చించారు. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు, వాణిజ్య భాగస్వామ్యాన్నిగణనీయంగా వృద్ధి చేస్తుందని భావిస్తున్న యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా అమలు తరువాయి 8లో

## రాష్ట్రంలో వర్షాలు

### అధికారులు పూర్తిగా అప్రమత్తం

• మంత్రి పొంగులేటి ఆదేశం
• ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లాల అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను నిరంతరం పరిశీలిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన తర్వాత తరువాయి 12లో

## కేంద్రం నోరు మెదపదేం?

• భారతీయ నావికులను హతమార్చిన అమెరికా చర్యలను ఖండించండి • వామపక్షాల డిమాండ్ : దేశవ్యాప్త నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపు

**న్యూఢిల్లీ:** ఇటీవల హోర్మ్యూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న భారతీయ నావికులు పనిచేస్తున్న వాణిజ్య నౌకలపై అమెరికా నౌకాదళం దాడి చేయడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. దీనిని దుర్మార్గపూరిత చర్యగా పేర్కొన్నాయి. దాడిని ఈ దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై జరిగిన ఇటువంటి దాడుల్లో ఇది వడవది. తాము విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించే ఏ నౌకపైనైనా దాడులను కొనసాగిస్తామని అమెరికా ప్రభుత్వం బెదిరించడాన్ని వామపక్షాలు ఖండించాయి. ఈ మేరకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అమెరికా ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యలు ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు, అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛాయుత నౌకా రవాణా సూత్రాలకు విరుద్ధమైనవి. ప్రపంచమంతటిపై తన ఆధిపత్యాన్ని రుద్దేందుకు ప్రయత్నిస్తున్న గూండాలా అమెరికా వ్యవహరిస్తోంది. దీనిని సహించలేము. స్వతంత్ర విదేశాంగ విధానాన్ని వదులుకుని అమెరికాకు అనుబంధ భాగస్వామిగా మారడం ద్వారా బిజెపి నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను పూర్తిగా విస్మరిస్తోంది. అమెరికా నుంచి క్షమాపణలు పొందడంలో ప్రభుత్వ వైఫల్యం, దాని బలహీన స్పందన ఇందుకు తాజా ఉదాహరణలు. ఇది భారతదేశ సార్వభౌమాధికారానికి, ఆత్మగౌరవానికి అవమానమని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. ఇరాన్, పశ్చిమాసియాపై అమెరికా దాడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని... ఇంధన ధరలు పెరగడం, తరువాయి 12లో

## అభిజీత్ దీప్కేపై దాడి

- జైపూర్‌లో జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా, మద్దతుదారులు భుజాలపై మోసుకెళ్తుండగా చెంపదెబ్బ కొట్టిన యువకులు
- నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పిన మద్దతుదారులు

**జైపూర్ :** యువతలో సోషల్ మీడియా వేదికగా విపరీతమైన ఆదరణ పొందుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి జరిగింది. జైపూర్‌లో జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా, అభిజీత్ దీప్కేను మద్దతుదారులు భుజాలపై మోసుకెళ్తుండగా కొందరు వ్యక్తులు ఆయనను చెంపదెబ్బ కొట్టారని పోలీసులు సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నామని, తదుపరి విచారణ జరుగుతోందని అధికారులు తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ తరువాయి 12లో





## ఆ 8 రకాల వంగడాలతోనే

# రైతుకు మేలు

• విదేశాల్లో తెలంగాణ బియ్యానికి డిమాండ్.. • డిమాండ్ లేని 'సాగు' తగ్గించాలన్న పౌర సరఫరాల అధికారులు • మంత్రివర్గ ఉప సంఘానికి వ్యవసాయ శాస్త్రవేత్తల ప్రతిపాదన

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు లాభాదాయకం, ఎగుమతులకు అనుకూలమైన బిపిటి 5204, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), కెఎన్ఎం 1638, జై శ్రీరామ్, హెచ్ఎంటి, డబ్ల్యుజిఎల్ 962, డబ్ల్యుజిఎల్ 44, జెజిఎల్ 1798 లాంటి వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యవసాయ నిపుణులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘానికి సూచించారు. 8 రకాల ప్రత్యేక వంగడాలను సాగు చేయడం వల్ల రైతులకు మార్కెట్‌లో తరువాయి 8లో



# అమెరికా–ఇరాన్ తాత్కాలిక ఒప్పందం

అమెరికా–ఇరాన్ మధ్య ఏప్రిల్ 7 నుండి అమలులో ఉన్న కాల్పుల విరమణ పలుదఫాలు ఉల్లంఘనకు గురై, ఆ ఇరుదేశాల మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందానికి అవరోధాలు కల్పించినప్పటికీ మధ్యవర్తుల పట్టువిడవని ప్రయత్నాల వల్ల ఎట్టకేలకు సంతకాల దశకు చేరటం యావత్ ప్రపంచ దేశాలకు శుభవార్త. ఈ ఒప్పందం కుదరకుండా విలన్ పాత్ర పోషిస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు శనివారం బీరుట్ (లెబనాన్)లో ఎంచుకున్న లక్ష్యాలపై బాంబులు వేశాడు. కనీసం ముగ్గురు చనిపోయారు, 16 మంది గాయపడ్డారు. ఇరాన్ మద్దతుతో పనిచేసే మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా దాడుల కు ప్రతిగా తాము దాడిచేసినట్లు సాకులు చెప్పటం ఆ యుద్ధోన్మాది, జాత్యహంకారికి అలవాటు. అమెరికా–ఇరాన్ తాత్కాలిక ఒప్పందంపై ఆదివారం జెనీవాలో సంతకాలు జరుగుతాయని ఆశించిన తరుణంలో ఇజ్రాయెల్ లెబనాన్‌పై బాంబులు వేసింది. అయినా ఒప్పందంపై సంతకాలు జరుగుతాయన్న అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన నెరవేరలేదు. “మీ హామీలను నెరవేర్చగల సంకల్పబలం, సామర్థ్యం మీకు కొరవడినపుడు శాంతిచర్చల క్రమంతో ముందుకు సాగటం సాధ్యం కాదని” టెహరాన్ తరఫున చర్చల్లో ప్రధానపాత్రధారుల్లో ఒకరైన ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘెర్ క్వాలిబాఫ్, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల తర్వాత ఎక్స్ మాధ్యమం ద్వారా అమెరికాను హెచ్చరించాడు. చర్చలను చెడగొట్టటం నెతన్యాహుకు కొత్తకాదు. పదిరోజుల క్రితం శాంతి ఒప్పందం సంతకాల దశకు చేరిందని ట్రంప్ ప్రకటించగానే ఇజ్రాయెల్ లెబనాన్‌పై బాంబులవర్షం కురిపించింది. అప్పుడు ట్రంప్ తీవ్రంగా నెతన్యాహును హెచ్చరించాడు. ఇప్పుడు జూన్ 19న (శుక్రవారం) జెనీవాలో శాంతికి ఫ్రేమ్ వర్క్ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని అమెరికా–ఇరాన్ రెండూ ప్రకటించాయి. ఇంతలో ఏ విఘ్నాలు ఏర్పడకుండా సంతకాలు జరిగితే అది 100 రోజుల యుద్ధం తర్వాత చరిత్రాత్మకమే అవుతుంది. ఆ తర్వాత 60 రోజుల్లో ఇరాన్ అణుకార్యక్రమం సహా మిగిలిఉన్న వివాదాంశాలపై చర్చలు జరుగుతాయి.

ఒప్పందంపై అమెరికా–ఇరాన్ శుక్రవారం సంతకాలు చేయబోతున్నాయనే వార్త వెల్లడికాగానే ప్రపంచ దేశాలు ఊపిరిపీల్చుకున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం వల్ల సంభవించిన విధ్వంసం, ఇతర పర్యవసానాలు ఎలా ఉన్నా, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయటంవల్ల ఆయిలు సరఫరా చాలావరకు నిలిచిపోయి ప్రపంచదేశాలు ఆర్థిక మాంద్యానికి లోనయినాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల బ్రతుకు భారమైంది. ఇప్పుడు సంతకాల ప్రకటన వెలువడగానే, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిలు ధర 5శాతం తగ్గింది. షేర్ మార్కెట్లలో షేర్లు కళకళలాడుతున్నాయి. మొన్న దిగాలుపడిన బంగారం ధర ఎగుమోములో ఉంది. డాలర్‌తో మారకంలో మన రూపాయి కూడా కాస్త బలం పుంజుకుంది. తాత్కాలిక ఒప్పందం వివరాలు వెల్లడికానప్పటికీ అమెరికా ఒక అడుగు వెనక్కువేసి ఇరాన్‌కు అనేక రాయితీలు ఇచ్చినట్లు తెలుస్తున్నది. అందిన సమాచారం ప్రకారం శుక్రవారం సాయంత్రం నుంచి హోర్ముజ్ జలసంధిలో స్వేచ్ఛా రవాణా మొదలవుతుంది. అయితే యథాపూర్వస్థితి రావటానికి కనీసం నెలరోజులు పడుతుంది. అదేసమయంలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా నావికా దిగ్బంధం కూడా తొలగించబడుతుంది. ఇరాన్ ఆయిలు ఎగుమతికి అవకాశం కలుగుతుంది. అమెరికా తమ బ్యాంకుల్లో స్థంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో 12 బిలియన్ డాలర్లు తక్షణం విడుదల చేస్తుంది. అవి 120–125 బిలియన్ డాలర్లదాకా ఉంటాయని అంచనా. ఇరాన్‌కు అణుబాంబు తయారీ అవకాశం లేకుండా చేయటమే తమ లక్ష్యమంటున్న ట్రంప్, ఇరాన్ వద్దనున్న శుద్ధిచేసిన ఆయుధ గ్రేడ్ యురేనియంను ఇరాన్ నుంచి తరలించాలని పట్టుబట్టుతున్నాడు. ఇరాన్ ఏమో అమెరికా స్తంభింపజేసిన తమ ఆస్తులను మొత్తంగా విడుదల చేయాలని, దురాక్రమణ యుద్ధం తమకు కలుగజేసిన నష్టానికి పరిహారం చెల్లించాలని కోరుతున్నది. ఇత్యాది పెండింగ్ సమస్యలకు రెండు నెలల గడువులో పరిష్కారాలు అన్వేషిస్తారు. ఈ తాత్కాలిక ఒప్పందం కోసం యుఎఇ, పాకిస్థాన్, ఈజిప్టు, జోర్డాన్ గట్టి ప్రయత్నాలు చేశాయి. ఈ చర్చల్లో ఇజ్రాయెల్ ఏకాకి అయినప్పటికీ ఈ ఒప్పందం లెబనాన్‌కు కూడా వర్తించటం విశేషం. అందుకు అమెరికా గ్యారంటీ. ఇజ్రాయెల్, ఇరాన్ అనుకూల మిలిటెంట్‌లు – ఇరుపక్షాలు సంయమనం పాటించాలని ఆశించుదాం. ఒక సమగ్ర శాంతి ఒప్పందం కుదరాలని, పశ్చిమాసియాలో స్థిరశాంతి నెలకొనాలని ఆశించుదాం. అయితే పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారం, రెండు దేశాల సహజీవనం సూత్రాన్ని 1967 సరిహద్దుల ప్రాతిపదికన ఆమోదించటం మాత్రమే పశ్చిమాసియాలో ఉద్రిక్తోపశమనం, శాంతి సాధ్యం.

ఇరాన్ ప్రజలు ఏభైఏళ్ల క్రితం రాజు షాను పారద్రోలి ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పరుచుకున్న తదుపరి ఇది అమెరికా మూడవ యుద్ధం. ఇరాక్‌ని ముందు పెట్టుకుని సాగించిన తొలి గల్ఫ్ యుద్ధంలో తోకముడిచింది. 2025 జూన్‌లో ఇజ్రాల్‌తో కలిసి ఇరాన్ అణు పరిశోధనా శాలలను ధ్వంసం చేసేందుకు 10 రోజులకు పైగా బాంబుదాడులు చేసి కొంతనష్టం కలుగజేయగలిగింది. 2026 ఫిబ్రవరి 28 న ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ సాగించిన వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ, మరికొందరు ముఖ్య నాయకులను హతమార్చింది గాని ఇరానియన్‌ల మనోధైర్యాన్ని దెబ్బతీయలేకపోయింది. ట్రంప్ ఆశించిన ప్రభుత్వ మార్పు సాధ్యం కాలేదు. ఇజ్రాయెల్ కోరుకున్న మిస్సిలీ వ్యవస్థను నాశనం చేయలేకపోయింది. చివరకు అమెరికాయే ఒప్పందంకోసం చొరవ తీసుకోవాల్సి వచ్చింది. ఒమన్ కుదిర్చిన ఒప్పందంపై నిర్ణయించుకున్న ప్రకారం అమెరికా సంతకం చేసినట్లయితే ఈ యుద్ధం అవసరమే ఉండేది కాదు. ●



## ఎంపిల చీలిక వెనుక అమిత్ షా

**20 మంది టిఎంసి ఎంపిల చట్టవిరుద్ధమైన చీలిక వెనుక, కేవలం మూడేళ్ల క్రితం ఏర్పడిన, పేరు తెలియని, రిజిస్టర్ అయినా గుర్తింపు లేని ఒక రాజకీయ పార్టీతో వారు పూర్తిగా సందేహాస్పదమైన విలీనానికి హోం మంత్రి అమిత్ షా సూత్రధారి. లోక్‌సభలో ఎన్‌డిఎకు మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించే వ్యూహంలో భాగంగానే ఈ విచిత్రమైన చర్య. షా పదవిలో కొనసాగుతున్న ప్రతిరోజూ మర్యాద, సంయమనం, రాజ్యాంగ విలువలు, సూత్రాల పట్ల నిబద్ధత ప్రమాదంలో పడుతున్నాయి. ముప్పు వాటిల్లుతోంది.**

\- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి
జైరామ్ రమేశ్



# బహుజన చైతన్యానికి డిజిటల్ వేదికలు

ప్రపంచ చరిత్రలో ప్రతి యుగానికి ఒక ఆయుధం ఉంటుంది. ఒకప్పుడు రేడియో, టెలివిజన్‌లు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేశాయి. కానీ నేటి డిజిటల్ యుగంలో ఆ స్థానా న్ని మొబైల్ ఫోన్ ఆధారిత సోషల్ మీడియా ఆక్రమించింది. ఫేస్ బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూ ట్యూబ్, వాట్సప్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలు సమాజాన్ని ప్రభావితం చేసే సాధనంగా, రాజకీయాలను మలిచే వేదికగా మారాయి. ఇటీవల దళిత యువకుడు అభిజిత్ దీప్కే ఆన్లైన్ వేదికగా ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఓ కేసులో నిరుద్యోగ యువతను ‘బొద్దింకలు, పరాన్న జీవులుతో పోల్చడంతో వెబ్ పేజీలో సిజెపి ప్రారంభమైనది. పార్టీ ప్రారంభించిన గంటల వ్యవధిలో ప్రధాన రాజకీయ పార్టీలకు మించి ఫాలో అయ్యారు. ఐదు రోజుల వ్యవధిలోనే రెండు కోట్లమంది దృష్టిని ఆకర్షించడం ఇన్‌స్టాగ్రామ్ చరిత్రలోనే అరుదైన విషయం. ఇది కేవలం ఒక సోషల్ మీడియా ట్రెండ్ మాత్రమే కాదు, దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి యువతలో విస్ఫోటనంలా పేలిన అసంతృప్తి జ్వాలలు. మొన్న దీప్కే ప్రారంభించిన సిజెపి ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష లీకేజీ వ్యవహారంపై పెద్ద ఎత్తున ధర్నాకు దిగింది. ఇప్పుడు సోషల్ మీడియా ప్రజా సమస్యలపై ఉద్యమాలకు, వీధి పోరాటాలకు పునాది వేయగల శక్తిగా మారిందని నిరూపించింది.

### సోషల్ మీడియా నూతన ఆయుధం

ఒకప్పుడు ఎవరి స్వరాన్ని వినిపించాలో ప్రధాన మీడియా సంస్థలే నిర్ణయించేవి. కానీ సోషల్ మీడియా ఆ గుత్తాధిపత్యాన్ని సవాలు చేసింది. ఈ దేశంలో చారిత్రకంగా నిర్లక్ష్యం కాబడ్డ బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు జనాభాలో మెజారిటీ అయినప్పటికీ...సామాజిక, రాజకీయ, ఆర్థిక శక్తిలో వారి ప్రాతినిధ్యం అంతంత మాత్రమే. ప్రధాన మీడియా సైతం వారి సమస్య లను ప్రస్తావించడం లేదు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా బహుజన వర్గాల మధ్య అవగాహన పెంచే, వారిని సంఘటితం చేసే ఒక ప్రభావవంతమైన సాధనంగా మారింది. ఒకప్పు డు చైతన్య కార్యక్రమాలు గ్రామ సభలు, సమావేశాలు, కరపత్రాలకే పరిమితమయ్యేవి. నేడు ఒక మొబైల్ ఫోన్ ద్వారా లక్షల మందిని చేరుకోవచ్చు. సోషల్ మీడియా ద్వారా బహుజన చరిత్ర, సామాజిక ఉద్యమాలు, రాజ్యాంగ విలువలు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై విస్తృత చర్చలు నిర్వహించవచ్చు. ఒక ప్రాంతంలో జరిగిన అన్యాయం, వివక్ష లేదా ప్రజా సమస్యలను దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చగల సామర్థ్యం దీని కి ఉంది. పీడిత వర్గాలైన దళిత, బహుజనులు తమ విముక్తికి సామాజిక మీడియాను సక్రమంగా వినియోగిస్తున్నారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. బిసి ఎష్‌సి, ఎస్‌టిల విముక్తి కోసం జరిగే బహుజన ఉద్యమాలు ప్రజలకు చేరాల్సినంత చేరకపోవడమే ఇందుకు నిదర్శ నం. ఆధిపత్య కులాలు, వారి పార్టీలు సోషల్ మీడియా కేంద్రంగా అనేక తప్పుదోవ పట్టించే సమాచారాన్ని డంప్ చేస్తున్నారు. దాన్నే బహుజన వర్గాలు అనుసరిస్తున్నారు తప్ప, అభిముఖంగా దీటైన కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. ఇప్పుడు మనీ, మీడియా, మాఫియాతో రాజకీయాలను శాసిస్తున్న కొన్ని ఆధిపత్య వర్గాలకు అభిముఖంగా ఆన్లైన్ వేదికగా దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ సవాల్‌గా నిలిచింది. భారత రాజకీయ చరిత్రలో కేవలం సోషల్ మీడియా వేదికగా పురుడుపోసుకొని ఇంతటి తీవ్రమైన ప్రజా ఉద్యమంగా మారిన సందర్భం మరొకటి లేదు.

### సోషల్ మీడియా ప్రజాస్వామ్య శక్తి

నేటి రాజకీయాల్లో సోషల్ మీడియా ఒక కొత్త యుద్ధభూమిగా మారింది. ఇది రాజకీయ ప్రచారం కోసం మాత్రమే కాదు. ఇది అట్టడుగు వర్గాల సామాజిక న్యాయంకోసం పోరాడే వేదిక కూడా. ప్రధాన మీడియా విస్మరించిన అనేక సమస్యలు, కుల వివక్ష, సామాజిక అసమానతలు, అణచివేతలు, అన్యాయాలు సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. భారతదేశ జనాభాలో మెజారిటీగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు తమ రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కుల కోసం పోరాడుతున్న ఈ సమయంలో సోషల్ మీడియా ఒక కీలక సాధనంగా నిలుస్తోంది. చైతన్యవంతమైన ఓటరును నిర్మించడంలో, ప్రజల్లో రాజకీయ అవగాహన పెంచడంలో, ప్రత్యామ్నాయ ఆలోచనలను వ్యాప్తి చేయడంలో దీనిపాత్ర మరింత పెరగనుం ది. అయితే కేవలం సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు లేదా హ్యాష్‌ట్యాగ్‌లతో సంపూర్ణ మార్పు రాకపోవచ్చు. కానీ మార్పుకు కచ్చితంగా దోహదపడుతుంది. ఆన్‌లైన్ చైతన్యం, ఆఫ్‌లైన్ ఉద్యమాలతో కలిసినప్పుడే శాశ్వత మార్పు సాధ్యమవుతుంది. నేటి ప్రపంచంలో ఒక పోస్ట్ ఉద్యమాన్ని ప్రారంభించగలదు, ఒక హ్యాష్‌ట్యాగ్ లక్షల మందిని ఏకం చేయగలదనీ, అది ప్రజల చేతుల్లో ఉన్న ఒక ప్రజాస్వామ్య శక్తి అని అభిషేక్ దీప్కే నిరూపించాడు. కాబట్టి ఇప్పుడు సోషల్ మీడియా శకాన్ని వాడుకుంటూ బహుజన ఐక్య పోరాటాలకు పిలుపు నివ్వాల్సిన అవసరం ఉంది.

సంపతి రమేష్, 7989579428.

# సమానత్వం కోసం దళిత ముస్లింలు ఎదురుచూపు!

భారతదేశ రాజ్యాంగం సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం అనే మూడు ప్రాథమిక సూత్రాలపై నిర్మితమైంది. రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన తర్వాత భారత సమాజంలో శతాబ్దాలుగా కొనసాగిన కులవివక్ష, అంటరానితనం, సామాజిక బహిష్కరణ వంటి అన్యాయాలను నిర్మూలించడం స్వతంత్ర భారతదేం ముందున్న ప్రధాన లక్ష్యంగా నిలిచింది. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ నిర్మాతలు చారిత్రకంగా అణచివేతకు గురైన వర్గాలకు ప్రత్యేక రక్షణలు, ప్రాతినిధ్య అవకాశాలు,రిజర్వేషన్లు కల్పించారు. అయితే స్వాతంత్ర్యం అనంతరం ఏడు దశాబ్దాలకు పైగా గడిచినా, కులవివక్ష యొక్క స్వరూపం మారినప్పటికీ దాని ప్రభావం పూర్తిగా అంతరించి పోలేదు. ముఖ్యంగా మతమార్పిడులు జరిగినప్పటికీ కుల ఆధారిత వివక్షను ఎదుర్కొంటున్న దళిత ముస్లింలకు షెడ్యూల్ కుల(SC)హోదా కల్పించాలా అనే ప్రశ్న భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, సామాజిక శాస్త్రవేత్తలు, ప్రజాస్వామ్యవాదుల ముందున్న అత్యంత కీలకమైన చర్చాంశగా మారింది.

దళితముస్లింలకు షెడ్యూల్ కుల హోదా కల్పించాలనే డిమాండ్ కొత్తది కాదు. స్వాతంత్ర్యం తర్వాత నుంచే వివిధ సామాజిక ఉద్యమాలు, మైనారిటీహక్కుల సంస్థలు, దళత సంఘాలు ఈ అంశాన్ని లేవనెత్తుతున్నాయి. అయితే ఈ ప్రశ్నను కేవలం రిజర్వేషన్ల కోణంతో చూడడం సరైంది కాదు. ఇది రాజ్యాంగ సమానత్వం, మత స్వేచ్ఛ, సామాజిక న్యాయం, మానవ హక్కులు, నేలమీద కొనసాగుతున్న సామాజిక వాస్తవాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఈ ప్రశ్న స్పష్టంగా బయటపెడుతోంది.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చట్టం ముందు సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 15 మత,కులం, జాతి, లింగం లేదా జన్మస్థలం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. ఆర్టికల్ 16 ప్రభుత్వ ఉద్యోగాలలో సమాన అవకాశాలను కల్పిస్తుంది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని పూర్తిగా రద్దుచేస్తూ దానిని రాజ్యాంగ విరుద్ధమైన ఆచారంగా ప్రకటిస్తుంది. అదే సమయంలో ఆర్టికల్ 46 సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి రాజ్యం ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిర్దేశిస్తుంది. ఈ నిబంధనలన్నింటి ఉద్దేశం ఒకటే– చారిత్రకంగా అణచివేతకు గురైన వర్గాలను సమాజంలో సమాన స్థాయికి తీసుకురావడం.

అయితే 1950లో జారీ చేసిన “Constitution (schedule Castes) Order,1950” ద్వారా షెడ్యూల్ కుల హోదాను కేవలం హిందూ మతానికి చెందిన దళితులకు మాత్రమే పరిమితం చేశారు. తరువాత 1956లో సిక్కు మతాన్ని, 1990లో బౌద్ధ మతాన్ని అనుసరించే దళితులను కూడా ఈ జాబితాలో చేర్చారు. కానీ క్రైస్తవ, ముస్లిం మతాలను స్వీకరించిన దళితులకు ఈ హోదా ఇప్పటికీ అందుబాటులో లేదు. ఇక్కడే ప్రధాన రాజ్యాంగ పరమైన సందేహం తలెత్తుతోంది. ఒకే సామాజిక నేపథ్యానికి చెందిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు హిందువుగా ఉంటే షెడ్యూల్ కుల హోదా పొందుతారు; మరొకరు ఇస్లాం లేదా క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే అదే హక్కు ను కోల్పోతారు. సామాజిక వెనుకబాటుతనం ఒకటే అయినప్పటికీ, మతం ఆధారంగా హక్కులలో తేడా రావడం రాజ్యాంగ సమానత్వ స్ఫూర్తికి అనుగుణమా అనే ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లభించలేదు.

దళిత ముస్లింలకు షెడ్యూల్ కుల హోదా అవసరమని వాదించే వారి ప్రధాన వాదన ఏమిటంటే, మత మార్పిడి కులవివక్షను నిర్మూలించలేదని. ఇస్లాం సిద్ధాంత పరంగా సమానత్వాన్ని, సోదరభావాన్ని బోధించినప్పటికీ భారత ఉపఖండంలో చారిత్రక, సామాజిక ప్రభావాల కారణంగా ముస్లిం సమాజంలో కూడా వర్గీకరణలు కొనసాగుతున్నాయి. అశాఫ్, అజ్లాఫ్, అర్జల్ వంటి సామాజిక విభజనలు కేవలం చారిత్రక వర్గీకరణలు మాత్రమే కాకుండా, అనేక ప్రాంతాల్లో సామాజిక సంబంధాలు, వివాహాలు, వృత్తులు, మతపరమైన కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయని, సామాజిక గుర్తింపు పూర్తిగా మారడం లేదు. కుల ఆధారిత అవమానాలు, వివక్ష, అవకాశాల లోపం, పేదరికం వంటి సమస్యలు అనేక సందర్భాల్లో కొనసాగుతున్నాయి. ఈ అంశంపై జరిగిన వివిధ అధ్యయనాలు కూడా ఇదే విషయా న్ని సూచిస్తున్నాయి.2026లో విడుదలైన సచార్ కమిటీ నివేదిక భారత ముస్లింల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసింది. ఈ నివేదిక ప్రకారం ముస్లింలలోని దిగువ వర్గాలు విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ సేవలు, ఆర్థిక అవకాశాల విషయంలో తీవ్ర వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నాయి. అలాగే న్యాయమూర్తి రంగనాథ్ మిశ్రా కమిషన్ (National Commission for Religious and Linguistic Minorities) తన నివేదికలో మత ఆధారిత పరిమితిని తొలగించి దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు కూడా షెడ్యూల్ కుల హోదా కల్పించాలని స్పష్టంగా సిఫార సు చేసింది. కమిషన్ అభిప్రాయం ప్రకారం అంటరానితనం, సామాజిక వివక్ష అనేవి కేవలం మతపరమైన సమస్యలు కావు; అవి సామాజిక నిర్మాణాల్లో పాతుకుపోయిన వాస్తవా లు.

ఇక్కడ “ఫార్మల్ ఈక్వాలిటీ” మరియు“ సబ్ స్టాంటివ్ ఈక్వాలిటీ” అనే రెండు భావనలు అర్థం చేసుకోడం అవసరం. చట్టం అందరికీ ఒకే విధంగా వర్తించడం ఫార్మల్ ఈక్వాలిటీ. కానీ చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించి వారిని సమాన స్థాయికి తీసుకురావడం సబ్‌స్టాంటివ్ ఈక్వాలిటీ. భారత సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో రెండో భావనకు ప్రాధాన్యత ఇచ్చింది. సమాజంలో వాస్తవ అసమానతలు కొనసాగుతున్నప్పుడు కేవలం చట్టపరమైన సమానత్వం సరిపోదని, సామాజిక న్యాయాన్ని సాధించే చర్యలు అవసరమని న్యాయస్థానం పలుమార్లు పేర్కొంది. అయితే ఈ డిమాండ్‌కు వ్యతిరేకంగా కూడా కొన్ని వాదనలు ఉన్నాయి. షెడ్యూల్డ్ కులాల హోదా చారిత్రకంగా హిందూ కుల వ్యవస్థలోని అంటరానితనానికి పరిహారంగా రూపొందించబడిందని, కాబట్టి ఇతర మతాలకు దానిని విస్తరించడం అసలు ఉద్దేశ్యానికి విరుద్ధమని కొందరు అభిప్రాయపడుతున్నారు. అలాగే దళిత ముస్లింలను చేర్చడం వల్ల ప్రస్తుతం ఉన్న షెడ్యూల్డ్ కులాల వాటా తగ్గిపోతుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ఈ వాదనలను పూర్తిగా విస్మరించలేము. కానీ ఒక ముఖ్యమైన ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఒకవేళ వివక్ష, సామాజిక బహిష్కరణ, ఆర్థిక వెనుకబాటుతనం కొనసాగుతున్నాయని ఆధారాలు స్పష్టంగా చూపుతున్నప్పుడు, కేవలం మతం కారణంగా ఆ వర్గాన్నిరక్షణల నుండి దూరంగా ఉంచడం ఎంతవరకు న్యాయసమ్మ తం?

వాస్తవానికి ఈ చర్చ కేవలం రిజర్వేషన్లకు సంబంధించినది కాదు. ఇది భారత రాజ్యాంగం తన స్వంత నైతిక ప్రమాణాలను ఎంతవరకు అమలు చేస్తుందనే ప్రశ్న. ఒక వ్యక్తి మతాన్ని మార్చుకున్నందుకు అతని చారిత్రక, సామాజిక అన్యాయాలు ఒక్కసారిగా మాయమవ్వవు. కుల గుర్తింపులు, సామాజిక ముద్రలు, అవకాశాల అసమానతలు చాలా సందర్భాల్లో తరతరాలపాటు కొనసాగుతాయి. కాబట్టి సమస్య యొక్క మూలాన్ని అర్థం చేసుకోకుండా కేవలం మతపరమైన వర్గీకరణల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉండదు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సామాజిక ప్రజాస్వామ్యాన్ని రాజకీయ ప్రజాస్వామ్యానికి పునాదిగా అభివర్ణించారు. సమాజంలో సమాన గౌరవం, సమాన అవకాశాలు లేకపోతే రాజకీయ హక్కులు అర్థరహితమవుతాయని ఆయన హెచ్చరించారు. నేటి దళిత ముస్లింల ప్రశ్నను కూడా ఇదే దృక్కోణంలో చూడాలి. ఇది ఒక ప్రత్యేక వర్గం ప్రయోజనాలకు సంబంధించిన డిమాండ్ మాత్రమే కాదు, భారతదేశం తన రాజ్యాంగ విలువలను ఎంత నిజాయితీగా అమలు చేస్తుందనే విషయానికి సంబంధించిన ప్రశ్న.

సామాజిక వాస్తవాలు ఒక వైపు, చట్టపరమైన పరిమితులు మరోవైపు ఉన్న ఈ పరిస్థితిలో సమగ్ర పునర్విమర్శ అవసరం. దళిత ముస్లింల సామాజిక పరిస్థితులపై స్వతంత్ర అధ్యయనాలు, జనగణ న ఆధారిత డేటా, సామాజిక న్యాయ ప్రమాణాలు, న్యాయపరమైన విశ్లేషణల ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రశ్నకు సమాధానం రాజకీయ లాభనష్టాల ఆధారంగా కాకుండా రాజ్యాంగ న్యాయం, సామాజిక వాస్తవాలు, మానవ గౌరవం అనే ప్రమాణాలపై ఆధారపడాలి.

భారత రాజ్యాంగం ఒక జీవవంతమైన పత్రం. సమాజంలో మారుతున్న వాస్తవాలకు అనుగుణంగా తన విలువలను మరింత విస్తృతంగా అమలు చేయగల సామర్థ్యం దానికి ఉంది. దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల హోదా కల్పించాలనే డిమాండ్‌ను కూడా అదే దృక్కోణంలో పరిశీలించాలి. మత మార్పిడి తర్వాత కూడా కుల వివక్ష కొనసాగుతున్నదనే వాస్తవం నిరూపితమైతే, ఆ వివక్షను ఎదుర్కొనే రాజ్యాంగ రక్షణలను అందించడం భారత ప్రజాస్వామ్యపు నైతిక బాధ్యత అవుతుంది.

చివరికి ఈ ప్రశ్న రిజర్వేషన్ గురించినది కాదు; సమానత్వం గురించినది. ఇది మతం గురించినది కాదు; మానవ గౌరవం గురించినది. ఇది ఒక వర్గం డిమాండ్ మాత్రమే కాదు; భారత రాజ్యాంగం ప్రకటించిన సామాజిక న్యాయ వాగ్దానం ఎంతవరకు అందరికీ చేరుతుందనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం కనుగొనడం భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, సామాజిక న్యాయ వ్యవస్థకు ఒక చారిత్రక బాధ్యత.

**డా.షేక్ ఇస్లాముద్దీన్**
ఆల్ ఇండియా ముస్లింస్ రిజర్వేషన్
పోరాట సమితి(AI.MRPS) వ్యవస్థాపక అధ్యక్షుడు
8555019322

# వలసదారుల చెల్లింపులే జీవనాధారం !

మన తెలుగు రాష్ట్రాల్లో ఎందరో కార్మిక శ్రామిక వర్గాలు అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి, తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవడానికి, తమ స్వగ్రామంలో ఇల్లు కట్టుకోవడానికి దుబాయ్, సౌదీ అరేబియా లాంటి దేశాలకు కన్నీటి ధారలతో వలస వెళ్లడం చూస్తు న్నాం. అదే విధంగా ఉన్నత విద్యార్హతలను కలిగిన యువత ఉన్నత ఉద్యోగాల వేటలో విదేశాలకు వలసవెళ్లడం కూడా జరుగుతుంది. ఇలాంటి వలసదారులు తాము కష్టపడి సంపాదించిన ధనాన్ని తమ ఊళ్లల్లో స్థిరపడిన కుటుంబ సభ్యులకు పంపడం ద్వారా ఆయా కుటుంబాల్లో ఆహార భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పిల్లల విద్య, గృహ నిర్మాణా లు, అప్పులు తీర్చడం, కుటుంబ సమగ్రాభివృద్ధి జరగడం లాంటివి తరుచుగా చూస్తున్నాం. ఇలా విదేశాల్లో లేదా స్వదేశంలో ఇతర ప్రాంతాల కు జీవనోపాధులను వెతుక్కుంటూ వలసలు వెళ్లిన అభాగ్యుల శ్రమ తమ కుటుంబాలకు ఆశా దీపాలుగా పని చేస్తున్నాయి. వలసలు వెళ్లి సంపాదించిన డబ్బును తమ స్వంత ఊళ్లల్లో ఉన్న కుటుంబాలకు పంపించడంతో ఆయా కుటుంబాలు ఆనంద, ఆయురారోగ్యాలతో గడపడాన్ని గమనించిన ఐరాస ప్రతి ఏట జూన్ 16న అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ ఫ్యామిలీ రెమిటెన్సెస్ డేను ఘనంగా జరుగుపుకోవడం గత దశాబ్దకాలంగా కొనసాగుతున్నది. ఈ దినోత్సవ వేదికగా వలసదారుల శ్రమను గుర్తించడం, వారికి ప్రభుత్వ చేయూతను ఇవ్వడం, వలసదారుల యోగక్షేమాలను చూసుకోవడం, ఆర్థిక ప్రగతిలో వారి పాత్రను అవగాహన పర్చడం లాంటివి జరగాలి. 2026 అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం ఇతివృత్తంగా చెల్లింపులు జీవనాధారం అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. వలసదారులు తమ స్వదేశీ కుటుంబాలకు పంపించే చిన్న మొత్తం డబ్బులను పంపినప్పటికీ ఆ మొత్తం ఆయా కుటుంబాలు మెరుగైన జీవితాలను గడపడానికి ఉపకరిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో దాదాపు 5ట్రిలియన్ డాలర్ల వలసదారుల చెల్లింపులు తమ కుటుంబాలకు చేర డం గమనించారు. 2030 నాటి ఈ చెల్లింపులు అదనంగా దాదాపు 4.4 ట్రిలియన్లు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ వలసదారులు 500 బిలియన్ డాలర్ల సంపాదనను తమ కుటుంబాలకు పంపించడం, ఆ కుటుంబాల్లో పేదరికం తగ్గుతూ, వారి జీవన ప్రమాణాలు పెరగడం జరుగుతోందని గమనించారు. ఈ వలసదారుల్లో 2.58 బిలియన్ల అంతర్జాతీయ వలసదారులు, 760 మిలియన్ల స్వదేశీ వలసదారులు ఉన్నారు.

వలసదారులు పంపించే డబ్బు అధికంగా గ్రామీణ కుటుంబాల ఉన్నతికి ఉపయోగపడుతున్నాయి. మెక్సికో, చైనా, ఇండియా లాంటి దేశాల్లో వలసదారులు తమ కుటుంబాలకు పంపిస్తున్న చెల్లింపులు అధికంగా ఉన్నాయని తెలుస్తున్నది. వలసదారులు పంపించే ధనంతో దాదాపు 800 మిలియన్ల కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతున్నారు. పిల్లల విద్య, పేదరిక నిర్మూలన, కుటుంబ ఆరోగ్యం, పోషకాహారం, గృహ నిర్మాణాలు, కుటుంబాలకు నిలకడ రావడం, అప్పులు తీరడం, అవకాశాలు మెరుగుపడడం, గ్రామీణ అభివృద్ధికి ఊతం ఇవ్వడం, ఆర్థిక అసమానతలు తగ్గడం, దీర్ఘకాలిక ప్రయోజనాలు కలగడం, కుటుంబ ఆర్థిక స్థితులు బలపడడానికి ఉపయోగపడుతూ ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. తమ కుటుంబాలను, స్వగ్రామాలను, పిల్లల్ని వదిలి పొట్టచేత పట్టుకొని విదేశాలకు లేదా తమ దేశంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన అభాగ్యులు ఒంటిపూట తింటూ, అనారోగ్యకర వాతావరణంలో సహితం జీవిస్తూ, తమ పిల్లల బంగారు భవితను స్వప్నిస్తూ, సంపాదించిన ధనాన్ని తమ స్వదేశంలో ఉన్న కుటుంబాలకు పంపించడం ద్వారా దేశాభివృద్ధిలో ఎంతగానో దోహదపడుతున్నారని గమనిస్తూ, వారి సేవలను కొనియాడుదాం, వారి కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉంటూ సహకరిద్దాం.

**(16 జూన్ అంతర్జాతీయ కుటుంబ చెల్లింపుల దినోత్సవం సందర్భంగా)**

**డాక్టర్ : బుర్ర మధుసూదన్ రెడ్డి**

# దీర్ఘాయుష్షు దీవి... ఇకారియా

పెద్దవాళ్లు ‘శతమానం భవతి‘ అని దీవిస్తుంటారు. వందేళ్లు సంతోషంగా జీవించమని దాని అర్థం. కానీ,అక్కడి దాకా చేరుకునేవారు చాలా తక్కువ. మన దగ్గర ఇంకా అరుదు. ప్రస్తుతం భారతదేశ సగటు ఆయుర్ధాయం 72 ఏళ్లుగా ఉంది. ఇన్నేళ్లు బతకడానికి కూడా ఎన్నో అనారోగ్యాలను దాటాల్సి వస్తోంది. కానీ, ప్రపంచంలో చాలా దేశాల్లో ప్రజలు అధిక సగటు ఆయుర్ధాయంతో జీవిస్తున్నారు. అలాంటి దేశాల్లో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది గ్రీస్ దేశంలోని ఇకారియా ద్వీపం గురించి. ఆధునిక ప్రపంచం పరుగుల మీద ఉంది.. ఉరుకులు, హడావుడి, ఒత్తిడి వెరసి మనిషి ఆయుష్షును హరిస్తున్నాయి. కానీ, ఈ ప్రపంచానికి దూరంగా ఉన్న ఇకారియా నందు కాలం నెమ్మదిగా కదులుతుంది. మనుషులు మరణించడాన్నే మరిచిపోయారా అన్నట్లుగా వందేళ్ల వయసులోనూ కుర్రాళ్లలా తిరుగుతుంటారు ఇక్కడి ప్రజలు. అత్యంత ఆరోగ్యంగా, నూరేళ్లకు పైగా జీవించే అరుదైన ‘బ్లూ జోన్’ ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ప్రజలు క్యాన్సర్, హార్ట్ ప్రాబ్లమ్స్, డిమెన్షియా వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా, ప్రశాంతమైన జీవన శైలితో దీర్ఘాయుష్షను పొందుతున్నారు.

ఇక్కడి ప్రజలు కొన్ని ప్రత్యేకమైన పద్ధతులు పాటిస్తారు. వాటిలో ‘సిగా...సిగా’ ఒకటి. గ్రీక్ భాషలో దీని అర్థం ‘మెల్లమెల్లగా’ అంటే ఏ విషయంలోనూ హడావుడి పడకుండా, ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితాన్ని గడపడం. ఇది వారిలో కార్టిసాల్ (ఒత్తిడి) హార్మోన్‌ను తగ్గిస్తుంది. వీరు ఇంట్లో పండించిన కూరగాయలు, ఆలివ్ ఆయిల్, తేనె, పప్పుధాన్యాలతో కూడిన మధ్యధరా ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటారు. ఇక్కడి భూభాగం కొండలతో నిండి ఉండటం వల్ల, ప్రజలు ప్రతిరోజూ రెండు, మూడు కిలోమీటర్లు నడవడం,శారీరక శ్రమ చేయడం అలవాటుగా చేసుకున్నారు. ఇది వారిని ఆరోగ్యంగా ఉంచుతుంది. సాధారణంగా అమెరికన్లు ఎక్కువ కాలం జీవిస్తారు. అక్కడి వైద్య సదుపాయాలూ, టెక్నాలజీ వాళ్లను ఎక్కువకాలం జీవించేలా చేస్తున్నాయి. అలాంటిది ఇకారియాలో జనం... అమెరికన్ల కంటే పదేళ్లు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. ఐతే, వీళ్లకు డాక్టర్ల అవసరమే రావట్లేదు. ఈ దీవిలో యూత్‌తోపాటూ ముసలివాళ్ల సంఖ్య కూడా ఎక్కువే. మూడొంతుల మంది 90 ఏళ్లకు మించిన వాళ్లే. అంత ఏజ్ వచ్చినా... ఇక్కడి బామ్మలు, తాతలూ యంగ్ అండ్ ఎనర్జిటిక్ లుక్‌తో కనిపిస్తా రు.

ఆహారం విషయంలో వీళ్లెంత జాగ్రత్తగా ఉంటున్నారో తెలుసా? గ్రీన్ టీ లాంటి హెర్బల్



ప్రొడక్ట్స్ ఎక్కువగా వాడుతున్నారు. షుగర్, పిండి పదార్థాలు, మాంసం లాంటివి తీసుకునేది తక్కువే. అంతేకాదు... పురుగు మందులు, కెమికల్స్‌తో పండించిన ఆహారాన్ని అస్సలు ముట్టరు. సేంద్రి య పద్ధతుల్లో పండించినవి మాత్రమే తింటున్నారు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్ జోలికి వెళ్లరు. ఆరోగ్యంపై వీళ్లకు ఎంత శ్రద్ధో కదా. మనం రోజూ రాత్రిపూట పడుకోవడానికే టైమ్ సరిపోదని అనుకుంటుంటాం. వీళ్లైతే... రాత్రే కాదు... మధ్యాహ్నం కూడా కునుకు తీస్తారు. మనలాగా వీళ్లు టెన్షన్లను నెత్తిన పెట్టుకోరు. టైమ్‌తో పోటీపడి పరిగెత్తడం ఉండదు. తోటల్లో పనికి ఆలస్యంగా వచ్చినా... ఓనర్లు పెద్దగా ఫీలవ్వరు. ఓ గంట అటూ ఇటూ అయితే ఏమవుతుందిలే అంటూ లైట్ తీసుకుంటారట.

సుధాకర్.ఏ.వి, 9000674747





# గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది



**ఇందిరమ్మ కృషిని గుర్తు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ బస్సు యాత్ర: టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిరిజన సమాజం సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో ఎదగడానికి ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతమే ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల సంక్షేమమని స్పష్టం చేశారు. గిరిజనులకు ఎస్‌టి రిజర్వేషన్లు కల్పించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ చేసిన కృషిని ప్రజలకు చాటి చెప్పేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సు యాత్రను నిర్వహించనున్నట్లు టిపిసిసి ఆదివాసీ కాంగ్రెస్ ప్రకటించింది. గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో సోమవారం నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. 1976లో లంబాడీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసిన ఇందిరా గాంధీ, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంలో ఇందిరా గాంధీ ఎప్పుడూ ముందుండే వారని, గిరిజనుల వెనుకబాటుతనాన్ని గుర్తించి వారికి ఎస్‌టి రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి అభ్యున్నతికి బాటలు వేసిందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే కాంగ్రెస్ పార్టీ లక్ష్యాలని, పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడమే విమర్శలు చేసే వారికి సరైన సమాధానమని అన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి ఐదు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా చేపట్టనున్న బస్ యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

**తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా పవన్ వ్యాఖ్యలు**

తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కోసం వేలాది మంది ఉద్యమకారులు పోరాడి, అనేక మంది ప్రాణత్యాగాలు చేసిన నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావాన్ని కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. బిజెపి నాయకుల ప్రభావంతోనే పవన్‌కల్యాణ్ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా సోనియాగాంధీ సంకల్పంతోనే సాధించగలిగామని పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలపై బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించకపోవడం వెనుక రాజకీయ ఒప్పందాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో చెప్పినట్లుగా రాజకీయాల్లో కూడా విచ్చలవిడిగా వ్యాఖ్యలు చేయడం తగదని, రాజకీయాలపై ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర, దేశ నిర్మాణంలో నెహ్రూ గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను అధ్యయనం చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పవన్ కల్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసి ముందుకు సాగాలని, రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణను లక్ష్యంగా చేసుకుని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్, బిజెపి మధ్య లోపాయికారీ అవగాహన ఉన్నట్లు కనిపిస్తోందని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు మరింత చేరువ

**క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్ల వివరాలతో నివేదికను సమర్పించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్ల వివరాలతో నివేదికను సమర్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. వీరిపైన క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో కూడా వెంటనే ఆయా అధికారుల నుంచి వివరణ కోరాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించబోని అధికారులను ఉపేక్షించొద్దని సిఎం హెచ్చరించారు. 'ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో వచ్చిన సమస్యలను ఆయా శాఖలు పరిష్కరించాలని అధికారులను సిఎం ఆదేశించారు. మార్చి 16 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు (జూన్ 12) చేపట్టిన 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందన్నారు.

'99 రోజులపాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాల'పై హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలను, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సిఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. '99 రోజు ల యాక్షన్ ప్లాన్'లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలన్నారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వా త జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపైన కూడా సిఎం ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా 'ముఖ్యమంత్రి హామీల' పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్రణాళిక శాఖను విభాగాన్ని ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించిన స్థాయిలో చెప్పుకోలేకపోయాయని, వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్య క్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలను తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను నమోదు చేయాలని సూచించారు.

**కొత్త గ్రామ పంచాయతీ భవనాలకు కార్యచరణ సిద్ధం చేయండి**

ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలు ఉంటే, వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆ గ్రామాల్లో కొత్తగా గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు.

**'99 రోజుల యాక్షన్ ప్లాన్'పైన జిల్లాల వారీగా సమీక్షలు ..**

'99 రోజుల యాక్షన్ ప్లాన్' విషయంలో రాష్ట్ర స్థాయి తరహాలోనే జిల్లాల వారీగా వెంటనే సమీక్ష నిర్వహించాలని సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకు సీనియర్ ఐఎఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని సూచించారు. ఆ స్పెషలాఫీసర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలను, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆయన ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలన్నారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు కూడా సిద్ధం చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. డ్యాష్‌బోర్డులో అందుబాటులో ఉంచాలన్నారు.

**విద్య, వైద్య విభాగాల్లో 'ఫేషియల్ రికగ్నిషన్' అటెండెన్స్ పాటించండి**

విద్య, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కళాశాలల వరకు పిహెచ్‌సి నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానాన్ని పాటించాలన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ ఎంపి వేం.నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సివి ఆనంద్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న దేశవ్యాప్త ఆందోళనలు




**సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ**

**మహబూబ్‌నగర్ :** మతోన్మాదం పేరుతో దేశంలో బిజెపి సర్కార్ ప్రజా సమస్యలను పక్కకు పెట్టి హిందుత్వ ఎజెండాను అమలుపరుస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ సెప్టెంబర్ 1న దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తుందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ పట్టణానికి విచ్చేసిన వారు మీడియాతో మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు అవుతున్నా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందింది సామాన్యుడు బతకటానికి ఇబ్బంది పడుతున్న తరంలో నిత్యవసర ధరలు విపరీతంగా పెంచేసింది. కేంద్రంలో బిజెపి సర్కార్ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు కుల, మత రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. ప్రజా ఆగ్రహంతో బంగ్లాదేశ్, శ్రీలంక నేపాల్ ప్రభుత్వాలు కుప్పకూలాయి. మొన్న జరిగిన తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే, అన్నా డీఎంకే పార్టీలను ప్రజలు మట్టికరిపిస్తూ టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రజా సంక్షేమాన్ని పక్కకు పెడితే రానున్న కాలంలో బిజెపిని, రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలను ప్రజలు పక్కకు పెట్టే తరుణం ఆసన్నమైతదని వారు జోష్యం చెప్పారు. ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతున్నందువలనే కాక్రోచ్ పార్టీ రూపాంతరం చెందింది. దేశ సమగ్రత శ్రేయస్సు కోసం కమ్యూనిస్టులు వాచ్ డాగ్‌లో పనిచేయాలని అదేవిధంగా కమ్యూనిస్టు పార్టీ విస్తరణ, బలోపేతం గ్రామ స్థాయి నుంచి చేయాలని వారు కార్యకర్తలకు సూచించారు.ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బ్బంగి బాలకిషన్, జిల్లా పార్టీ మాజీ కార్యదర్శి బి.పరమేశ్ గౌడ్, సిపిఐ నాయకులు పద్మావతి సత్యనారాయణ రెడ్డి లక్ష్మ ణ్ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లోని సుశ్రుత హాస్పిటల్‌లో సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు కామ్రేడ్ మధు సతీమణి సుమతిని సోమవారం పరామర్శించిన సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ



# నిలోఫర్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపునకు కృషి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిలోఫర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపు కోసం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించిన కూనంనేని సాంబశివరావును అక్కడ పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కలిసి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం అందుతున్న వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, వేతనాలను పెంచాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సిబ్బంది సమస్యలను శ్రద్ధగా విన్న కూనంనేని సాంబశివరావు, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది సంక్షేమం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన ఆకాంక్షించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలు ఆసుపత్రి నిర్వహణలో కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు.

# ఫొటోలకే పరిమితం కావొద్దు

**ఫలితాలు కనిపించే విధంగా పనిచేయాలి.. విధులను సక్రమంగా నిర్వర్తించని వారిపై కఠిన చర్యలు : మంత్రి సీతక్క**

**ఎంపిఒలు, డిఎల్‌పిఒల పనితీరుపై అసంతృప్తి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎంపిఒలు, డిఎల్‌పిఒల పనితీరు ఆశించిన స్థాయిలో లేదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫొటోలు క్యాప్చర్ చేయడం వరకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించే విధంగా పని చేయాలని హెచ్చరించారు. వారి పనితీరుపై సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విధులను సక్రమంగా నిర్వర్తించని వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించబోమని, ఉద్యోగులు తమ పనితీరును మార్చుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జిల్లా పంచాయతీ అధికారులతో సోమవారం మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగునీటి భద్రత తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ పాల్గొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ప్రతిరోజూ సాయంత్రం ఫాగింగ్ నిర్వహించడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి వారంలో ఒకరోజు 'డ్రై డే' నిర్వహించి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, రోడ్లపై గుంతలను పూడ్చి , నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

**గ్రామాలను ప్రత్యేక్షంగా పరిశీలించండి :**

డిపిఒలు, డిఎల్‌పిఒలు, ఎంపిఒలు గ్రామాల్లో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలను పంచాయతీ సెక్రటరీ పనితీరు మాడ్యూల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. శాఖ కార్యదర్శి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి వారం గ్రామాలను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. సిఇఒలు, డిపిఒలు, డిఆర్‌డిఒలు, సిఇలు, ఎస్‌ఇలు, ఇఇలతో ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెరిగితేనే గ్రామాభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. పాలక మండళ్లు ఏర్పాటైన నేపథ్యంలో మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పనితీరులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. పంచాయతీ నిధుల నిర్వహణ పారదర్శకంగా జరగాలని, ఇప్పటి వరకు చేసిన ఖర్చులకు సంబంధించి నివేదిక సమర్పించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.




# క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గం : మంత్రి వివేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విదేశీ భాషలు, ముఖ్యంగా జర్మన్ భాషను నేర్చుకునే విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి సూచించారు. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు. టామ్‌కామ్ కార్యాలయంలో సోమవారం జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్మనీలో ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో ఉన్న యువత కోసం టామ్‌కామ్ జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. భారతదేశంలో నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ, జర్మనీలో పనిచేసే వారికి లభించే వేతనాలు మన కరెన్సీ విలువలో ఎంతో అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. కొత్త భాషను నేర్చుకుని జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగాలు సాధించడం మన యువతకు ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు సమర్థవంతంగా భాషను నేర్చుకునేలా వారి హాజరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. ఏ భాషనైనా నేర్చుకోవాలంటే నిరంతర అభ్యాసమే విజయానికి మూలమని వివరించారు. ఇలాంటి భాషా శిక్షణ కార్యక్రమాలు యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను అందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకునేందుకు దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా 245 విద్యాసంస్థల వాహనాలపై కేసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాసంస్థలు పునః ప్రారంభం అయిన నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిందని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(జెటిసి) చంద్రశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకొని నడుపుతున్న వాహనాలు, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 245 విద్యాసంస్థల వాహనాలపై కేసులు నమోదు చేసి, ఫిట్‌నెస్ లేని 60 బస్సులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని రవాణా శాఖ తెలిపింది. ఫిట్‌నెస్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను వెంటనే సీజ్ చేయడం జరుగుతుందని జెటిసి హెచ్చరించారు. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లు, సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.

# జులైలోపు గీత వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

**లేకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు: గీత పని వారల రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గీత వృత్తిదారుల పెన్షన్, ఎక్స్‌గ్రేషియా, లైసెన్స్, సొసైటీల సమస్యలను జులై లోపు పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన అధ్యక్షతన సోమవారం గీత పని వారల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత వృత్తిలో చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలు, గాయపడి తీవ్రంగా నష్టపోయిన వృత్తిదారులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా బకాయిలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచడం సమర్థనీయం కాదని, రూ.10 కోట్లను తక్షణమే విడుదల చేయడంతో పాటు పెన్షన్ కోసం వేచి చూస్తున్న వందలాది మంది గీత వృత్తిదారులకు తక్షణమే పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పొందుతున్న వృత్తిదారుడు చనిపోయినప్పుడు భార్యకు ఇతర పెన్షన్ల మాదిరిగా చెల్లించాలని ఈ సందర్భంగా వారు కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ మాట్లాడుతూ గీత వృత్తిదారులకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వన పెంపకానికి 100 ఎకరాలు భూమి కేటాయించాలన్నారు. సంఘం కోఆర్డినేటింగ్ సెక్రెటరీ బొమ్మగాని నాగభూషణం మాట్లాడుతూ సంక్షేమ నిధిని రూ.ఐదు కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. డబ్బు వీర



స్వామి, పండ్ల రాములు, మారగోని ప్రవీణ్ కుమార్, కొండ కోటయ్య, చింతపల్లి పుల్లయ్య, డి యాదయ్య, చడల అంజయ్య, బైరు తిరుపతి, ఇ. రామ్మూర్తి, డి.నరేంద్ర ప్రసాద్, పొలగాని రవి కిషోర్, విజయ రాములు, బుడిగ సైదులు, గూడ రవి కిషోర్, పాలకూరి బాబు, విట్టల్ గౌడ్, కె.రాములు తదితరులు మాట్లాడుతూ వన పెంపకానికి భూమి, పనిముట్లు సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అన్ని సహకార సంఘాలు, టిఎఫ్‌టిలకు గ్రామాల ప్రాతిపదికన వన పెంపకం కు పది ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు షెడ్యూల్ ఏరియాలో అర్హులైన గీత వృత్తిదారుల సొసైటీలకు లైసెన్స్ ఇవ్వాలని, పెన్షన్‌ను రూ. 5వేలకు పెంచాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు.

# బాధితురాలిని అన్ని విధాలా ఆదుకోవాలి

**బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం జిల్లా తల్లంపాడుకు చెందిన బాలికపై అత్యాచారం చేసి హత్య చేసేందుకు ప్రయత్నించిన నిందితుడిని శిక్షించడమే కాకుండా బిసి కుటుంబానికి చెందిన బాలికను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని, వారి కుటుంబ సభ్యులను సోమవారం బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ముఖ్యులతో కలసి పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితురాలైన బాలికకు న్యాయం జరగాలంటే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చట్టపరంగా నిందితుడిని కఠినాతి కఠినంగా శిక్షించాలని కోరారు. ఆయన వెంట బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.దశరథ, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధీటీ నరసయ్య తదితరులు ఉన్నారు.


**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని వివరణ | అంచనా విలువ | ప్రారంభ తేదీ & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 10/DB/ EE-II/Bowenpally Circle/ MMC/2026-27, తేదీ: 15.06.2026 | 1. ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, బోయిన్‌పల్లి సర్కిల్-03 పరిధిలో వివిధ ప్రాంతాలలో 5 నెలల కాలానికి BT / CC ప్యాచ్ మరియు క్యాచ్‌పిట్ మరమ్మతు పనులతో కూడిన రహదారి భద్రత నిర్వహణ పనులు (మొత్తం 5 పనులు). | రూ. 60.70 లక్షలు | 16.06.2026 మ.3.00 గం.లకు | 19.06.2026 మ.3.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, బోయిన్‌పల్లి సర్కిల్-3, ఎంఎంసి.
DIPR R.O. No. : 4291-PP/CL/ADVT/2026-27, Date: 15-06-2026

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో విద్యార్థి సైబర్ మోసానికి గురైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని ఆర్ కామేష్(21) బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. యూట్యూబ్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించిన వీడియోలు చూస్తుండగా సూర్య ఎక్స్ ట్రేడర్స్ అనే టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పరిచయమై వ్యక్తులు అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి ట్రేడింగ్ మెంబర్‌షిప్ డిమ్యాట్ అకౌంట్ నిర్వహణ వివిధ పార్టీల పేరుతో పలుమార్లు డబ్బులు చెల్లింపచేశారు. అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వకుండా మరిన్ని చెల్లింపులు కోరడంతో మోసం జరిగిన ట్లు బాధితుడు గుర్తించాడు. బాధితుడికి సుమారు లక్ష 28 వేల 828 నష్టం జరిగినట్లు ఫిర్యాదులో తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## కేశ్వాపూర్‌కు నూతన బస్ సర్వీస్ ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపల్ కేశ్వాపూర్‌కు కుషాయిగూడ డిపో నుంచి నూతన ఆర్‌టిసి బస్ సర్వీస్‌ను జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్‌లు సోమవారం ప్రారంభించారు. గత కొంతకాలంగా కేశ్వాపూర్‌కు బస్ సర్వీస్ లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామ స్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవ ర్ధన్‌రెడ్డి ఇట్టి సమస్యను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా డిపో మేనేజర్ వేణుగోపాల్‌తో మాట్లాడి కేశ్వాపూర్‌కు నూతన బస్ సర్వీస్‌ను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా నూతన బస్‌ను ప్రారంభించిన జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహ యాదవ్‌లు మాట్లాడుతూ నూతన బస్ సర్వీస్‌ను ప్రజలు, విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. బస్సును మంజూరు చేసినందుకు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోట కూర వజ్రేష్‌యాదవ్‌కు, డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరిం చుకుని కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలికి వారికి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఎక్కడలేని విధంగా నూతన కార్య క్రమానికి ఎమ్మెల్యే స్వీకారం చుట్టారు. విద్యార్థులకు నూతన విద్యా సంవ త్సరం శుభాకాంక్షలు తెలిపి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## బాధిత చిన్నారి కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ఖమ్మం జిల్లా తాళ్లపాడు గ్రామానికి చెందిన 12 ఏళ్ల చిన్నారి తేజస్వినిపై ఇటీవల జరిగిన లైంగిక దాడి ఘటనను తీవ్రం గా ఖండిస్తూ, ప్రస్తుతం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారి తేజ స్విని కుటుంబ సభ్యులను బిసి హక్కుల సాధన సమితి నాయకులు పరామ ర్శించారు. ఈ సందర్భంగా బిసి హక్కుల సాధన సమితి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ, సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళి పాల ధనుంజయ్ నాయకులు మాట్లాడుతూ నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారుల ను కోరారు. చికిత్స అవసరాల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపా ధ్యక్షుడు దశరథ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసయ్య, బిసి హక్కుల సాధన సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాత్‌రాజు, నరసమ్మ, రాష్ట్ర నాయకుడు కె.మనచారి, తదితరులు పాల్గొన్నారు

## సమ్మె విరమించిన భవన నిర్మాణ కార్మికులు

**ప్రజాపక్షం/జవహర్‌నగర్/మల్కాజిగిరి:** భవన నిర్మా ణ కార్మికులు తాపీ మేస్త్రీలతో తలెత్తిన సమస్యల నేపథ్యంలో చేపట్టిన సమ్మెను సోమవారం విర మించినట్లు కార్మికుల సంఘాలు పేర్కొన్నారు. పేదలపై ఆర్థిక భారం మోప కుండా ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచకుండా సమిష్టి నిర్ణయాలతో ముందుకు వెళుతామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ బాబు, రామన్న, రమేషాచారి, కమలాకర్, సంతోష్, యూనియన్ గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, అధ్య క్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, ఖాసిం, ప్రకటించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కార ణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఇ బాల్‌రాజ్ తెలిపారు. చర్లపలి డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్‌లోని 33/11 చర్లపల్లి 1 నుండి నాగారం ఫీడర్‌ను ఉదయం 10 గంటల నుండి 1 గంటల వరకు విద్యుత్ ను నిలిపివేడంతో భగవాన్ కాలనీ, రెడ్డి కాలనీ, టీచర్స్ కాలనీ, కట్టింగ్ కాలనీ, హై టెన్షన్ రోడ్, మారుతీ నగర్ ప్రాంతాలు, నాగార్జున నగర్ కాలనీ సబ్ స్టేషన్‌విష్ణూహోమ్స్ ఫీడర్‌ను మధ్యాహ్నం 2 గంటల నుండి 5.30గంటల వరకు నిలిపివేయడంతో శుభోదయ కాలనీ, శివసాయి నగర్, లక్ష్మి నరసింహ కాలనీ, మధురానగర్, నాగార్జుననగర్ కాలనీ రోడ్ నంబర్1 ప్రాంతాలతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

# పూడికతోనే పెరుగుతున్న వరద ముప్పు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో నాలా లపై నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్లాబు ల వల్ల డీసిల్టింగ్‌కు వీల్లేకుండా పోయిం దని, ఫలితంగానే వరద ముప్పు పెరుగుతోం దని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. ట్రాఫిక్ జాయింట్ సిపిడి. జోయెల్ డేవిస్, ఇతర అధికారులతో కలిసి సోమవారం కొండాపూర్ జూబ్లీ గార్డెన్స్, శంషాబాద్, అత్తాపూర్, రామ్‌దేవ్‌బాబాన గర్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిం చారు. వందల మీటర్ల మేర స్లాబ్‌లు మూసే యడం వల్లే చెత్త పేరుకుపోయి, మొండికుంట, ముల్లకత్వా చెరువుల్లోకి వెళ్లాల్సిన వరద నీరు జూబ్లీ గార్డెన్స్‌ను ముంచెత్తిందని అధికారులు కమిషనర్‌కు వివరించారు.

**యుద్ధప్రాతిపదికన చర్యలు..**

కమిషనర్ ఆదేశాలతో జూబ్లీ గార్డెన్స్‌లో నాలాల పై స్లాబులను తొలగించి హైడ్రా సిబ్బంది పూడి కతీత పనులు ప్రారంభించారు. డీసిల్టింగ్ అనంతరం ప్రతి 3 మీటర్లకు తెరిచే వీలుండేలా ఓపెన్ నాలాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డు, పి.వి. ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెంబర్లు 265, 191 వద్ద కూడా ఇన్‌లెట్లు, మురుగు కాలువలు పూడుకుపోవడం వల్లే నీరు నిలుస్తోం దని స్పష్టం చేశారు. వారం రోజుల్లోగా ఈ సమ స్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఇరిగే షన్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని హైడ్రా అసెట్ విభాగం ఇన్‌స్పెక్టర్లను కమిషనర్ ఆదేశించారు.

**జిహెచ్‌ఎంసిలో వర్షాకాల పారిశుద్ధ్య డ్రైవ్**

వర్షాకాల నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్య,




ప్రజారోగ్య చర్యలను మరింత ముమ్మరం చేయాలని జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. కొనసాగుతున్న ప్రత్యేక పారి శుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా అన్ని జోన్‌లు, సర్కిళ్లలో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నా రు. జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, కావడిగూడ సర్కిళ్ల లో వర్షపు నీటి కాలువల శుభ్రపరిచే పనులు, పూడిక తొలగింపు, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల పరిశుభ్రత, రోడ్డు పక్కన ఉన్న కాలు వల శుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహిం చారు. కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు దోమల లార్వా నిర్మూలన, ఫాగింగ్, వాహక నియంత్రణ చర్య లు చేపట్టారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రత, నీటి నిల్వ నివారణ, వ్యర్థాల వేరు వేరు సేకరణపై ప్రజ లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమా లను జోనల్, సర్కిల్ స్థాయి అధికారులు నిశి తంగా పర్యవేక్షిస్తూ వర్షాకాలంలో ప్రజా రోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.

## ఖైదీల పునరావాసం, నైపుణ్యాభివృద్ధి బలోపేతం : డిజి సౌమ్య

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి కేంద్ర కారాగారంలోని ప్రభుత్వ పారిశ్రా మిక శిక్షణా సంస్థ (ఐటిఐ) ఏర్పాటు సన్నాహకాలను తెలంగాణ జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా సమీక్షించారు. ఖైదీల పునరావాసం, నైపుణ్యాభి వృద్ధిని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ కారాగార శాఖ చర్లపల్లి కేంద్రకారాగారం ప్రాంగణంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్ష ణా సంస్థ(ఐటిఐ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారని, ఐటిఐ ద్వారా ఖైదీలకు ఉపాధి ఆధారిత సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణ అందించి పరి శ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుం దని ఆమె తెలిపారు. డిజితో సహ హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఉమెన్ విద్యార్థులు సందర్శించారు. పారిశ్రామిక విభాగ ప్రాంతీయ సంచాలకు లు రవి చిలుకోటి, ఎన్‌ఎస్‌ఐ ఫర్ ఉమెన్ సంయుక్త సంచాలకులు, ప్రిన్సి పాల్ ప్రియా కార్యక్రమాల గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఐజి



మురళీబాబు, డిఐజి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం ఖాలిద్, పర్యవేక్షణాధికారి ప్రమోద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో తరగతి గదుల నిర్మాణం

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** దేవరయాంజాల్ ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదులు శిథిలా వస్థకు చేరుకున్నాయని వాటి స్థానంలో కొత్తగా ఆధునిక సౌకర్యాలతో తరగతి గదులను నిర్మిం చేందుకు కృషి చేస్తానని టిపిసిసి ప్రధాన కార్య దర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు అన్నారు. సోమ వారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్, తూంకుంట, పోతాయిపల్లి, సింగాయిపల్లి ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్త కాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిపి సిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యా లను సాధించాలని చెప్పారు.

పాఠశాలలో పది గదులు శిథిలావస్థకు చేరు కున్నాయని వాటి స్థానంలో నూతనంగా పది తరగతి గదులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. పాఠశాలలో మౌళిక వసతులు, తాగునీటి సదుపాయం, పారి శుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులతో చర్చించి అవసరమైన అభివృద్ధి పను లపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు గ్రామీణ ప్రాంత విద్యార్థు ల భవిష్యత్తుకు పునా దులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కమలాకర్, ప్రధానోపాధ్యాయులు బాలేష్, పాఠశాల చైర్ పర్సన్ మీనా, దేవాలయ మాజి చైర్మన్ లక్ష్మి నారాయణ, రోహిత్‌రెడ్డి, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి ముందుకు సాగుతామని టిపిసిసి ప్రధాన కార్య దర్శి పీసరి మహిపాల్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట డివిజన్ పోతాయిపల్లిలోని రోడ్లు, డ్రైనేజిలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి ఇతర అంశాలను గ్రామంలో పర్యటించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతాయిపల్లి గ్రామం లోని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు గ్రామస్థుల తో కలిసి న్యూ కాలనీతో పాటు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యలను ప్రత్యక్షంగా పరిశీలించామని చెప్పారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, మురళిగౌడ్, నర్సింహారెడ్డి, బల్వంత్‌రెడ్డి, దర్శన్ గౌడ్, రాముగౌడ్, ప్రవీన్‌గౌడ్, కాలనీ అసోసియే షన్ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## అమ్మ మాట - అంగన్‌వాడీ బాట కార్యక్రమం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూంనగ ర్‌లో సోమవారం 'అమ్మ మాట–అంగన్‌వాడి మాట' కార్య క్రమా న్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఒ రేణుక, బిఆర్‌ఎస్ నాయ కురాలు శశికళ హాజరయ్యారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల పేర్లను అంగన్‌వాడి కేంద్రాల్లో నమోదు చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారుల శారీ రక, మానసిక వికాసానికి అంగన్‌వాడి కేంద్రా లు కీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సూపర్‌వైజర్ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకురాలు వరమ్మ, ఉమా, రేణుక, అండాలు, తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు తొలగించాలి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** అనారోగ్యాలకు దారి తీస్తున్న జవహర్‌నగర్ రాంకీ నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలంటూ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట కమిటి కోరింది. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం జేఏసి ప్రతినిధులు షేక్‌షావలి, తోటపల్లి శంకర్, టి.శివన్నారాయన,సదా నందంలు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నిర్వహిస్తున్న రాంకీ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల నుండి సైతం చెత్తను ఇక్కడ పడేస్తుండటం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. డంపింగ్ యార్డు తొలగించని పక్షంలో తాము ఆందోళనలు అంచెలంచెలుగా ఉధృతం చేస్తామన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు

### కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** నకిలీ విత్తనాలు విక్ర యించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లాకలెక్టర్ దీపక్‌తివారి అదేశిం చారు. వానకాలం సీజన్‌కు సంబంధించిన ఎరు వులు విత్తనాల విక్రయాలపై క్రమబద్ధీకరణ, నియంత్రణపై కొడంగల్ నియోజకవర్గం వ్యవ సాయ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. ఎవరైన డీలర్లు నిర్దేశించిన వాటి కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని టా స్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవకత వకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలి పారు. వ్యవసాయఅధికారులు రైతులకు అందు బాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు తలెత్త కుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు విధుల పట్ల



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రైతు భీమ, రైతు భరోసా తదిత రపథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులుఎరు వుల, విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు రిజి స్టర్‌లలో నమోదు చేయాలని తెలిపారు. ప్రజాప్ర తినిధుల, ఇతర శాఖల అధికారులను భాగస్వా ములను చేసి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని సూచించారు. రాష్ట వ్యాప్తంగా ప్రభుత్వం సన్నరకం బియ్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సన్న రకం వరిని సాగుచేసినవారికి 500 రూపాయిల బోనస్ చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ ఉమాశం కర్ ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వ రాజ్,గుట్టారు, జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం,వ్యవసాయ సహకార సంచాల కులు, మండల వ్యవ సాయ విస్తరణ అధికా రులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి వచ్చిన దరఖుస్తులను త్వరితగతిన పూర్తి చేయాలిః** ప్రతి సోమవారం కలెక్ట ర్ కార్యా లయంలో నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతలనుండి వచ్చిన ప్రజల నుండి 133 దరఖాస్తు లు స్వీకరించడం జరిగింద న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సకంలో పరి ష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం, ఉపాధి, భూసర్వే తదితర అంశాలపై ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటాచారి, ఉమశంకర్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మాకూ కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్ ఇప్పించాలి

### ప్రజావాణిలో జిల్లా కలెక్టరేట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మొర

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే హౌస్ కీపింగ్ ఉద్యోగులు కనీస వేత నాలు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి కనీస సౌకర్యాలు నోచుకోలేక పోతున్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఈ విషయమై గతంలో విన్నవించుకొన్న సందర్భంగా సానుకూలంగా స్పందించ సమస్య పరిష్కరించాలంటూ డిఆర్‌ఓకు చెప్పినా ఆయన మాటకు విలువ లేదన్న విధంగా నేటికీ ఫలితం లేకపోయిందని వారంతా వాపోతున్నారు. దీంతో వారంతా కల్సి చివరికి ప్రతి సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్న కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వాల్సిన పరిస్థితి ఎదురైంది. ప్రజావాణిలో లిఖితపూర్వకంగా వినతి పత్రం ఇచ్చిన అనంతరం హౌస్‌కీపింగ్ ఉద్యోగులు తమ సమస్యను మీడియా ముందు ఆవేదనతో వెళ్లబుచ్చారు. తాము గత పదేళ్లుగా కలెక్టరేట్ కార్యాలయం లో వాత్సల్య ఏజన్సీ ఆధ్వర్యంలో హౌస్ కీపింగ్ పనులు చేస్తున్నామని, కార్మిక నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా సదరు సంస్థ అనేక సంవత్సరాలు నెలకు రూ.6వేలు వేతనంగా ఇచ్చారని, పలుసార్లు అడుగుతుండటంతో రెండేళ్ల క్రితం నుండి రూ.10 వేలు ఇస్తున్నారని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు ఇవ్వటం లేదని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఈ పరిస్థితి ఉంటే రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే హౌస్ కీపింగ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా రూ.22 వేలు ఇస్తూ ఈఎస్ఐ, పిఎఫ్ ఇస్తున్నారని తెలిపారు. ఇప్పటి కైనా కలెక్టర్ నామమాత్రంగా స్పందించకుండా రంగారెడ్డి జిల్లా తరహాలో వేత నాలను పెంచి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

## హెచ్‌ఐవి నియంత్రణకు కొత్త వైద్య దిశ

### జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** లైంగిక మార్గంలో వ్యాపించే ఇన్ఫెక్షన్లు (ఎస్టీలు) హెచ్ ఐవీపై క్లినికల్ అవగాహన ఆధునిక నిర్ధారణ పద్ధతులు అభివృద్ధి చెందుతున్న చికిత్సా విధానాలపై సమగ్ర చర్చ హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న నీలిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించిన నిరం తర వైద్య విద్యా కార్యక్రమంలో జరిగింది. ఎస్టీలు హెచ్‌ఐవీపై క్లిని కల్ అవగాహన నిర్ధారణలో కీలక అంశాలు అభివృద్ధి చెందుతున్న చికిత్సలు అనే అంశం పై జరిగిన ఈసిఎంఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మార్గదర్శ కత్వం అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, యూనివర్సిటీ సీఈఓ నీలిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ లక్ష్మీ ప్ర సన్న అందించారు. చర్మవ్యాధులు, సుఖవ్యాధులు, కుష్టు వ్యాధుల విభాగాధి పతి డాక్టర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్ సహకారంతో జరిగిన ఈసి ఎంఈలో రాష్ట్ర స్థాయి వైద్య నిపుణులు పాల్గొని తాజా పరిశోధన లు నిర్ధారణ పద్ధతులు చికిత్సా మార్గాలపై విశ్లేషణాత్మక ప్రసంగాలు చేశారు. ఎస్టీఐలు హెచ్ ఐవీ నియంత్రణలో ఆధునిక వైద్య పరిజ్ఞానం వినియోగం అత్యవసరమని నిపు ణులు అభిప్రాయపడ్డారు. కొత్త చికిత్సా విధానాలు తొందరగా గుర్తించే నిర్ధా రణ పద్ధతులు భవిష్యత్ వైద్య రంగానికి కీలకమని ఈ వేదికలో స్పష్టం చేశారు.





## ప్రజాసేవకుడు మందలపు సాయిబాబు చౌదరి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కెపిహెచ్‌బి కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజామనిషి, సామాజిక సేవకుడు మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, అనుచరులు, మిత్రులు, స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అభిమాను లు పుష్పగుచ్ఛాలు, గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజే శారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ మందలపు సాయిబాబు చౌదరి గత 25 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ నిరంతరం సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కరోనా మహమ్మారి సమయంలో నిత్యావసర సరుకుల పంపిణీ, వరదలు ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పేదలకు వైద్య సహాయం అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తరించాలని ఆకాంక్షించారు.

## కొత్త యాప్ ద్వారానే ఎరువులు కొనుగోలు : వ్యవసాయాధికారి చంద్రకళ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులు కొత్త ఫెర్టిలైజర్ యాప్ ద్వారానే అన్ని రకాల ఎరువులను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ అన్నారు. సోమవారం అలియాబాద్‌లోని రైతు వేదికలో రైతులకు, ఫెర్టిలైజర్ల డీలర్లకు కొత్త ఫెర్టిలైజర్ యాప్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాదికారి చంద్రకళ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ సీజన్‌లో కొత్త యాప్ ద్వారానే అన్ని రకాల ఎరువులను పొందాలని సూచించారు. ఈ కార్య క్రమంలో మండల వ్యవసాయాదికారి రమేష్, విస్తరణ అధికారులు సుదీర్‌కు మార్, శ్రీనాద్, మండల రైతులు ముద్దం సంజీవరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుధా కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లిలో..** మూడుచింతలపల్లి మున్సిపల్లోని రైతు వేదికలో మండల వ్యవసాయాదికారి ప్రవీన రైతులకు కొత్త యాప్‌పై ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొత్త యాప్ ద్వారానే ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. ఫెర్టిలైజర్ డీలర్లకు కొత్త యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వార రైతులకు పెట్టు బడి ఖర్చులు తగ్గడమే కాకుండా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకో వడానికి వీలవుతుందన్నారు. ఈ శిక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను వివ రించారు. డీలర్ల పాత్ర, వాలంటీర్ల భాధ్యత, రైతు సోదరులకు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు.

## చెరువులో మునిగి ఇద్దరు యువకులు మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చెరువులో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ ఆంజ నేయులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం సమయంలో తిమ్మాయిపల్లికి చెందిన ముగ్గురు యువకులు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. వీరిలో తిమ్మాయిపల్లికి చెందిన జోసఫ్ సురక్షి తంగా బయటపడగా కెవిన్ ఆంటోని(19) నీటిలో మునిగి మృతి చెందాడు. మృత దేహాన్ని స్థానికులు, సహాయక సిబ్బంది చెరువు నుండి వెలికితీశారు. మరో యువకుడు వాలెంటైన్ టోనీ(18) చెరువులో గల్లంతై మృత దేహం లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

GREATER HYDERABAD మహానగరి
హైదరాబాద్
మంగళవారం
16-06-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## రైతులు కూరగాయ పంటలు సాగు చేసుకోవాలి : ఎంపిడిఒ రాధరాణి



**ప్రజాపక్షం/యాచారం :** తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు ఇచ్చే కూరగాయ పంటలను సాగు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి రాధరాణి అన్నారు. సోమవారం యాచారం ఎంఎం ఎస్ కార్యాలయంలో మహిళా రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జనరల్ బాడి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంపిడిఒ రాధారాణి హాజరై మాట్లాడారు. వ్యవసాయం సాగులో ఎలాంటి సమస్యలున్న పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రవింధర్, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి : డిసిపి అనురాధ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వర్షాల ప్రభావంతో కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని ఎల్‌బి నగర్ డిసిపి అనురాధ పేర్కొన్నారు. సోమవారం వనస్థలిపురం పరిధిలోని వర్షాలతో కాలనీ మునిగే ప్రాంతాలను ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్, వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి నవీన్‌రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సదర్భంగా డిసిపి అనురాధ మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సిబ్బందిని సూచించడం జరిగింది. కార్యక్రమంలో వనస్థలిపురం ఎస్‌హెచ్ఒ రవిబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రేపు ఆరుట్లలో సిఎం పర్యటన



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఈ నెల 17న తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రారంభానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. బుధవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఫ్యూచర్ సిటి కమీషనర్ తరుణ్ జోషి పర్యటించి,హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. పర్యటనలో ఆర్‌డిఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## డిప్యూటీ సిఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిసిన నేతలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. సోమవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నివాసంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉమ్మెంత్యాల కృష్ణారెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధ్యాయుల కొరత విద్యా ప్రమాణాలపై ప్రభావం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఉపాధ్యాయుల కొరత విద్యా ప్రమాణాలపై పడే అస్కారం ఉంటుందని, నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు కోరారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలను స్థానిక సర్పంచ్ ఎంసి ప్రవీణ్, గ్రామస్తులతో కలిసి పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, అందూరి అంజయ్య, వెంకటేష్ గౌడ్, బి.నర్సింలు, జి.జంగయ్య, మహమ్మద్‌తోపాటు విద్యార్థులు ఉన్నారు.

## నిధులు కేటాయించాలని వినతి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని తాడిపర్తి గ్రామ సర్పంచ్ నీలం ఘూన్సి రమేశ్ సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి గ్రామానికి నిధులు కెటాయించి అదుకోవాలని కోరారు. అందుకు ఎంఎల్‌ఏ సానుకూలంగా స్పందిచారని తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ మారమూల గ్రామమైన తాడిపర్తికి నిధులు కెటాయించి గ్రామాభివృద్ధికి సహకరించగలరని కోరారు.

# మన బిడ్డల భవిష్యత్తే మన రాష్ట్ర సంపద

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
### కెజిబివి బాలికల మధ్య డిప్యూటీ సిఎం బర్త్‌డే వేడుకలు





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర సంపద అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సిఎం) భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ కెజిబివి బాలికల మధ్య డిప్యూటీ సిఎం భట్టి, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి తదితరులతో కలిసి బర్త్‌డే' వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ భోజనం చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను ఆత్మీయ వాతావరణంలో విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కెజిబివి) ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సిఎం విద్యార్థినులతో పాటు కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యతను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మన బిడ్డల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార (బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఇంటర్ చదువుతున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల పిల్లలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు నాణ్యమైన యూనిఫామ్‌లు, షూస్ అందిస్తున్నట్లు తెలిపారు. "నేటి విద్యార్థులే రేపటి మానవ వనరులు, రాష్ట్ర సంపద. వారి విద్యా, ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడదు. పోషకాలతో కూడిన ఆహారం అందిస్తేనే విద్యార్థులు శారీరకంగా, మానసికం గా ఎదిగి పోటీ ప్రపంచంలో రాణించగలరు" అని భట్టి పేర్కొన్నారు. గత పదేళ్లలో డైట్ ఛార్జీలు పెంచకపోవడం వల్ల విద్యార్థులు పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడ్డారని భట్టి విమర్శించారు. విద్యార్థులు పడుతున్న అవస్థలను గమనించిన ప్రజాప్రభుత్వం 40 శాతం డైట్‌చార్జీలు, 200శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. మొయినాబాద్ కస్తూరిబా గాంధీ రెసిడెన్షియల్ పాఠశాలలో అదనపు గదుల కోసం ఎస్టిమేషన్ వేసి పంపినట్లయితే ముఖ్యమంత్రితో మాట్లాడి తప్పనిసరిగా నిధులు మంజూరు చేయిస్తానని భట్టి హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాలకు సంబంధించి పెండింగ్‌లో పెట్టిన డైట్, కాస్మోటిక్ బిల్లులను ప్రజా ప్రభుత్వం "గ్రీన్ ఛానల్" ద్వారా విడుదల చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలు పస్తులతో ఉండకూడదనే లక్ష్యంతోనే సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అల్పాహార పథకాన్ని ప్రారంభించామన్నారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటిరోజే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఇవ్వడంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నేత భీమ్ భరత్ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అధ్యక్షత వహించగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు చల్లా నరసింహారెడ్డి, అన్వేష్ రెడ్డి, కోట్నాక్ తిరుపతి, సిడబ్ల్యుసి సభ్యులు రుద్రరాజు, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పాఠశాల పాఠశాల ప్రిన్సిపల్ జయశ్రీ పాల్గొన్నారు.

## డయేరియా నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో కార్యక్రమం, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ఆసుపత్రుల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కోరారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జూలై 13న నిర్వహించనున్న కార్యక్రమం గురించి అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి వివరించారు. సమావేశంలో వివిధ శాఖల ప్రతినిధులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలపై ముందస్తు అప్రమత్తత





### జలమయ ప్రాంతాల్లో అధికారుల సంయుక్త తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షాకాలంలో నగరాన్ని ముంచెత్తే నీటి నిల్వలు, ట్రాఫిక్ సమస్యలకు ముందస్తు చెక్ పెట్టేందుకు హైదరాబాద్ అధికారులు రంగంలోకి దిగారు. రాజేంద్రనగర్, శంషాబాద్ పరిధిలో తరచూ జలమయమయ్యే ప్రాంతాలను హైడ్రా, ట్రాఫిక్ పోలీసులు, లా అండ ఆర్డర్ పోలీసులు, జిహెచ్‌ఎంసి అధికారులు సోమవారం సంయుక్తంగా పరిశీలించి, తక్షణ నివారణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడడమే లక్ష్యంగా హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే , శంషాబాద్ జోన్ డిసిపి బి.రాజేష్, జిహెచ్‌ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్ బాబా వాటర్‌లాగింగ్ పాయింట్, పివిఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేలోని పిల్లర్ నంబర్ 265, పిల్లర్ నంబర్ 191 ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి కాలువల సామర్థ్యం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను సమీక్షించి సంబంధిత శాఖల సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో పిల్లర్ల పరిసరాల్లో పేరుకుపోయిన పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలను అత్యవసరంగా తొలగించాలని సూచించారు. అలాగే నీరు నిలిచిపోయే ప్రాంతాల్లో అధిక సామర్థ్యం గల డీవాటరింగ్ పంపులను సిద్ధంగా ఉంచాలని నిర్ణయించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక వర్షాకాల అత్యవసర బృందాలను ఏర్పా టు చేయనున్నారు. అవసరమైతే ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టడం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా వాహనదారులకు హెచ్చరికలు జారీ చేయడం, నిలిచిపోయిన వాహనాలను క్రేన్ల సహాయంతో తొలగించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా హైడ్రా, జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ పోలీసు విభాగాల మధ్య 24 గంటల సమన్వయం కొనసాగిస్తూ, భారీవర్షాల సమయంలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించనున్నారు. వరద నీటి కాలువలపై విరిగిన గ్రేటింగ్‌లను మరమ్మతు చేయడంతో పాటు రక్షణ జాలీలను బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌకర్యాల పరిరక్షణే తమ ప్రథమ ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేస్తూ, వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగాపనిచేస్తున్నాయని తెలిపారు.

# గ్రామాల రాకపోకలకు శాశ్వత పరిష్కారం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామీణ ప్రాంత ప్రజల రాకపోకలకు శాశ్వత పరిష్కారం చూపించినట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం కొందుర్గు మండల పరిధిలోని గంగన్నగూడ గ్రామం వద్ద రూ.1.25కోట్ల హెచ్ఎండిఏ నిధులతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు.

### షాద్‌నగర్ విద్యార్థినికి అభినందనీయం



కొందుర్గు గ్రామానికి చెందిన జి.భవ్య తేజిని బాక్సింగ్‌లో సాధిస్తున్న విజయాలకు గుర్తుగా రూ.20వేల నగదు ప్రోత్సహకాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు. డాక్టర్ జిల్లెల జంగయ్య, పరిమళారాణి కుమార్తె భవ్య తేజిని ( మహేంద్రహిల్స్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యను అభ్యసిస్తూ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరుస్తుంది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, సయ్యద్ సాధిక్, పురుషోత్తంరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, కేకే కృష్ణ, రామస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ ముఖ్యమైందని, త్వరగా భూసేకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్‌తో వీర్లపల్లి శంకర్ భేటి అయ్యారు.

## మొహర్రం ఏర్పాట్లు పూర్తిచేయాలి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మొహర్రం పండుగ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టరేట్‌లో 2026 మొహర్రం పండుగ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. మైనారిటీ వర్గాల పెద్దలు మొహర్రం పండుగ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలపై సమగ్రంగా చర్చించి సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, మొహర్రం వేడుకలు ప్రశాంతంగా, సంతోషకర వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొహర్రం పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకొని, శాంతి భద్రతలు మరియు ప్రాథమిక సౌకర్యాల కల్పనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కోట్ల నవీన్ కుమార్‌రెడ్డితో పాటు పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ,మిషన్ భగీరథ, వైద్యారోగ్య శాఖ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ శాఖల అధికారులు, మైనారిటీ వర్గాల పెద్దలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు జాడుకట్టలు ఇవ్వని అధికారులు

### మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్ పూర్‌లో మున్సిపల్ కార్యాలయం ముందు సోమవారం రంగారెడ్డి జిల్లా ఎఐటియుసి కార్యదర్శి ఎస్.మల్లేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ధర్నాకు రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలల నుండి పనిముట్లు ఇవ్వకుండా అధికారులు కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కార్మికులు వారు సొంతంగా డబ్బులు పెట్టుకుని జాడుకట్టలు కొనుకొచ్చి విధులు నిర్వహిస్తున్న అధికారులు చూసు చూడనట్లు వివరిస్తున్నారు. ఐదు నెలలకు కార్మికులకు రెండు చీపురు కట్టలు ఇవ్వాడం జరిగింది. అవి కూడా చీపురు కట్టలు ఇచ్చినటువంటివి ముక్కిపోయి ఉన్నటువంటి జాడుకట్టలు ఇవ్వడం జరిగింది. వర్షాకాలం రోడ్డు పక్కల ఉన్నటువంటి చెట్లను, మోరి లో ఉన్నటువంటి మట్టిని తీయాలంటే పారలు ఇతర పనిముట్లు ఇవ్వకుండా కార్మికులను విధులు నిర్వహించాలని చెప్పడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. ధర్నా అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో చెన్నయ్య, నర్సింగ్ రావు, అండాలు, నిర్మల, భారతమ్మ, యాదమ్మ, శాంతమ్మ, వెంకటమ్మ, చెన్నమ్మ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బిఎన్‌రెడ్డి నగర్‌లో ఆహ్లాదకరమైన పార్కు అభివృద్ధి

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్
### 18న సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వనమహోత్సవం ప్రారంభం
### సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంత వాసులకు కెబిఆర్ పార్కు లాగా ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కు ఏర్పాటు కాబోతుందని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈనెల 18న బిఎన్ రెడ్డి నగర్‌ను అనుకొని ఉన్న ఫారెస్టులో వన మహోత్సవం కార్యక్రమాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్, డిఎఫ్ఒ రోహిత్‌రెడ్డి, ఎసిపి కాశిరెడ్డితో కలిసి సిఎం కార్యక్రమ ఏర్పాట్లను మధుయాష్కీ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ ఎల్‌బి నగర్ నియోజకవర్గ ప్రజలకు 116 ఎకరాల్లో పార్కు అందుబాటులోకి రావడం అదృష్టమన్నారు. 30 ఏళ్లుగా ఉన్న ఇళ్ల స్థల వివాదాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పరిష్కరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. పార్కుగా అభివృద్ధి చేయడమే కాకుండా రూ. 20 కోట్లతో బి ఎన్ రెడ్డి నగర్ పరిసర ప్రాంత ప్రజలకు వరద, డ్రైనేజీ నీటి సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైన్, డ్రైనేజీ లైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని, హైదరాబాద్ నిధులన్నీ కాళేశ్వరాన్ని తరలించారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇక్కడి నిధులను నగర ప్రజలకే ఖర్చు పెడుతూ అభివృద్ధి, మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిఎఫ్ఒ శ్రీనివాస్, ఎఫడిఒ బాల్జీ రావ్, వెంకటయ్య, ఎఫ్ఆర్ఒ శ్రీనివాస్‌రెడ్డి, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు గణేష్‌రెడ్డి, రఘుమారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుజాతారెడ్డి, రజిని రావు, వినయ్ పాటేల్ తదితరులు పాల్గొన్నారు.

# క్యూర్‌లో స్పెషల్ డ్రైవ్

● పక్కాగా మాన్‌సూన్ సన్నద్ధత ● నేటి నుంచి ట్రీ ట్రీమింగ్ పనులు ● క్షేత్రస్థాయిలోకి సిఎండి జితేష్ పాటిల్



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: వర్షాకాలంలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా టిజిఎస్‌పిడిసిఎల్ 'పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్' చేపట్టింది. ఈ క్రమంలోనే సోమవారం ఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ పాటిల్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు.ఉదయం 9:30 గంటలకు సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 11 కేవీ వేణుగోపాల్‌నగర్ ఫీడర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫీడర్ వెంబడి పాదయాత్ర చేస్తూ విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు, కండక్టర్లు,ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. క్యూర్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో 33 కేవీ సబ్‌స్టేషన్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టి నెట్‌వర్క్‌ను సమగ్రంగా తనిఖీ చేసి వర్షాకాలానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నాణ్యత, లైన్ క్లియరెన్స్, నిర్వహణ పనులు, పరికరాల స్థితిగతులు, నెట్‌వర్క్ పనితీరును సీఎండీ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యుత్ అంతరాయాలకు దారితీసే సమస్యలను ముందుగానే గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**మాన్‌సూన్ సన్నద్ధత..**

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని తిరుమలగిరి సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 11 కేవీ వేణుగోపాల్ నగర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో మున్సూన్ సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జోన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సూన్ సన్నద్ధత పనులు, నిర్వహణ కార్యక్రమాలు, విద్యుత్ సరఫరా విశ్వసనీయత, ట్రీ ట్రిమ్మింగ్, లైన్ క్లియరెన్స్, వినియోగదారుల సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఇదిలాఉండగా.. జీహెచ్ఎంసీ పరిధిలో విస్తృత స్థాయిలో ట్రీ ట్రిమ్మింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా టీజీఎస్పీడీసీఎల్ జీహెచ్ఎంసీ పరిధిలోని 11 కేవీ ఫీడర్లపై చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) పనులను జూన్ 16, 2026 నుంచి విస్తృత స్థాయిలో చేపట్టనుంది.ప్రత్యేక కార్యక్రమం నెలాఖరు వరకు కొనసాగనుంది. విద్యుత్ లైన్ల ను తాకే చెట్ల కొమ్మలను తొలగించడం ద్వారా షార్ట్ సర్క్యూట్లు, ఫీడర్ ట్రిప్పింగ్లు, విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు చర్యలు చేపడుతున్నారు.వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ వ్యవస్థను మరింత భద్రంగా ఉంచడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ పాటిల్ తెలిపారు.

# క్యూర్‌లో 177 కేసులు

రవాణా శాఖ విస్తృత దాడులు



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ఫిట్‌నెస్ లేని బస్సులను నడిపిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన బస్సులు, ఇతర వాహనాలపై రవాణా శాఖ కొరడా ఝులిపించింది. జూన్ 15 నుంచి చేపట్టిన ప్రైవేట్ బస్సుల తనిఖీలలో భాగంగా క్యూర్ పరిధిలో రవాణా శాఖ రూపొందించిన నియమ, నిబంధనలు పాటించని 177 వాహనాలపై కేసులు నమోదు చేయడం జరిగింది. అంతేకాకుండా 20 బస్సులను సీజ్ చేశారు. ఈ క్రమంలోనే ప్రత్యేక తనిఖీలలో... వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్ ఉన్నాయా? లేదా? అనేది పరిశీలిస్తారు. వాహనాలలో అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారా? ' డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, మరియు అనుభవం ఉందా? అనేది పరిగణలోకి తీసుకుంటారు. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లు, సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. విద్యాసంస్థలు విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు పూర్తి బాధ్యత సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలదేనని రవాణా శాఖ తేల్చిచెప్పింది. తల్లిదండ్రులకు కూడా రవాణా శాఖ ప్రత్యేక విజ్ఞప్తి చేస్తున్నది... అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించుకునే వాహనాలలో తమ పిల్లలను పంపవద్దని సూచించింది. ఫిట్నెస్ లేని లేదంటే ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలు తనిఖీలలో సీజ్ చేసిన పక్షంలో విద్యార్థులు మధ్యలో ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని.. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణించే వాహనాల ఫిట్నెస్, భద్రతా ప్రమాణాలు, అనుమతులపై ముందుగానే నిర్ధారించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## ప్రభుత్వ భూమిని పరి రక్షించండి

-హైదరాబాద్ కలెక్టర్‌కు బిఆర్ఎస్ నేతల విజ్ఞప్తి

ప్రజాపక్షం/కంటోన్మెంట్: రూ.800 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని బిఆర్ఎస్ నేతలు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ మేరకు తిరుమలగిరి మండలం తొకట్టలో ఉన్న 8 ఎకరాల 'పోరంబోకు సర్కారీ' ప్రభుత్వ భూమిగా గుర్తించడం జరిగిందని.. 1955 నుంచి ఉన్న రికార్డులు, 1975–76 భూ ఆక్రమణ చట్టం కింద జరిగిన చర్యలు, అలాగే పలు న్యాయపరమైన విచారణలు ప్రభుత్వ హక్కులను నిరంతరం సమర్థించాయని బిఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ తెలిపారు. ప్రస్తుతం ఈ భూమి ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లినట్లు, చుట్టూ ప్రహరీ నిర్మించినట్లు సమాచారం రావడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## చెత్త డంపింగ్‌యార్డ్ తొలగించాలి



ప్రజాపక్షం/ఫలక్‌నుమా: చెత్త డంపింగ్‌యార్డ్ తొలగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు బల్దియా జంగంమెట్ డివిజన్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. రవీందర్‌నాయక్‌నగర్ కాలనీ ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ వద్ద చెత్త డంపింగ్ యార్డ్ తీసివేయాలని... సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కిషన్ కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు.

## 19న ఇంటీరియర్ డిజైన్ షో ప్రారంభం



ప్రజాపక్షం/బంజారాహిల్స్: ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్ రంగాలలో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ద్వైవార్షిక ప్రదర్శన 'ఐఐఐడీ షోకేస్ ఇన్సైడర్ ఎక్స్ 2026' ను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఐఐఐడిహెచ్‌ఆర్‌సి చైర్‌పర్సన్ ఆర్కిటెక్ట్ ఎన్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల ప్రదర్శనను ముఖ్యఅతిథి తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని చెప్పారు. ఎగ్జిబిటర్ డైరెక్టరీని ఆవిష్కరిస్తారని మీడియాకు తెలిపారు.

## ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి



ప్రజాపక్షం/తెలుగువర్సిటీ: అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని బాచుపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో నిరుద్యోగులు, విద్యార్థులు తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. చిన్న నోటిఫికేషన్స్ కాకుండా ప్రభుత్వం ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోవాలని కోరారు. నిరసనలో కార్యక్రమంలో విద్యార్థి వేదిక సభ్యులు కోట్ల అఖిల్‌సాగర్, సోమయ్య, దేవీసింగ్ రాథోడ్, విజయ్, వీరాంజనేయులు, నవీన్, కళ్యాణ్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధికి బలమైన పునాది



ప్రజాపక్షం/సికింద్రాబాద్: విశ్వాసం, అభివృద్ధి, జనకళ్యాణం... అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి, సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో చారిత్రాత్మక మార్పులకు నాంది పలికిందన్నారు. మీడియా సమావేశంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇంచార్జ్ నందనం దివాకర్, సీనియర్ నాయకులు వెంకటరమణి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సికింద్రాబాద్ మహంకాళి ఉపాధ్యక్షుడు కనకట్ల హరి, ప్రధాన కార్యదర్శులు నందు, రమేష్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరోగ్య భద్రత ఎంతో ముఖ్యం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ప్రజాపక్షం/అమీర్‌పేట్: ఉరుకులు పరుగుల జీవితాలు, లోపిస్తున్న పోషక ఆహార పద్ధతులు నడుస్తున్న ఈ ఆధునిక యుగంలో ప్రజలకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. అమీర్‌పేట్ డివిజన్ ధరంకరం రోడ్డులో ఏర్పాటు చేసిన వర్నియా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఎండి డాక్టర్ జయదీప్ సింగ్, డాక్టర్ సిమ్రాన్ కౌర్ ఛబ్రా, డా.జయదీప్,మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, బిఆర్ఎస్ నేతలు కొలను బాల్‌రెడ్డి, ముత్యాల హనుమంతరావు, అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, గులాబ్‌సింగ్, గోపిలాల్ చౌహాన్, కూతురు నరసింహా, కొత్త బలరాం, ప్రదీప్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాపక్షం/ఖైరతాబాద్: భాగ్యనగరంలోని హిమాయత్‌నగర్‌లో కొలువైన వేంకటేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది. జూన్ 19న అంకురార్పణతో ప్రారంభమై.. జూన్ 24న ధ్వజారోహణంతో ముగియనున్నాయి. శేషవాహన సేవ, హనుమంత వాహన సేవ, సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, గజవాహన సేవ, శ్రీవారి శాంతి కల్యాణం, గరుడవాహన సేవ, రథోత్సవం, అశ్వవాహనసేవ, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, ధ్వాజావరోహణంతో స్వామివారి సేవలు ముగుస్తాయి. వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

## టాప్ 50 గ్రేట్ పీపుల్ మేనేజర్స్

జాబితాలో ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండి, సిఇఒ కేవీబీరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ ఎండి, సిఇఒ కేవీబీరెడ్డి ప్రతిష్టాత్మక గుర్తింపు పొందారు. 2026కి గాను గ్రేట్ మేనేజర్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన భారతదేశపు టాప్ 50 గ్రేట్ పీపుల్ మేనేజర్స్‌లో చోటు దక్కించుకున్నారు. అత్యుత్తమ నాయకత్వానికి ప్రమాణంగా ఇది పరిగణించడం జరుగుతుంది. విశ్వసనీయమైన పరిస్థితులను కల్పించడం, ఉద్యోగుల్లో సామర్థ్యాలను పెంపొందించడం, నిర్దిష్ట లక్ష్యంతో పని చేసేలా సంస్థలను తీర్చిదిద్దడంలో ముందుండే నాయకులను ఈ గుర్తింపు సముచితంగా గౌరవిస్తుంది. భారతదేశపు టాప్ 50లో చోటు దక్కించుకోవడమనేది, సంస్థ విజయానికి సిబ్బంది, సంస్కృతి, భాగస్వామ్యాలకు ప్రాధాన్యతనిచ్చేటువంటి కేవీబీ రెడ్డి సారథ్య సూత్రాలకు ప్రాధాన్యతను పునరుద్ఘాటిస్తుంది.

## దేశ తదుపరి గ్రోత్ 'ఆరెంజ్ ఎకానమీ'




ప్రజాపక్షం/బంజారాహిల్స్: వరల్డ్ ఈవెంట్స్ ఎకానమీ వీక్ 2026లో భాగంగా క్రియేటివ్ ఎకానమీ కాన్క్లేవ్ 2026' మొదటి ఎడిషన్ ఘనంగా ముగిసింది. భారతదేశ భవిష్యత్తును రూపొందించడంలో 'ఆరెంజ్ ఎకానమీ' (సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ) ప్రాధాన్యతను చర్చించేందుకు ఈ సదస్సు వేదికైంది. ఈవెంట్స్, వినోదం, మీడియా, పర్యాటకం, క్రియేటర్స్, సాంస్కృతిక రంగాలకు చెందిన దేశంలోని అత్యంత ప్రభావవంతమైన ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో బీడబ్ల్యు బిజినెస్‌వరల్ ఛైర్మన్, ఎడిటర్‌ఇన్‌చీఫ్ డాక్టర్ అనురాగ్ బాత్రా, విజ్క్రాఫ్ట్ ఇంటర్నేషనల్ ఎంటర్టైన్మెంట్ కోఫౌండర్ సబ్బాస్ జోసెఫ్, లక్ష్య మీడియా సిఇఒ షాజు ఇగ్నేషియస్, పర్సెప్ట్ లైవ్ ఛైర్మన్ హరీందర్ సింగ్ (హ్యారీ) పాల్గొని ప్రసంగించారు.

# విద్యతోనే సమాజంలో గౌరవం

ప్రభుత్వ బడుల్లో, గురుకులాల్లో పిల్లలను చేర్పించండి
'బడికిపోదాం' కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం /హిమాయత్‌నగర్: ప్రతి బిసి, ఎస్‌సి, ఎస్‌టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో లేదా గురుకులాల్లో చేర్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య కోరారు. నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ఇందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ బడుల్లో విద్య ద్వారానే కుటుంబంలో, సమాజంలో గౌరవం పెరుగుతుందని, ఫలితంగా పేదరికం కూడా తొలగిపోతుందన్నారు. సోమవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బిసి భవన్‌లో తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టిఎస్ఎస్ఎ) ఆధ్వర్యంలో "బడికి పోదాం" కార్యక్రమాన్ని కృష్ణయ్య ప్రారంభించారు. అనంతరం టిఎస్ఎస్ఎ వ్యవస్థాపక అధ్యక్షులు కూరెళ్ల మహేశ్‌కుమార్ అధ్యక్షతన 'బడికిపోదాం ' సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో, గురుకులాల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఆలిండియా స్థాయిలో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లో, గురుకులాల్లో చదివిన వారు అనేకమంది ఐఎఎస్, ఐపిఎస్, లాయర్లు, రాజకీయ నేతలు, ఎంఎల్ఏలు అయ్యారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 2500 ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్లలో, 1050 గురుకుల పాఠశాలల్లో ఉచిత విద్య, భోజన సదుపాయాలున్నాయన్నారు. గురుకులాల్లో సీటు రాని విద్యార్థులకు అడ్మిషన్ ఇప్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం గ్రహించి గురుకులాల్లో, హాస్టళ్లకు స్వంత భవనాలు నిర్మించి, మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. పెండింగ్ ఫీజులను రూ.10వేల కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, టిఎస్ఎస్ఎ వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్తన్న, ప్రధాన కార్యదర్శి గంధమళ్ల శ్రీనివాస్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీ రాందేవ్, బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు మొదటి మెట్టు విద్యాలయం



ప్రజాపక్షం/సనత్‌నగర్: పిల్లలకు ఊహ తెలిసిన నాటి నుంచే మంచి భవిష్యత్తుకు మార్గం పడాలంటే విద్యాలయాలతోనే సాధ్యపడుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసరావు తల్లిదండ్రులకు సూచించారు. సనత్‌నగర్ ఎస్ఆర్‌టి కాలనీలో ఏర్పాటుచేసిన దక్కన్ జేమ్స్ పాఠశాలను తలసాని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత కొలను బాల్‌రెడ్డి, పాఠశాల నిర్వాహకులు మొహమ్మద్ ఇలియాసుద్దీన్, మహమ్మద్ ఫరీదుద్దీన్, స్థానిక బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## మాధాపూర్, శేరిలింగంపల్లిలో వర్షాకాల చర్యలు

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన

ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) మాధాపూర్, శేరిలింగంపల్లి సర్కిళ్లలో ప్రత్యేక చర్యలు చేపట్టింది.మాధాపూర్ సర్కిల్‌లో దుర్గం చెరువు సమీపంలోని విఠల్‌రావునగర్, మల్కం చెరువు, గచ్చిబౌలి, సైబర్ టవర్స్ పరిసర ప్రాంతాలు, జూబ్లీ గార్డెన్ ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలకు కారణమైన అడ్డంకులను తొలగించారు. డ్రెయిన్‌ల శుభ్రపరిచే పనులు పెంపు చర్యలు చేపట్టారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి అవసమైన చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ తెలిపారు.జెడ్‌సి పర్యవేక్షణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్‌సి సత్యనారాయణ మాట్లాడుతూ...ప్రజాసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని బస్తీ, కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదిలాఉండగా...వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నగర ట్రాఫిక్ డిసిపి3 రాహుల్‌హెగ్డే, చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణ అధికారులను అదేశించారు. జెడ్‌సి కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ట్రాఫిక్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, అర్బన్ బయోడైవర్సిటీ, విద్యుత్, జలమండలి, రెవిన్యూ, హైడ్రా అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ఓయులో నిరుద్యోగుల ర్యాలీ



ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ: రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలంటూ ఓయూలో నిరుద్యోగులు ర్యాలీ నిర్వహించి ధర్నాతో నిరసన వ్యక్తం చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తూ.. ఎన్‌సిసి వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు, విద్యార్థులు మాట్లాడుతూ.. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని.. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామంటూ అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందంటూ కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నేత జంగయ్య, రామకృష్ణ, శ్రీకాంత్, నాగేందర్‌రావు, రాజు, కవిత, భార్గవి, సైదులు, తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..

అధ్యక్షునిడి మంగదొడ్డి శ్రీనివాసులు..
ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటరమణ ..

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్షునిగా మంగదొడ్డి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా టి.వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు అధికారికంగా ఎన్నిక పత్రాలను నూతన బాధ్యులకు అందజేశారు. నూతన కమిటీ : అధ్యక్షుడు మంగదొడ్డి శ్రీనివాసులు (ఎస్ఒ,బిసి సంక్షేమశాఖ), ప్రధాన కార్యదర్శిటి. వెంకటరమణ (ఎస్ఒ ఐటి,క్యాడ్), అడిషనల్ సెక్రటరీ జి. శ్రవణ్ కుమార్ (ఎస్ఒ జిఎడి),ఉపాధ్యక్షులు ఉడుత అశోక్ (జిఎడి), జి. లావణ్య లత (పిఆర్,ఆర్‌డి),జాయింట్ సెక్రటరీలు అంబటి వీరాంజనేయులు (ఇఎఫ్ఎస్,టి), కూరపాటి ఆశాజ్యోతి (పిఆర్,ఆర్‌డి), కమటం తిరుపతి (పిఆర్,ఆర్‌డి), బి. రామ్ గోపాల్ (లెజిస్లేచర్) , ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. సైదులు (ఆర్థిక శాఖ), పబ్లిసిటీ సెక్రటరీ ఎస్. రామలింగయ్య (గిరిజన సంక్షేమ), కోశాధికారి కాదరి నవీన్ కుమార్ (జిఎడి) ఎన్నికయ్యారు. కాగా చిక్కా లక్ష్మణ్, కె. రమాదేవి, రెండ్ల రాజేష్, ఎం. రవీంద్ర కుమార్, వి. కైలాసం, బి. స్వామి గౌడ్ ఎన్నికల అధికారులుగా వ్యవహారించారు.

**హక్కుల పరిరక్షణకు పనిచేస్తాం:**

ఉద్యోగుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తామని మంగదొడ్డి శ్రీనివాసులు,వెంకట్ రమణ తెలిపారు. సచివాలయంలో బిసి ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, పదోన్నతులు,తదితర అంశాలలో ఎదురయ్యే సమస్యలపై నిరంతరం గళం విప్పుతామన్నారు.

## వర్షాకాల సన్నద్ధతపై ఎంఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బోడుప్పల్, ఉప్పల్, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వర్షాకాల సన్నద్ధతను పరిశీలించారు. బోడుప్పల్ శ్రీనివాస కాలనీ, ఉప్పల్ విజయపురి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సర్వే కాలనీ ప్రాంతాల్లో వర్షపు నీటి కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలు, నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డిఆర్‌ఎఫ్, హైడ్రా బృందాల సన్నద్ధతను సమీక్షిస్తూ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని ఆదేశించారు. డిఎస్ఎల్ అబాకస్ ఐటీ పార్క్ సమీపంలో నాలా నీరు రోడ్డుపైకి రావడాన్ని గమనించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రామంతాపూర్ చర్చి కాలనీలో చెత్తను అక్రమంగా పారవేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రతను కాపాడాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ పర్యటనలో బోడుప్పల్ డిప్యూటి కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

**టిజిడిపిఎస్ అధికారులతో ఎంఎంసి కమిషనర్ సమావేశం**

వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టిజిడిపిఎస్) అధికారులతో సమావేశమయ్యారు. తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వర్షపాతం, వాతావరణ మార్పులపై రియల్‌టైమ్ సమాచారం, విశ్లేషణలను అధికారులు వివరించారు. మున్సిపల్ కంట్రోల్ రూమ్ ద్వారా వాతావరణ అంచనాలు, గత 24 గంటల వర్షపాతం వివరాలను సాంకేతికంగా విశ్లేషించి సంబంధిత అధికారులకు అందజేస్తామని కమిషనర్ తెలిపారు. వర్షాల సమయంలో కంట్రోల్ రూమ్‌లో ప్రత్యేక విధులు కేటాయించినట్లు వెల్లడించిన ఆయన, అధికారులు అనుమతి లేకుండా నగరాన్ని విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు కంట్రోల్ రూమ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.



# ఎన్‌సిపిఐలోకి టిఎంసి రెబల్ ఎంపిలు

- దేశ ప్రజలను ఆశ్చర్యంలో ముంచేసిన పరిణామం
- రాజకీయ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండడం కోసమేనని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

**న్యూఢిల్లీ:** రాజకీయాల్లో ఎప్పుడైనా, ఏదైనా జరగొచ్చు. అందుకు తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది తిరుగుబాటు లోక్‌సభ ఎంపిల చర్యే తాజా ఉదాహరణ. వీరు మమతా బెనర్జీ పార్లమెంటరీ కూటమిని వీడాలని నిర్ణయించుకున్నప్పుడు, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నుండి ఫిరాయించిన వారిలో అత్యధికులు అనుసరించిన సుపరిచిత మార్గాన్నే వీరు కూడా అనుసరిస్తారని చాలామంది ఊహించారు. తిరు గుబాటు ఎంపిలంతా బిజెపిలో చేరుతారని అను కున్నారు. కానీ వారు అందరి అంచనాలను తల కిందులు చేశారు. త్రిపుర కేంద్రంగా పనిచేసే ఒక అనామక రాజకీయ పార్టీ అయిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సిపిఐ)ని ఎంచుకోవడం దేశ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ పార్టీకి ఎలాంటి రాజకీయ ప్రాముఖ్యత లేకపోవడ మే అతిపెద్ద ఆస్తిగా మారి ఉండవచ్చు.



తిరుగుబాటుదారులకు టిఎంసి నుండి చట్టబద్ధంగా సురక్షితమైన మార్గాన్ని అందించడమే కాకుండా, వారిని వెంటనే తమ పార్టీలో చేర్చుకోకుండానే వారి మద్దతును బిజెపి పొందేందుకు వీలు కల్పించింది. ఆదివారం నాడు తిరుగుబాటు టిఎంసి వర్గం ఎన్‌సిపిఐలో విలీనమవ్వాలన్న నిర్ణయించుకున్నారు. అయితే ఈ నిర్ణయం తొలుత గందరగోళంగా అనిపించవచ్చు, కానీ రాజకీయ పరిశీలకులు దీనిని చట్టపరమైన అంశాలను తప్పించుకోవడానికి, అదే సమయంలో రాజకీయ లెక్కలు వేయడానికి వేసిన ఒక జాగ్రత్తతో కూడిన ఎత్తుగడగా భావిస్తున్నారు. ఈ తాజా చర్య 1998లో ఏర్పడినప్పటి నుండి తృణమూల్ కాంగ్రెస్‌ను తాకిన అతిపెద్ద సంక్షోభానికి పునాది వేసింది.తిరుగుబాటుదారులకు, ప్రాముఖ్యత లేకపోవడం ఒక ప్రతికూలత కాదు. అదే వారి వ్యూహంగా భావిస్తున్నారు. బిజెపి ఇవ్వలేని ఒక అవకాశాన్ని ఎన్‌సిపిఐ వారికి అందించినట్లు కనిపిస్తోంది. పార్లమెంటులో తమ సమష్టి బలాన్ని కాపాడుకుంటూనే, టిఎంసి నుంచి చట్టబద్ధంగా బయటపడే మార్గంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.తిరుగుబాటుదారుల అసలు ప్రణాళిక చాలా సరళమైనది: మూడింట రెండు వంతుల ఎంపిలతో టిఎంసి పార్లమెంటరీ పార్టీ నుంచి బయటకు రావడం, పార్లమెంటులో ఒక ప్రత్యేక కూటమిని ఏర్పాటు చేసి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు మద్దతు ఇవ్వడం అని రాజకీయ వర్గాలు తెలిపాయి. అనవసరమైన విధానపరమైన అడ్డంకులను సృష్టించకుండా, మమతా బెనర్జీ నియంత్రణకు వెలుపల ఒక రాజకీయ వేదికను సృష్టించుకోవడానికి తాము సమష్టిగా ముందుకు సాగాలనుకున్నామని, ఎన్‌సిపిఐ మార్గం ఒక ఆచరణీయమైన పార్లమెంటరీ పరిష్కారాన్ని అందించిందించని ఒక తిరుగుబాటు ఎంపి తెలిపారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో జరిగిన సమాంతర తిరుగుబాటు నుంచి నేర్చుకున్న పాఠాలనే ఈ చర్య ప్రతిబింబిస్తుందని సిపిఐ(ఎం) నాయకుడు సుజన్ చక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఇది రాజకీయ విలీనం కంటే ఒక చట్టపరమైన ఎత్తుగడ లాంటిది అని ఆయన అన్నారు. అసెంబ్లీలో టిఎంసి చీలిక తర్వాత తలెత్తిన సంక్లిష్టతలను నివారించడానికే లోక్‌సభ రెబెల్స్ ఉవ్విళ్లూరుతున్నట్లు కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. సీనియర్ టిఎంసి నాయకుడు సౌగత రాయ్ ఈ పరిణామం ప్రాముఖ్యతను కొట్టిపారేస్తూ, పార్టీ బలం చెక్కుచెదరలేదని నొక్కి చెప్పారు. 'కొంతమంది ఎంపిలు పార్టీని వీడవచ్చు, కానీ తృణమూల్ కాంగ్రెస్ మమతా బెనర్జీకి చెందినది. సంస్థ, కార్యకర్తలు, ప్రజలు ఆమెతోనే ఉన్నారు. రంగు మార్చడం ద్వారా పార్టీని బలహీనపరచవచ్చని భావించేవారు పొరబడుతున్నారు' అని రాయ్ పిటిఐకి తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి ఈ పరిణామాన్ని పార్లమెంటరీ వాస్తవికతకు నిదర్శనంగా చూస్తున్నారు. బిజెపికి తక్షణ ఆసక్తి పార్లమెంటులో సంఖ్యాబలం పెంచుకోవడమే కానీ, పశ్చిమ బెంగాల్‌లో రాత్రికి రాత్రే తమ సంస్థాగత కుటుంబాన్ని విస్తరించుకోవడం కాదు అని ఆయన అన్నారు. ఎన్‌సిపిఐ మార్గం ఒకేసారి రెండు సమస్యలను పరిష్కరించిందని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు. ఇది తిరుగుబాటుదారులకు తక్షణమే చట్టపరమైన చిక్కులను ఎదుర్కోకుండా సమష్టిగా ముందుకు సాగడానికి ఒక మార్గాన్ని ఇచ్చిందని, పశ్చిమ బెంగాల్‌లో ఇబ్బందికరమైన రాజకీయ విలీనాన్ని బలవంతం చేయకుండానే బిజెపికి పార్లమెంటరీ మద్దతును పొందేందుకు వీలు కల్పించిందని అభిప్రాయపడుతున్నారు.

## వ్యవస్థ వైఫల్యమే కాదు...
# లక్షలాది యువత కలలపై దెబ్బ

ప్రతి పరీక్షా పత్రం లీక్, పరీక్షల రద్దుపై రాహుల్‌గాంధీ విమర్శలు

**న్యూఢిల్లీ :** ప్రతి పరీక్షా పత్రం లీక్, రద్దయిన పరీక్షలు కేవలం వ్యవస్థ వైఫల్యం మాత్రమే కాదని, దేశంలోని లక్షలాది యువత కలలపై పడిన దెబ్బ అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. రాజస్థాన్‌లోని కోటాలో జరగనున్న తన తొలి విద్యార్థి సదస్సుకు ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులకు లభించేది వారి కష్టానికి ఫలం కాదని, కలలు కనే ధైర్యం చేసినందుకు లభించే శిక్ష అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదిగా పేర్కొన్నారు. ఈ దేశంలోని ప్రతి యువతకు తాను చెప్పదలుచుకున్నది ఒక్కటే అని, నేడు ఈ దేశంలో మీకు లభించేది వారి కష్టానికి ఫలం కాదు, కలలు కనే ధైర్యం చేసినందుకు లభించే శిక్ష అన్నారు. ప్రతి పేపర్ లీక్, రద్దయిన ప్రతి పరీక్ష, నిలిచిపోయిన ప్రతి నియామకాలు ఇవి కేవలం వ్యవస్థ వైఫల్యాలు మాత్రమే కాదు, లక్షలాది మంది కలలపై పడిన దెబ్బలు అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'మీరు అలసిపోయారని నాకు తెలుసు. మీరు కోపంగా ఉన్నారు. కానీ ఇది గుర్తుంచుకోండి... ప్రభుత్వం వినడానికి నిరాకరించినప్పుడు, మీరు మీ గొంతును మరింత బిగ్గరగా వినిపించాలి' అని అన్నారు. ఈనెల 17, కోటా విద్యార్థుల ప్రతిధ్వనిని వినిపించేందుకు తరలిరావాలని పిలుపునిస్తున్నానన్నారు. అందరం ఏకమై, ఎవరూ విస్మరించలేని గర్జనగా మారుదామన్నారు. కోటా నుండి ప్రారంభించి దేశంలోని ప్రతి మూలకూ చేరుద్దాని సూచించారు. ఇది వారి భవిష్యత్తు కోసం చేసే పోరాటమని, తాను వారికి అండగా ఉంటానని రాహుల్‌గాంధీ యువతకు హామీ ఇచ్చారు.



పేపర్ లీక్‌లు, పరీక్షా అవకతవకలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టే ఉద్యమంలో మొదటి దశ, రాహుల్ గాంధీ పలు విద్యార్థి సదస్సులలో ప్రసంగించడంతో ప్రారంభమవుతుందని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ సదస్సులలో మొదటి ప్రసంగం జూన్ 17న కోటాలో జరగనుంది. ఈ ఉద్యమం రాజకీయ అనుబంధాలకు అతీతంగా విద్యార్థులను ఏకం చేయడానికి, బాధితులైన యువత తమ అనుభవాలను పంచుకోవడానికి, పదేపదే జరుగుతున్న పరీక్షా వైఫల్యాలు, పేపర్ లీక్ కుంభకోణాలకు జవాబుదారీతనం కోరడానికి ఒక వేదికను అందిస్తుందని పార్టీ తెలిపింది. ఆరోపించబడిన పరీక్షా కుంభకోణాల వల్ల ప్రత్యక్షంగా ప్రభావితమైన విద్యార్థులు, ఆశావహులు, యువజన సంఘాలు, విద్యావేత్తలు, అందరినీ ఒకచోట చేర్చేందుకు, రాహుల్ గాంధీ కోటా (జూన్ 17), అలహాబాద్ (జూలై 10), పాట్నా (జూలై 11), ఢిల్లీ (జూలై 14)లో ప్రారంభమయ్యే పలు భారీ విద్యార్థి సదస్సులలో ప్రసంగించనున్నారు.

# పార్టీ నాయకత్వాన్ని సంప్రదించలేదు

టిఎంసి రెబల్ ఎంపిల విలీనం ప్రకటనపై ఎన్‌సిపిఐ సీనియర్ నేత అసంతృప్తి

**కోల్‌కతా :** తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)కు చెందిన 20 మంది అసమ్మతి ఎంపిలు 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (ఎన్‌సిపిఐ)లో విలీనం అవుతున్నట్లు ఆదివారం ప్రకటించారు. అయితే ఎన్‌సిపిఐకి చెందిన ఒక సీనియర్ నేత ఆ నిర్ణయాన్ని ప్రశ్నించారు. ఈ విలీన ప్రక్రియపై పార్టీ నాయకత్వాన్ని సంప్రదించలేదని, ఇలాంటి నిర్ణయాన్ని ఏకపక్షంగా తీసుకోకూడదని ఆయన పేర్కొన్నారు. విలీన ప్రతిపాదన గురించి పార్టీ అధ్యక్షుడు ఇతర ముఖ్య నాయకులతో చర్చించలేదని, కాబట్టి ఈ నిర్ణయానికి సంస్థాగత ఆమోదం లేదని ఎన్‌సిపిఐ జాతీయ కార్యదర్శి శాంతను డే తెలిపారు. 'పార్టీలో విలీనం గురించి అధ్యక్షుడు ఎప్పుడూ మాట్లాడలేదు. ఇలాంటి నిర్ణయాలను ఆయన స్వయంగా తీసుకోలేరు' అని డే మీడియాకు తెలిపారు. అంతగా ప్రాచుర్యం లేని ఈ పార్టీని జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చిన ఈ నాటకీయ రాజకీయ పరిణామంపై పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయని దీనిని బట్టి అర్థమవుతోంది.
ఎన్‌సిపిఐ రాజకీయ కార్యకలాపాలు ప్రధానంగా త్రిపురకు మాత్రమే పరిమితమయ్యాయని, పశ్చిమ బెంగాల్‌లో పార్టీ ఎప్పుడూ క్రియాశీలకంగా లేదని కూడా డే చెప్పారు. '2023లో పశ్చిమ బెంగాల్‌లో పార్టీ నమోదైనప్పటికీ, ఆ రాష్ట్రం మా ప్రధాన కార్యకలాప ప్రాంతాలలో ఎప్పుడూ లేదు' అని ఆయన పేర్కొన్నారు. 20 మంది అసమ్మతి టిఎంసి లోక్‌సభ ఎంపిలు స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తాము ఎన్‌సిపిఐలో విలీనం అవుతున్నట్లు, బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ)కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన మరుసటి రోజే ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'టిఎంసి ఎంపిలలో మూడింట రెండు వంతుల మంది ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్ల కోసం స్పీకర్‌కు లేఖ ఇచ్చారు. మేము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీలో విలీనం అవుతాము, ఎన్‌డిఎకు మద్దతు ఇస్తాము' అని అసమ్మతి టిఎంసి ఎంపి కకోలి ఘోష్ దస్తీదార్ ఆదివారం నాడు చెప్పారు. ఈ పరిణామం టిఎంసి పార్లమెంటరీ విభాగంలో అతిపెద్ద రాజకీయ సంక్షోభాలలో ఒకదానికి దారితీసింది. అసమ్మతి చట్టసభ సభ్యుల భవిష్యత్తు కార్యాచరణపై ప్రశ్నలను లేవనెత్తింది.

# కేరళ ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- 'ప్రియదర్శిని' పథకం ప్రారంభించిన ముఖ్యమంత్రి విడి సతీశన్
- నవ కేరళ నిర్మాణ దిశగా ఇది ఒక నిర్ణయాత్మక అడుగు అని వెల్లడి

**తిరువనంతపురం :** ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక హామీని నెరవేరుస్తూ, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ (యుటిఎఫ్) ప్రభుత్వం సోమవారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించింది. నవ కేరళ నిర్మాణ దిశగా ఇది ఒక నిర్ణయాత్మక అడుగు అని ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ అభివర్ణించారు. ఈ పథకం కేవలం సాధారణ కెఎస్ఆర్‌టిసి సర్వీసులకు మాత్రమే పరిమితం కావడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సిపిఐ (ఎం) ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించగా, యుడిఎఫ్ తమ హామీని పూర్తిగా అమలు చేయలేదని ఆరోపిస్తూ బిజెపి నిరసనలు చేపట్టింది. 'ప్రియదర్శిని' పథకం ప్రారంభంతో, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్న దక్షిణాది రాష్ట్రాల జాబితాలో కేరళ చేరింది. ఈ జాబితాలో ఇప్పటికే కాంగ్రెస్ పాలిత కర్ణాటక, తెలంగాణ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కూడా మహిళలకు ఇటువంటి రాయితీలను కల్పిస్తున్నాయి. తిరువనంతపురంలోని తంపనూర్ కెఎస్ఆర్‌టిసి బస్సు టెర్మినల్ వద్ద ముఖ్యమంత్రి సతీశన్ ఈ పథకాన్ని ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే హామీని నెరవేర్చినందుకు ఇది ప్రభుత్వానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చులను తగ్గించడం, ఆర్థిక సాధికారతను పెంపొందించడం లక్ష్యంగా చేపట్టిన ఈ పథకం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా సాధారణ కెఎస్ఆర్‌టిసి బస్సుల్లో మహిళలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఉచితంగా ప్రయాణించవచ్చు. డిపోలో జరిగిన కార్యక్రమంలో ఈ కీలక పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి, ఇది కేవలం దాతృత్వ చర్య కాదని, గణనీయమైన సామాజిక, ఆర్థిక ప్రభావం చూపే సంక్షేమ చర్య అని అన్నారు. 'ఉపాధి, విద్య, వైద్యం, కార్యాలయ సంబంధిత అవసరాలు, ఇతర పనుల కోసం ప్రతిరోజూ వేలాది మంది మహిళలు కెఎస్ఆర్‌టిసిపై ఆధారపడుతున్నారు. ఈ పథకం వారి ఆర్థిక భద్రతను, స్వయం సమృద్ధిని బలోపేతం చేస్తుంది' అని ఆయన అన్నారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 800 కోట్లను కెఎస్ఆర్‌టిసికి అందిస్తుందని, దీనివల్ల ప్రభుత్వ రవాణా సంస్థపై ఎటువంటి ఆర్థిక భారం పడదని సతీశన్ స్పష్టం చేశారు. ఇకపై మహిళలు ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంతో ప్రయాణించవచ్చని, ఇది తమ ప్రభుత్వ బస్సు సర్వీస్ అని వారు గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. ఎన్నికల హామీ ప్రకటించిన వెంటనే ఒక లబ్ధిదారుతో జరిగిన సంభాషణను గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి, ఈ పథకం ద్వారా ఆదా అయిన డబ్బుతో ఏమి చేయాలని ఒక మహిళ తనను అడిగిందని, దానికి సమాధానంగా ఆ డబ్బును నెలవారీ పొదుపు పథకంలో పెట్టుబడి పెట్టాలని ఆమెకు సలహా ఇచ్చానని చెప్పారు. ప్రారంభోత్సవం అనంతరం, ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు మహిళా ప్రయాణికులతో కలిసి థంపనూర్ నుండి సచివాలయానికి కెఎస్ఆర్‌టిసి బస్సులో ప్రయాణించారు. అయితే, మొదటి దశలో సాధారణ కెఎస్ఆర్‌టిసి సర్వీసులకు మాత్రమే ఈ రాయితీని పరిమితం చేయడం ద్వారా ప్రభుత్వం తన ఎన్నికల హామీని నీరుగార్చిందని ఆరోపిస్తూ, ప్రధాన ప్రతిపక్షమైన సిపిఐ(ఎం) ఈ కార్యక్రమానికి దూరంగా ఉంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఎన్నికల హామీని పూర్తిగా నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ బిజెపి కార్యకర్తలు కొన్ని చోట్ల నిరసనలు తెలిపారు.



# కేరళలో షిగెల్లా కలవరం

ఇన్‌ఫెక్షన్‌తో ఏడేళ్ల బాలుడు మృతి, ఈ ఏడాది నాలుగుకు చేరిన మృతులు




**మలప్పురం :** కేరళలో షిగెల్లా ఇన్‌ఫెక్షన్ కలవరపెడుతోంది. మలప్పురం జిల్లాలోని పూక్కొట్టూరుకు చెందిన ఏడేళ్ల బాలుడు సోమవారం షిగెల్లా ఇన్ఫెక్షన్‌తో మరణించాడు. దీంతో ఈ ఏడాది కేరళలో ఈ వ్యాధి కారణంగా సంభవించిన వారి సంఖ్య నాలుగు చేరినట్లు ఆరోగ్య అధికారులు తెలిపారు. మృతుడు అర్జవ్, కోజికోడ్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని వారు చెప్పారు. ఈనెల 12న జ్వరం, విరేచనాలతో అర్జవ్‌ను ఆసుపత్రిలో చేర్చారని, అనంతరం అతనికి షిగెల్లా ఇన్ఫెక్షన్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో షిగెల్లా సంబంధిత మరణం ఇది నాలుగవది కాగా, జూన్‌లో మూడవదని అధికారులు తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిహెచ్ఎస్) డేటా ప్రకారం, జూన్ 14 వరకు కేరళలో 138 నిర్ధారిత షిగెల్లా ఇన్ఫెక్షన్ కేసులు నమోదయ్యాయి, వీటిలో అత్యధిక కేసులు కోజికోడ్ జిల్లాలో నమోదయ్యాయి. దీంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా 77 అనుమానిత కేసులు నమోదయ్యాయి. జూన్ నెలలోనే 62 నిర్ధారిత కేసులు, 17 అనుమానిత కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈనెల 14న మూడు కొత్త నిర్ధారిత కేసులు నమోదయ్యాయి. షిగెల్లా అనేది ఒక బాక్టీరియా సంక్రమణం, దీనివల్ల విరేచనాలు, జ్వరం, కడుపునొప్పి కలుగుతాయి. ఇది ప్రధానంగా కలుషితమైన ఆహారం లేదా నీటి ద్వారా వ్యాధి సోకిన వ్యక్తులతో సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది.

# ఇజ్రాయెల్ పట్ల మోదీది గుడ్డి భక్తి

జాతీయ ప్రయోజనాలకు మరింత సమతుల్యత అవసరం : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వ విదేశాంగ విధాన నిర్వహణపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. పాకిస్థాన్ కొత్తగా ప్రాంతీయ, ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోందని, దీనికి తోడు పాకిస్థాన్ వ్యూహాత్మక వ్యవస్థలో చైనా లోతుగా పాతుకుపోవడం భారతదేశానికి ఒక బలమైన భౌగోళికరాజకీయ సవాలును విసురుతోందని పేర్కొంది.
పశ్చిమ ఆసియాలో శత్రుత్వాన్ని విరమించుకోవడానికి ఈనెల 19న జెనీవాలో అమెరికా, ఇరాన్‌లు ఒక ఒప్పందంపై సంతకం చేయనున్నాయన్న వార్తను స్వాగతించాలని, అయితే దాని పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ అన్నారు. 'ఈ ఒప్పందం తాత్కాలికమైనదే అయినప్పటికీ, ఆ రెండు దేశాలు (ఇజ్రాయెల్‌తో సహా) దానికి కట్టుబడి ఉంటాయని, ఇది మరింత శాశ్వతమైన సాధారణీకరణకు దారితీస్తుందన్న ఆశ ఉంది' అని రమేష్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. హార్ముజ్ జలసంధిని నియంత్రణ లేకుండా తిరిగి తెరవడం భారతదేశానికి కచ్చితంగా గొప్ప ఉపశమనాన్ని కలిగిస్తున్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న నిర్మాణాత్మక సమస్యలు త్వరలో తొలగిపోతాయని దీని అర్థం కాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. 'ప్రధానమంత్రి మోదీ ఇజ్రాయెల్ పర్యటన జరిగిన కేవలం రెండు రోజుల తర్వాత పశ్చిమ ఆసియాలో ప్రారంభమైన ప్రస్తుత యుద్ధానికి ముందే ఈ ఆందోళనలు స్పష్టంగా ఉన్నాయి. ఏడాదికి పైగా రూపాయి గణనీయమైన ఒత్తిడిలో ఉంది. డాలర్ల డిమాండ్ సరఫరా మధ్య అంతరం పెరుగుతూ వస్తోంది. జిడిపి వృద్ధికి అత్యంత కీలకమైన ప్రైవేట్ పెట్టుబడుల రేట్లు చాలా సంవత్సరాలుగా మందకొడిగా ఉన్నాయి అని రమేష్ అన్నారు. గత దశాబ్ద కాలంగా వాస్తవ వేతనాలలో స్తబ్దత ఫలితంగా ఏర్పడిన డిమాండ్‌లో మందకొడి వృద్ధి; రికార్డు స్థాయి వాణిజ్య లోటుకు దారితీసి, ముఖ్యంగా ఉద్యోగాలను సృష్టించే ఎంఎస్ఎంఇల వృద్ధిని ప్రమాదంలో పడేసిన చైనా దిగుమతుల డంపింగ్‌ను అరికట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమవడం; పన్ను అధికారులకు, దర్యాప్తు సంస్థలకు అపరిమిత అధికారాలు ఇవ్వడం వల్ల మొత్తం పెట్టుబడి వాతావరణం దెబ్బతినడం వీటన్నింటి ఫలితమే ఇది అని ఆయన అన్నారు. 2008 నవంబర్‌లో ముంబయిలో జరిగిన ఉగ్రవాద దాడులను ప్లాన్ చేసిన తర్వాత భారతదేశం చేత విజయవంతంగా ఏకాకిని చేయబడిన పాకిస్థాన్, ఇప్పుడు కొత్త ప్రాంతీయ, ప్రపంచ ప్రభావాన్ని సంపాదించుకున్నట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. దీనికి తోడు పాకిస్తాన్ వ్యూహాత్మక వ్యవస్థలో చైనా లోతుగా పాతుకుపోవడం, భారతదేశ విదేశాంగ విధానానికి ఒక తీవ్రమైన భౌగోళిక రాజకీయ సవాలును విసురుతోందని రమేశ్ అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదరడం శాంతిని కోరుకునే వారందరికీ ఊరటనిచ్చిందని, అయితే పశ్చిమ ఆసియా వ్యాప్తంగా, ముఖ్యంగా ఇరాన్, లెబనాన్‌లలో అపారమైన బాధలు, ప్రాణనష్టం, విధ్వంసం జరిగిన తర్వాత ఇది సాధ్యమైందని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా అన్నారు. 'అయితే, భారతదేశానికి ఈ తరుణం, ఆవిర్భవిస్తున్న ప్రపంచ క్రమంలో మన స్థానంపై ఇబ్బందికరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. పాకిస్థాన్, సౌదీ అరేబియా, ఖతార్, టర్కీల ప్రయత్నాల ద్వారా ఈ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌తో నాగరిక సంబంధాలు ఉన్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీకి ఉన్న వ్యక్తిగత సత్సంబంధాల గురించి విస్తృతంగా ప్రచారం జరిగినప్పటికీ, ఈ విషయంలో భారతదేశానికి ఎక్కడా స్థానం లేదు అని ఖేరా అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంలో, ఎగుమతి చేయడంలో పాకిస్తాన్ పాత్రను బహిర్గతం చేయడానికి భారతదేశం సంవత్సరాలుగా కృషి చేసిందని ఆయన గుర్తుచేశారు.

ప్రాథమిక పాఠశాల నియామకాల కుంభకోణం
# ఇడి ఎదుట అభిషేక్ బెనర్జీ



**కోల్‌కతా :** ప్రాథమిక పాఠశాల నియామకాల కుంభకోణం ఆరోపణలపై జరుపుతున్న దర్యాప్తులో భాగంగా, తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోమవారం విచారించడం ప్రారంభించారని ఒక అధికారి తెలిపారు. రాష్ట్ర శాసనసభలో ప్రతిపక్ష నాయకుడి నియామకానికి సంబంధించిన పత్రాలపై ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీకి సంబంధించి, రాష్ట్ర సిఐడితో బెనర్జీ దాదాపు ఎనిమిదిన్నర గంటల పాటు ఇదే తరహా విచారణలో పాల్గొన్న మరుసటి ఈ విచారణ జరిగింది. ఈ కుంభకోణానికి సంబంధించి టిఎంసికి చెందిన డైమండ్ హార్బర్ ఎంపి కోసం కేంద్ర దర్యాప్తు సంస్థ రెండు డజన్ల ప్రశ్నల జాబితాను సిద్ధం చేసిందని ఆ అధికారి తెలిపారు. 'ఈ విచారణ మొత్తాన్ని వీడియో తీసి, ధృవీకరించి, ఇతర సాక్ష్యాలతో, ఈ కేసులో అరెస్టు అయిన ఇతర నిందితుల వాదనలతో సరిపోల్చి చూస్తాము' అని ఆ అధికారి పిటిఐకి తెలిపారు. నేరం ద్వారా వచ్చిన సొమ్మును గుర్తించేందుకు, ఆర్థిక పత్రాలు, డిజిటల్ రికార్డులు, ఇతర నిందితుల వాంగ్మూలాలతో కూడా బెనర్జీని ప్రశ్నిస్తారని ఆయన చెప్పారు. 'డబ్బు లావాదేవీల జాడపై మా దృష్టి కేంద్రీకృతమై ఉంది. నిధులను ఎవరు నిర్వహించారు, అవి వివిధ ఖాతాలు, సంస్థల మధ్య ఎలా బదిలీ అయ్యాయి, వాటి మూలాన్ని దాచిపెట్టడానికి ఈ లావాదేవీలు పొరలు పొరలుగా జరిగాయా అనే విషయాలను మేము పరిశీలిస్తాము' అని ఆ అధికారి తెలిపారు. గతంలో సమర్పించిన నివేదికలకు, సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్న కొత్త ఆధారాలకు మధ్య గమనించిన వ్యత్యాసాలపై ఏజెన్సీ వివరణ కోరుతుంది. ప్రాథమిక ఉపాధ్యాయుల నియామకాలలో జరిగిన అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా జారీ చేసిన సమన్ల మేరకు, బెనర్జీ ఉదయం 11 గంటల ప్రాంతంలో ఇడి సిజిఒ కాంప్లెక్స్ కార్యాలయానికి చేరుకున్నారని ఆయన తెలిపారు. ఫోరెన్సిక్ విశ్లేషణలో గుర్తించిన మధ్యవర్తులు, లబ్ధిదారుల సంస్థల పాత్రపై కూడా విచారణ జరుగుతుంది.

# శివసేన(యుబిటి) ఎంపిలందరూ పార్టీతోనే ఉన్నారు

ఊహాగానాలను కొట్టిపారేసిన సంజయ్ రౌత్

**ముంబయి :** శివసేన (యుబిటి) ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించింది. అయితే పార్టీ నాయకత్వం ఏర్పాటు చేసిన సమావేశానికి తొమ్మిది మంది ఎంపిలలో ఐదుగురు ప్రత్యక్షంగా హాజరుకాకపోవడంతో ఊహాగానాల తలెత్తాయి. అలాంటి వాటికి పటాపంచలు చేస్తూ శివసేన (యుబిటి) అధికార ప్రతినిధి స్పందించారు. సమావేశాకి హాజరుకాని వారు ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని పార్టీకి గట్టి మద్దతుగా నిలిచారన్నారు. పార్టీ ఎంపిలను తమ వైపు తిప్పుకునేందుకు 'ఆపరేషన్ టైగర్' జరుగుతోందన్న ప్రచారం నేపథ్యంలో ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని సేన (యుబిటి) 'ఆపరేషన్ వోల్ఫ్'ను ప్రారంభిస్తుందని రౌత్ ప్రకటించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రత్యర్థి సేన వర్గాన్ని ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



ఉద్ధవ్ థాక్రే ఆదివారం ముంబయిలో పార్టీ ఎంపిల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులలో అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభావు వాజే, సంజయ్ పాటిల్ ఈ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరయ్యారు. మిగిలిన వారు ఓంప్రకాష్ రాజే నింబాల్కర్, భాసాహెబ్ వాక్‌చౌరే, నాగేశ్ బాపురావు పాటిల్ అష్టికర్, సంజయ్ దేశ్‌ముఖ్ ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారని, సంజయ్ జాదవ్ ఫోన్ ద్వారా థాక్రేతో మాట్లాడారని రౌత్ ఆదివారమే తెలిపారు. జాదవ్ రాబోయే రెండు రోజుల్లో ముంబయికి వచ్చి థాక్రేను కలుస్తారని రౌత్ సోమవారం చెప్పారు. 'శివసేన చీలిపోయినపుడు, ఎవరి విధేయతపై అయితే సందేహం లేదో వారే (పార్టీని) వీడి వెళ్లారు... మా ఎంపిలపై మాకు నమ్మకం ఉంది, అది అలాగే కొనసాగుతుంది. ఈ ఎంపిలందరూ శివసేన (యుబిటి)తోనే ఉన్నారు' అని ఆ రాజ్యసభ సభ్యుడు అన్నారు. 'ఆపరేషన్ టైగర్' గురించిన చర్చపై స్పందిస్తూ, మేల్కొని ఉన్న పులిని ఎవరైనా తాకగలరా అని రౌత్ ప్రశ్నించారు. 'పులిని ముందుగా మత్తుమందు ఇచ్చి నిద్రపుచ్చాలి. ఆ తర్వాత దాని కాళ్లను కట్టేయాలి. మా విషయంలో అది సాధ్యం కాదు. పులులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి' అని ఆయన అన్నారు. ఆదివారం నాటి సమావేశానికి గైర్హాజరైన ఎంపిలు, అవిభక్త శివసేన ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 19న హాజరవుతారా అని అడిగినప్పుడు, 'శివసేన కుటుంబ కార్యక్రమానికి' ఎవరికీ ప్రత్యేక ఆహ్వానం అవసరం లేదని రౌత్ బదులిచ్చారు.

# వచ్చేవారం భారత్—అమెరికా వాణిజ్య చర్చలు

**న్యూఢిల్లీ:**వచ్చేవారం భారత్—అమెరికా వాణిజ్య చర్చలు జరుగుతాయి. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్,భారత వాణిజ్య—పరిశ్రమలశాఖామంత్రి పీయూశ్ గోయల్ మధ్య జులై 23—24 తేదీలలో తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ఇంకా మిగిలిపోయిన చిన్న చిన్న సమస్యలపై చర్చలు జరుగుతాయని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి ఒకరు సోమవారం చెప్పారు. ఈ చర్చల నిమిత్తం జేమిసన్ గ్రీర్ రెండు రోజులపాటు నిర్ణీత ప్రకారం భారత్‌లో పర్యటించనున్నారు. ''అమెరికా ప్రతినిధి బృందం భారత్ పర్యటన సందర్భంగా ప్రాథమిక ఒప్పందంపై జరిగిన చర్చలకు తుదిరూపం ఇవ్వడం,రెండు దేశాలమధ్య విస్తృత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ)లకు సంబంధించిన అంశాలపై గోయల్—జేమిసన్ చర్చలు జరుపుతారు'' అని వాణిజ్య మంత్రిత్వశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ చెప్పారు. ఈనెల 22వ తేదీ నాటికి జేమిసన్ భారత్కు చేరుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు జూన్ 2—4 తేదీలలో బ్రెండెన్ లించ్ నాయకత్వంలో భారత్‌కు వచ్చిన అమెరికా ప్రతినిధి బృందం ఒప్పందాన్ని ఖరారు చేసే విషయంపై భారత్ అధికారులతో చర్చించింది. జూన్ ఐదో తేదీన గోయల్ మాట్లాడుతూ, తాత్కాలిక ఒప్పందానికి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అన్ని అంశాలను పరిష్కరించుకునే దిశగా ఇరు దేశాలూ అడుగులు వేస్తున్నాయని చెప్పారు. అంతకుముందు ఫిబ్రవరి ఏడో తేదీన భారత్—అమెరికా బిటిఎ మొదటి దశ (తాత్కాలిక ఒప్పందం ముసాయిదా)పై ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం భారత్‌పై అమెరికా తన సుంకాలను 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించుకుంటుంది. అదేవిధంగా రష్యా నుండి చమురు కొనుగోలు చేసినందుకు పరిహారంగా అదనంగా విధించిన 25 శాతం సుంకాన్ని పూర్తిగా రద్దు చేస్తుంది. అమెరికాకు వెళ్ళే భారత్ వస్తువులపై ఈ సుంకాన్ని అమెరికా విధించింది. కానీ అమెరికా సుప్రీం కోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన ట్రంప్‌కు వ్యతిరేకంగా పెద్ద తీర్పు చెప్పింది. ఈ తీర్పు ప్రకారం వివిధ దేశాలపై విచ్చలవిడిగా ట్రంప్ పెంచిన పరస్పర సమాంతర సుంకాలు చెల్లుబాటు కాబోవని అమెరికా సుప్రీంకోర్టు ప్రకటించింది. దీంతో భారత్‌కు మేలు జరిగింది. కానీ తర్వాత ట్రంప్ మరో చట్టాన్ని ఉపయోగించి 150 రోజులు అమలులో ఉండేవిధంగా అన్ని దేశాలకు వర్తించే విధంగా పదిశాతం సుంకాలు విధించారు. ఈ సుంకాల 150 రోజుల గడువు వచ్చే నెల అంటే జులై 24వ తేదీతో ముగుస్తుంది.

# దక్షిణ లెబనాన్ వదిలి వెళ్ళేదే లేదు

## హెజ్బొల్లా దాడులను ప్రతిఘటిస్తాం : ఇజ్రాయెల్ కట్జ్



**జెరూసలెం:** దక్షిణ లెబనాన్ నుండి తమ దళాలు బయటకు కదలివెళ్ళే ప్రసక్తేలేదని, ఒకవేళ హెజ్బొల్లా దళాలు దాడులు చేస్తే చాలా తీవ్రస్థాయిలో ప్రతిఘటిస్తామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. అమెరికా–ఇరాన్ మధ్య 14 అంశాల ముసాయిదాపై ప్రాథమిక ఒప్పందం కుదిరిన తర్వాత సోమవారం ఆయన ఈ ప్రకటన చేశారు. లెబనాన్‌లో మార్చి రెండో తేదీన ఇజ్రాయెల్ సైన్యాలు అడుగుపెట్టి దాడులు ప్రారంభించాయి. ఈ దాడులతోపాటు 10 కి.మీ లోపలికి చొచ్చుకువెళ్ళి సరిహద్దులను కూడా విస్తరించుకుంది. తమ కొత్త భద్రతా జోన్ల నుండి కదిలే ప్రసక్తే లేదని ఆయన చెప్పారు. లెబనాన్, సిరియా, గాజాలలో ఇజ్రాయెల్ చొచ్చుకువెళ్ళి కొత్తగా ఏర్పాటు చేసుకున్న భద్రతా జోన్ల లో తమ దళాలు కొనసాగుతాయన్నారు. జీహదీ శక్తులనుండి, సరిహద్దు దాడుల నుండి ఇజ్రాయెల్ ప్రజలను కాపాడుకోవడం కోసం తమ ద ళాలు కాలపరిమితి లేకుండా ఈ ప్రాంతాలలో ఉనికిని కొనసాగిస్తాయని చెప్పారు. అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందానికి సంబంధించిన పూర్తిపాఠం ఇంకా బహిర్గతం కాలేదు. ఈ ఒప్పందంలోని అంశాలు ఎలా ఉంటాయో తెలియదు. కానీ లెబనాన్‌సహా అన్ని ప్రాంతాలలో నూ ఈ ఒప్పందం ద్వారా యుద్ధ దాడులు ఆగిపోతాయని మధ్యవర్తిదేశం పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఇప్పటికే ప్రకటించారు. అందువల్ల కొత్త ప్రాంతాలలోకి, లెబనాన్ లోలోపలికి చొచ్చుకువెళ్ళకూడదని ఇంతకుముందే ఇజ్రాయెల్ నిర్ణయించుకుంది. ఇప్పటివరకూ ఆక్రమించిన ప్రాంతాలపై తమ పట్టు కోల్పోకుండా నిలబెట్టుకోవాలని, కొత్త భద్రతాజోన్లను దీర్ఘకాలం కొనసాగించాలని ఇజ్రాయెల్ కోరుకుంటున్నట్టు కనిపిస్తోంది. ఈ దశలో హెజ్బొల్లా దాడులు చేస్తే ప్రతిఘటించేందుకు ఐడిఎఫ్ దళా లు సిద్ధంగా ఉన్నాయి.

**నెతన్యాహూ ఓ సంక్లిష్ట వ్యక్తి: ట్రంప్**

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఒక సంక్లిష్టమైన వ్యక్తి అని న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. వాస్తవానికి ఆయన కృతజ్ఞతతో ఉండాలన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య సోమవారం ప్రకటించిన ఒప్పందంలో నెతన్యాహూ ప్రమేయం లేదని కూడా చెప్పారు. ఐతే ఈ ఒప్పందంలో ఉన్న నిబంధనలు ఇజ్రాయెల్‌లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. నెతన్యాహూ ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేరని, తాను ఏం చెబితే ఆయన అదే చేస్తారని ఇంతకుముందు ట్రంప్ చెప్పారు. కానీ ఇప్పుడు ఒప్పందం కుదిరిన తర్వాత ఇజ్రాయెల్ దెబ్బతిన్న బెబ్బులిలా ఉంది. ఈ రెండు మూడు రోజుల్లోనే ఇజ్రాయెల్ ప్రజల్లో,ప్రతిపక్ష నాయకులలో తీవ్ర వ్యతిరేకత,అసహనం మరింతగా నెతన్యాహూపై పెరిగిపోయింది.

# బ్రిటన్ పిల్లలకు సోషల్ మీడియా నిషేధం: స్టార్‌మర్

## వచ్చేనెలలో బిల్లు: వచ్చే ఏడాది నుండీ అమలు



**లండన్:** వచ్చే ఏడాది నుండి బ్రిటన్‌లో 16 ఏళ్ళ లోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై ఆంక్షలను అమలులోకి తెస్తారు. ఆ దేశ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ ఈ విషయం ప్రకటించారు. జులైనెలలో దీనికి సంబంధించిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదిస్తామని చెప్పారు. యూట్యూబ్,టిక్‌టాక్,ఫేస్‌బుక్, ఎక్స్,ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్,రోబ్లాక్స్ వంటి వేదికల నుండి పిల్లలను ఈ నిబంధనలు దూరంగా ఉంచుతాయని చెప్పారు. బ్రిటన్‌లో పిల్లల ఆరోగ్యం, భద్రత లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అపరిచితులు పిల్లలను తమ అధీనంలోకి తెచ్చుకోకుండా ఉండేందుకు వీలుగా గేమింగ్,లైవ్ స్ట్రీమింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఆస్ట్రేలియా కంటే అగ్రగామిగా బ్రిటన్ నిలవబోతోంది. జులైలో తీసుకురాబోయే చట్టం కింద 17 ఏళ్ళలోపు పిల్లలకు డీఫాల్ట్‌గా ఈ ఆంక్షలను వర్తింపజేయాలి. అదేవిధంగా 18 ఏళ్ళ లోపు పిలలకోసం రాత్రిపూట సోషల్ మీడియాలో కర్ఫ్యూ,ఇన్ఫినిటివ్ స్క్రోలింగ్స్ విషయంలో పరిమితులు,ఆంక్షలు అమలు చేసే విషయాన్ని కూడా స్టార్‌మర్ పరిశీలిస్తున్నారు. ప్రధానమంత్రి పదవి కోల్పోయే పరిస్థితుల్లో సంకంలో ఇరుకున్న స్టార్‌మర్ జనాదరణ చర్యల ద్వారా తన పదవిని అంటిపెట్టుకోవడానికి యత్నిస్తున్నార ని, ఇందులో భాగంగా ఆయన పిల్లల సంరక్షణకోసం సమగ్ర సంస్కరణలు ప్రకటించారని సోమవారం ఈ వార్తతోపాటే బ్రిటన్ మీడియా అనుబంధ విశ్లేషణ చేసింది.

16 ఏళ్ళలోపు పిల్లకు సోషల్ మీడియా నుండి రక్షణలు కల్పించేందుకు ఉద్దేశించిన ఈ చర్యలకు ''ఆస్ట్రేలియా ప్లస్'' అని స్టార్‌మర్ నామకరణం చేశారు. బ్రిటన్‌లో 2027 నుండి సోషల్ మీడియాను ఉపయోగించడానికి 16 ఏళ్ళు వయసు నిండితేగానీ అ ర్హత లభించదు. ఈ విషయంలో ఆయన ఆస్ట్రేలియా ప్రభుత్వాన్ని అనుసరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 13 దేశాలు పిల్లలకు సోషల్ మీడియా అందుబాటులో ఉంచకుండా నిషేధ చట్టాలు అమలులో కి తీసుకువచ్చాయి. ఈ విషయంలో అందరికంటే ఆ స్ట్రేలియా అగ్రభాగాన ఉంది. 2025 డిసెంబరులో పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించడం ద్వారా ఆస్ట్రేలియా ఇప్పుడు ప్రపంచంలో ప్రథమస్థానంలో నిలబడి ఆదర్శంగా మారింది. ఈ ఆంక్షలను అమలు చేయడంలో కంపెనీలు విఫలమైతే 49.50 మిలియన్ డాలర్లు జరిమానా చెల్లించాలని కూడా చట్టంలో పొందుపరచింది. అదేవిధంగా గ్రీస్ ప్రభు త్వం కూడా 2027 జనవరి నుండి పిల్లలకు అందుబాటులో లేకుండా కంపెనీలపై ఆంక్షలు అమలు చేయనున్నది. ఆస్ట్రియా దేశం కూడా ఈనెలలోనే ఒక ముసాయిదా చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. 16 ఏళ్ళ లోపు పిల్లల భద్రతకోసం కెనడా ప్రభు త్వం కూడా డిజిటల్ సేఫ్టీ బిల్లును సిద్ధం చేసింది. డెన్మార్క్ దేశం కూడా గత ఏడాది నవంబరులో ఈ నిషేధ ప్రకటన చేసింది. ఈ ఏడాది చివరిలోపు ఈ నిషేధం డెన్మార్క్‌లో అమలు చేస్తారు. ఈ ఏడాది జనవరిలోనే ఫ్రాన్స్‌దేశం కూడా ఒక బిల్లును ఆమోదించింది. గడచిన ఫిబ్రవరిలో జర్మనీ ప్రభుత్వం కూడా పిల్లలకు సోషల్ మీడియా నిషేధంపై చర్చలు జరిపింది. ఇండోనేసియా కూడా ఈ ఏడాది మార్చిలో ఇదే ప్రకటన చేసింది. మలేసియా, పోలెండ్, స్పెయిన్, స్లోవేనియా, టర్కీ దేశాలు కూడా సోషల్ మీడియా నుండి పిల్లలను దూరం చేసేందుకు గట్టి చర్యలను ప్రకటించాయి.

## నేపాల్‌లో యుఎంఎల్

# కమ్యూనిస్టుపార్టీ పునర్వ్యవస్థీకరణ



**కాఠ్మండు:** నేపాల్‌లో కమ్యూనిస్టుపార్టీ యుఎంఎల్‌లో పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని, పార్టీ ఈ విషయంలో ఏకాభిప్రాయంతో ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శంకర్ పోఖరెల్ చెప్పారు. పార్టీలో ఎలాంటి చీలికలుగానీ, విభేదాలు గానీ లేవని స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చినెలలో నేపాల్ సార్వత్రిక ఎన్నికల్లో షా నాయకత్వంలో యువతరం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేపాల్ కమ్యూనిస్టుపార్టీ యుఎంఎల్‌ను కూడా యువరక్తంతో పునర్వ్యవస్థీకరించాలనే నిర్ణయాలు వెలువడ్డాయి. కాఠ్మండులోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో శంకర్ పోఖరెల్ మాట్లాడుతూ, ప్రజాకర్షకవాదం, అవకాశవాదం, అరాచకవాదాలను అధిగమించడంపై పార్టీ ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందని చెప్పారు. పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ సోషల్ మీడియా ద్వారా వచ్చిన ప్రచారాన్ని ఆయన అత్యంత హానికరమైన ధోరణిగా అభివర్ణించారు. పోఖారెల్ తోపాటు ఉపాధ్యక్షుడు బిష్ణు ప్రసాద్ కూడా ఛైర్మన్ కె.పి.శర్మ ఓలిపై తిరగబడ్డారని ప్రచారం జరిగింది. దీనిపై పోఖరెల్ వివరణ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికలలో ఓటమి విషయంపై ఒక ప్రత్యేక బృందం నిశితంగా అధ్యయనం చేస్తోందని, అభిప్రాయ సేకరణ చేస్తోందని, పార్టీ ప్రస్తుతం ఉన్న పరిస్థితిని దాటుకుని ముందుకు ప్రయాణం చేస్తుందని, పార్టీలో అంతర్గత ప్రక్షాళన,పార్టీ పునరుజ్జీవం,పార్టీని ప్రజల్లో బలోపేతం చేయడం వంటి మూడు అంశాలపై దృష్టి కేంద్రీకరించి ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా సిపిఎన్ యుఎంఎల్ పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి యోగేశ్ భట్టారాయ్ సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, పార్టీలో ఎలాంటి చీలికలూ లేవని ప్రకటించారు. అలాంటి ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీలో పునర్వ్యవస్థీకరణ,జరుగుతుందని, ప్రక్షాళన ప్రక్రియ రాబోయేకాలంలో ఎంతో మంచి ఫలితాలను ఇస్తాయని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ధైర్యంతో, విశ్వాసంతో ఉండాలని, వదంతులను నమ్మవద్దని కోరారు.

## బ్రెజిల్‌లో రెండు హెలికాప్టర్స్ ఢీ

# పాప్ సింగర్ ఓలివర్ ట్రీ సహా ఆరుగురు మృతి



**రియోడీజెనీరో:** బ్రెజిల్‌లో రెండు హెలికాప్టర్లు ఢీకున్నాయి. ఈ ప్రమాదంలో అమెరికాకు చెందిన ప్రముఖ గాయకుడు, హాస్యనటుడు ఓలివర్ ట్రీ (32) మరణించారు. ఐతే ఇంతవరకూ ఆయన మృతదేహాన్ని గుర్తుపట్టలేదు. మరణించినవారి జాబితాలో ఆయన పేరు కూడా ఉంది. ఈ దుర్ఘటనలో మొత్తం ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. ఒక హెలికాప్టర్‌లో పైలట్ మాత్రమే ఉన్నారు. బ్రెజిల్ నగరం రియో డీ జెనీరో గగనతలంపై వెళుతున్న రెండు హెలికాప్టర్లు ఒకదానితో మరొకటి ఢీకున్నాయి. హెలికాప్టర్ శిథిలాలు చిందరవందరగా కిందపడ్డాయి. స్థానిక టైర్ కార్మికుడు ఫెర్నాండెజ్ డీ ఫ్రాటిస్ ఈ ఘటనలో ప్రత్యక్షసాక్షిగా ఉన్నారు. పెద్ద శబ్దం వచ్చింది, పైకి చూస్తే మండుతున్న శిథిలాలు కిందపడుతూ కనిపించాయి, అందులోంచి ఒకరు బయటకు దూకడం కూడా కనిపించింది అన్ని చెప్పారు. హెలికాప్టర్ శిథిలాలు కింద పడుతున్న దృశ్యాల వీడియోలు కూడా విడుదలయ్యాయి.

1993లో శాంతాక్రాజ్‌లో జన్మించిన ఆలివర్ ట్రీ 2016లో సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చి తర్వాత బాగా పాపులర్ అయ్యారు. విభిన్నమైన డ్రసింగ్, హెయిర్ కట్‌లతో, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన పాటలకు తనదైన పద్ధతులలో ప్రత్యామ్నాయ ట్యూన్స్‌లో దర్శకత్వం వహించి రూపొందించిన పాప్ మ్యూజిక్ వీడియోలకు ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారు. ఆయన కేశాలంకరణ కూడా చాలా విభిన్నంగా ఉండటం పెద్ద ఆకర్షణీయంగా ఉంటుంది. ఆయనకు టిక్‌టాక్‌లో 15.4 మిలియన్లకు పైగా, ఇన్‌స్టాగ్రామ్‌లో 3.3 మిలియన్లకు పైగా యూట్యూబ్‌లో 6.90 మిలియన్లకు పైగా ఫాలోయర్లు ఉన్నారు. ప్రపంచ పర్యటనలో ఉన్న ఓలివర్ ట్రీ జూన్ ఆరో తేదీన సావోపోలోలో ప్రదర్శన ఇచ్చారు. జులై ఒకటో తేదీన పోర్చుగల్‌లోని లిస్బన్‌లో ఆయన ప్రదర్శన షెడ్యూల్ ప్రకార జరగాల్సి ఉంది. చైనా సహా పలు దేశాల్లో ఆయన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. 2020లో ''అగ్లీ ఈజ్ బ్యూటిఫుల్'' అనే పేరుతో ఆయన మొదటి ఆల్బమ్, 2022లో ''కౌ బోయ్ టియర్స్'' ఆ తర్వాత 19 నెలలకు ''ఎ లోన్ ఇన్ ఎ క్రౌడ్'' విడుదల కాగా, ఈ ఏడాది ఆరంభంలో ''లవ్ యూ మాడ్లీ–హేట్ యూ బ్యాడ్లీ'' ఆల్బమ్ విడుదలైంది.

ఇదిలా ఉండగా, అమెరికా మిస్సోరిలోని బట్లర్ విమానాశ్రయం సమీపంలో ఒక చిన్న ప్రైవేటు విమానం కూలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న 12 మంది మరణించారు. వీరంతా స్కైడైవింగ్ చేసేందుకు వెళుతుండగా ఈ ఘటన జరిగింది.

## లెబనాన్‌పై దాడుల నిలిపివేత సహా

# ఎంఒయు అమలు బాధ్యత ట్రంప్‌దే:అరాఘ్చీ



**టెహ్రాన్:** లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులను నిలిపివేయడంతోపాటు ప్రాథమిక అవగాహన ఒప్పందం (ఎంఒయు) అమలు బాధ్యత కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌దేనని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ పేర్కొన్నారు. అమెరికాతో యుద్ధ విరమణకు సంబంధించి ఒక ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత సోమవారం ఆయన పలు దేశాల విదేశీ వ్యవహారాల మంత్రులతో ఫోన్ సంభాషణలు చేస్తూ పై విషయాన్ని ఉద్ఘాటించి చెప్పారు. టర్కీ,ఇరాక్,ఈజిప్టు విదేశాంగమంత్రులు హకాన్ ఫిదాన్, ఫువాన్ హుస్సేన్,బదర్ అబ్దెలెట్టీలతో వేరువేరుగా ఆయన ఫోన్ సంభాషణలు చేశారు. కాల్పుల విరమణ ఏర్పాటుకు, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గించడానికి, ఈ ప్రాంతంలో స్థిరత్వం,భద్రత సాధించడానికి చేస్తున్న దౌత్యపరమైన ప్రయత్నాలకు టర్కీ,ఈజిప్టు,ఇరాక్ దేశాలు అందించిన సహాయాన్ని, మద్దతును ఆయన ప్రశంసించారు. ప్రాంతీయ పరిణామాలపై సన్నిహిత సంప్రదింపులను, శాంతి,స్థిరత్వాన్ని కాపాడటానికి దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేయాలని అన్ని పక్షాలు ఉద్ఘాటించాయి. ఈ ఏడాది ఏప్రిల్ 8వ తేదీన పశ్చిమాసియాలో అమెరికా కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత అమెరికా–ఇరాన్ చిత్తశుద్ధితో యుద్ధాన్ని నిలిపివేసేందుకు మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా చర్చలు ప్రారంభించింది. బాహాటంటా ముఖాముఖీ ఒకసారి ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలు విఫలమైన తర్వాత తెరవెనుక మూడు నెలలపాటు ముమ్మరంగా చర్చలు జరిగిన తర్వాత ఒక ప్రాథమిక ఒప్పందం కుదిరింది. దీంతో 107 రోజుల యుద్ధానికి తెరపడింది.

## రైతుకు మేలు

(మొదటి పేజీ తరువాయి)

తిరుగులేని డిమాండ్ లభిస్తుందని, అందుకే వీటిపైన రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహణ సదస్సులను నిర్వహించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యుల, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు తదితర అంశాలపైన సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు పలు కీలక ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్‌లో ఉన్న బియ్యానికి విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ బియ్యానికి అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్‌లాంటి విదేశాలలో విపరీతమైన ఆదరణ ఉన్నదని, ఇది రైతులకు అత్యంత లాభదాయకమైన పంటగా మారనుందని వివరించారు. మేలు రకం పంటలను సాగు చేయడానికి మార్కెట్‌లో విత్తనాల కొరత అస్సలు లేదని, అందుకే సాగును విస్తృతం చేయడం సులువని'' శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. రాబోయే సీజన్లలో 8 రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కేబినెట్ సబ్ కమిటీకి నివేదించారు.

**అన్ని రకాల సన్న బియ్యానికి అదరణ లేదు..**

రాష్ట్రంలో సాగు చేస్తున్న అన్ని రకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రుల కమిటీకి వివరించారు. కొన్ని రకాల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు బియ్యం ఎక్కువగా విరిగిపోవడం, వినియోగదారుల అభిరుచులకు తగినట్టుగా లేకపోవడంతో మిల్లర్లు, వ్యాపారులు వాటిని కొనుగోలు చేయడానికి ఇష్టపడటం లేదని వివరించారు. వినియోగదారులు, మిల్లర్లు, వ్యాపారులకు ఇష్టమైన,అలాగే అంతర్జాతీయంగా ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాలను మాత్రమే ఇకపై ప్రోత్సహించాలని, డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించడం మంచిదని వారు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని కేబినెట్ సబ్ కమిటికి అధికారులు నివేదించారు. భవిష్యత్తులో రైతులకు నష్టాలు రాకుండా ఉండేందుకు పూర్తిగా మార్కెట్ డిమాండ్ ఆధారిత పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులు మంత్రులకు వివరించారు. ఈ సమావేశంలో రైతు కమిషన్ ఛైర్మెన్ ఎం.కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ ఛైర్మెన్ అన్వేష్ రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సురేందర్ మోహన్, వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపీ, మార్క్‌ఫెడ్ ఎం.డి రాహుల్ రాజ్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు కృషి చేయాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించుకున్నారు. అదేవిధంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం సత్వరం కుదరడానికి సహకారం అందజేసిన స్లోవేకియాకు ఆయన తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

''మేం ఇరు దేశాల సంబంధాలను ఉన్నతీకరించుకోవాలని నిర్ణయించుకున్నాం, సమగ్రభాగస్వామ్యాన్ని పెంపొందించుకుంటాం, ఇది మా ఉమ్మడి విశ్వాసానికి, ఉమ్మడి భాగస్వామ్యానికి, ఉమ్మడి భవిష్యత్తుకు ప్రతీక'' అని మీడియాకు ఒక ప్రకటనలో ప్రధానమంత్రి మోదీ తెలియజేశారు. ఈ ఒప్పందాల ద్వారా ఇరు దేశాల సంబంధాలను కొత్త దశకు తీసుకువెళతారు, సహకార భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవడానికి కొత్త మార్గాలను అన్వేషిస్తారు. ఇరు దేశాల భవితకు ఒక మార్గదర్శకాన్ని నిర్దేశించే విషయాలపై తామిద్దరం చర్చించామని ఆ ప్రకటనలో తెలియజేశారు. ఇంధనరంగంతోపాటు ఇంధన భద్రతను ప్రోత్సహించడం దీనికి సంబంధించిన వివిధ విభాగాలలో సమన్వయం ద్వారా ఆయా సాంకేతికతలను ఉమ్మడిగా విస్తరించడం,హరిత ఇంధనాన్ని పెంపొందించడం,స్థిరత్వం,భద్రత,సంక్షోభాలను తట్టుకుని నిలబడేవిధంగా సహకారాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు. ఇరు దేశాలలో విస్తారమైన వనరులు ఉన్నాయి, మా ఆశయాలుకూడా అంతకంటే పటిష్టంగా ఉన్నాయి, ఆటోమొబైల్, రైల్వేలు, భవిష్యత్తుకు ఉపయోగపడే అడ్వాన్స్‌డ్ తయారీ ఉత్పత్తులు,గ్రీన్ టెక్నాలజీ వంటి ముఖ్యంగా ఇరు దేశాలకు ప్రయోజనకరమైన రంగాలలో భాగాస్వామ్యాన్ని పటిష్టం చేస్తామని పేర్కొన్నారు. ఇరు దేశాలమధ్యా రక్షణ సహకారం గాఢమైన పరస్పర విశ్వాసానికి,వ్యూహాత్మక ఏకాభిప్రాయానికి ఒక నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై ఇరు దేశాలు సన్నిహిత సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి, అన్ని వివాదాలను, ఉద్రిక్తతలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మేం నిర్ణయించుకున్నామన్నారు. ఇరు దేశాల రక్షణ రంగాలమధ్యా సహకారాన్ని సరికొత్తస్థాయిలో ముమ్మరం చేయడం,ముందుకు తీసుకువెళ్ళడం ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమైనదని తాము అంగకరించామని మోదీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. త్వరగా స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం అమలు చేయడం ద్వారా రెండు దేశాలలో ఉన్న పరిశ్రమలు, అంకుర సంస్థలు, వాణిజ్యవేత్తలు గరిష్ఠస్థాయిలో ప్రయోజనం పొందుతారని అన్నారు. అదేవిధంగా కార్మికులను పరస్పరం వలసలు పంపించడం,రక్షణ,డిజిటల్ టెక్నాలజీ,ఉన్నత విద్యారంగం,క్వాంటం కమ్యూనికేషన్స్ రంగాలలో సహకారాన్ని లోతుగా విస్తరించడంపై కూడా ఈ 11 ఒప్పందాలలో ఉన్నాయి.

## 19న సంతకాలు

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య నౌకలు శాశ్వత ప్రాతిపదికపై రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. కాగా, ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం ఎత్తివేసేందుకు, స్తంభింపజేసిన ఆస్తులలో 12 బిలియన్ డాలర్లు విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించిందని, యుద్ధం తక్షణం ముగిసిందని,కీలక సమస్యలపై చర్చలు కొనసాగుతాయని ఇరాన్ డిప్యూటీ విదేశీ వ్యవహారాల మంత్రి కలెంగరీ బాబాదీ చెప్పారు.

అదేవిధంగా ఈ ఒప్పందం కుదరడానికి అధికారిక మధ్యవర్తిగా కీలకపాత్ర నిర్వహించిన పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఒక ప్రకటన చేస్తూ, లెబనాన్‌తో సహా అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని, ఈ మేరకు లెబనాన్ సహా అన్ని ప్రాంతాలలోనూ యుద్ధం ఆగిపోతుందని, జెనీవా వేదికగా ఈనెల 19న సంతకాలు జరుగుతాయన్నారు. ఒప్పందం కుదరడానికి సహకారించిన దేశాలకు అభినందనలు తెలియజేశారు. జెనీవాలో సంతకాలు చేసేందుకు వెళుతున్న అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మాట్లాడుతూ వీలైతే తనతోపాటు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా వస్తారని చెప్పారు. 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందంపై తదుపరి చర్చలు కొనసాగుతాయని, ఈ ఒప్పందం రాబోయే 50 సంవత్సరాలలో పశ్చిమాసియా రూపాంతరీకరణకు దోహదం చేస్తుందని చెప్పారు.

ఈ సానుకూల పరిణామాలతో ఆసియా, యూరప్ సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు మంచి జోష్‌లో ముందుకు దూసుకువెళ్ళాయి. ముడి చమురు ధరలు ఒకేసారి ఐదుశాతం మేరకు తగ్గిపోయాయి. భారత్ రూపాయి కూడా 53 పైసల మేరకు బలపడింది. బంగారం,వెండి సహా లోహాలకు గిరాకీ మళ్ళీ భారీగా పెరిగింది. స్థానికంగా చూసినప్పుడు 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1,55,490లకు చేరింది. భారత్ నిఫ్టీ 350 పాయింట్లు బలపడగా, బిఎస్‌ఇ 1,100 పాయింట్లు బలపడింది.

ఈ ఒప్పందం కుదరడానికి చివరి రోజున ఆదివారంనాటికి (జూన్ 14) ట్రంప్ 80వ పుట్టినరోజు చేసుకున్నారు. కానీ ఆరోజంతా ఆయనకు పూర్తిగా ఊపిరిసలపని ఉత్కంఠతోనే గడచింది. ఒకవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు,మరోవైపు దాడులపై ఇరాన్ ఆగ్రహం, మరోవైపు 14 గంటలపాటు ఎడతెగకుండా సాగిన మంతనాల మధ్య ఎట్టకేలకు ఇరాన్ తన అంగీకారం తెలియజేసింది. చిట్ట చివరిగా ఆయన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని జూన్ 11వ తేదీన ఇరాన్‌కు తుది హెచ్చరిక చేశారు. కానీ ఆయన ఖర్గ్ ద్వీపంపై దాడి చేయలేదు. ఆ తర్వాత నుండి ఆయన నుండి హెచ్చరికలు వెళ్ళడం ఆగిపోయింది. ఇక అప్పటినుండీ ట్రంప్ ఒప్పందం కుదురుతుందని అంతకుమునుపులేని విశ్వాసంతో ప్రకటనలు ప్రారంభించారు. ఒప్పందం కుదిరిన తర్వాత పరిస్థితులన్నీ చక్కబడిన తర్వాత ఇరాన్ వెళ్ళి పర్వతాల మధ్య శిథిలాల్లో కూరుకుపోయిన శుద్ధిచేసిన యురేనియంను తీసుకువస్తామని ప్రకటించారు.

**శాంతి–స్థిరత్వ పునరుద్ధరణకు దోహదం**

**ఒప్పందంపై హర్షం ప్రకటించిన మోదీ**

అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందం శాంతి–స్థిరత్వాలకు, నౌకాయానం,వాణిజ్య స్వేచ్ఛల పునరుద్ధరణకు దోహదం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రస్తుతం జి–7 సదస్సులో పాల్గొనేందుకు వెళ్ళిన మోదీ సోషల్ మీడియా ద్వారా సోమవారం ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్–అమెరికా మధ్య ఒప్పందంపై హర్షం ప్రకటించారు. ఈ ఒప్పందాన్ని భారతదేశం స్వాగతిస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి ముందు జరిగిన యుద్ధం ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభానికి దారితీసిందని,తీవ్ర ఆర్థిక నష్టాలకు, అనేక దేశాలలో ప్రాణ నష్టాలకు దారితీసిందని పేర్కొన్నారు.తదుపరి చర్చల ద్వారా ఒక శాశ్వత తుది ఒప్పందానికి రావాలని తామంతా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

**శాంతిస్థాపనలో సహాయానికి సిద్ధం యూరోపియన్ యూనియన్**

అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన యుద్ధ విరమణ శాంతి ఒప్పందం (ఎంఓయు)ను యూరోపియన్ యూనియన్ స్వాగతించింది. యూనియన్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఎక్స్ వెబ్‌సైట్ వేదికగా హర్షం ప్రకటించారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దోహదం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పలువురు యూరోపియన్ సీనియర్ నాయకులు ప్రకటించారు. ఈ నష్టదాయకమైన యుద్ధం ముగిసిపోవాలని, హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం పునరుద్ధరణ జరగాలని తాము ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నామని కాస్టో తన ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుధాలన్నీ నిశ్శబ్దం కావాలి, పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని ముందుకు తీసుకువెళ్ళడానికి ఒక సమగ్ర ప్రణాళికను అమలు చేయడంలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని ప్రకటించారు. యూరోపియన్ యూనియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండ ర్‌లేయన్ ఒక ప్రకటన చేస్తూ, ఇప్పుడు ఈ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేయడమే ప్రాధాన్యతాంశమని పేర్కొన్నారు. అన్ని పక్షాలూ లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని, ప్రాదేశిక సమగ్రతను కాపాడాలని నిజమైన కాల్పుల విరమణను అమలు చేయాలని కోరారు. లెబనాన్ అగ్నిజ్వాలల్లో మండుతున్నంతకాలం పశ్చిమాసియాలో శాంతి ఉండదని ఆమె హెచ్చరించారు.హోర్ముజ్ జలసంధిని తెరవడం ప్రాంతీయ స్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ముఖ్యమని,అదేవిధంగా ఇరాన్ బాలిస్టిక్ కార్యక్రమాలను కూడా అంతం చేయడం అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

## ఆ ముగ్గురే

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్, పలువురు ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు. ఎల్ అండ్ టి నుంచి మెట్రో మొదటి దశ స్వాధీనం, నిధుల సమీకరణ, రెండో దశ విస్తరణ అంశాలపై సిఎం వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చినప్పటికీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకోవడం వల్లే ఐఆర్‌ఎఫ్‌సి రుణాలు ఎల్‌అండ్‌టి కి విడుదల కాలేదని సిఎం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కెసిఆర్ అంతర్గతంగా సహకరించినందుకు గానూ మంత్రి కిషన్ రెడ్డి ఇప్పుడు ఆయనకు 'గురుదక్షిణ' చెల్లిస్తున్నారని సిఎం వ్యాఖ్యానించారు. 'మంత్రి కిషన్ రెడ్డి అంత తెలివి లేదు. కెసిఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారు. కెసిఆర్‌కు లొంగిపోయిన కిషన్ రెడ్డి మెట్రోకు అడ్డుపడుతున్నారు. కిషన్ రెడ్డి వెనుక కెటిఆర్ ఉన్నారు. కెటిఆర్ కుట్రలకు కిషన్ రెడ్డి సహకరిస్తున్నారు. కెటిఆర్ కుట్రలు చేస్తుంటే కిషన్ రెడ్డి వాటిని అమలు చేస్తున్నారు' అని సిఎం వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్, విశాఖపట్నం మెట్రోలకు కేంద్రం వెంటనే అనుమతులిచ్చి, హైదరాబాద్‌కు మాత్రం నిలిపివేస్తూ తెలంగాణపై వివక్ష చూపుతోందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి కాబట్టి నిధుల అంశం ఆయనను అడుగుతున్నామని, కిషన్ రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సిఎం రేవంత్ కోరారు. కిషన్ రెడ్డి పట్ల తనకు వ్యక్తిగత ద్వేషం లేదని, మెట్రో విషయంలో ఆయన బిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉంటే తాను అండగా ఉంటానన్నారు. మెట్రో విస్తరణ జరిగేచోట బిఆర్‌ఎస్, బిజెపి ఎంఎల్‌ఎలే ఉన్నారని, మెట్రో ఫేజ్2 పనులకు కిషన్ రెడ్డి సహకరిస్తే ఒక మెట్రో స్టేషన్‌కు ఆయన పేరు పెడతామని సిఎం తెలిపారు.

**ఎన్‌ఓసి ఇస్తే కేంద్రం వాటా లేకుండానే మెట్రో రైల్ రెండో దశ విస్తరణకు సిద్ధం**



హైదరాబాద్ విశ్వనగరంగా తీర్చిదిద్దడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించడానికి మెట్రో రైలు విస్తరణ ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇస్తే కేంద్రం వాటా లేకుండానే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో విషయంలో కేంద్రం వెంటనే లోన్ రిలీజ్ చేయకపోతే ప్రత్యామ్నాయ అంచనాలను పరిశీలిస్తామన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో మొదటి దశను స్వాధీనం చేసుకున్న తర్వాత రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో విస్తరణ చేపట్టాల్సి ఉందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు మొదటి దశ స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడానికి ఎల్ అండ్ టీకి రూ.13,500 కోట్ల నిధుల కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఆర్‌ఎఫ్‌సితో అన్ని రకాల ఒప్పందాలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కౌంటర్ గ్యారెంటీ కూడా ఇచ్చామని చెప్పారు. మొదట్లో రూ.15 వేల కోట్లతో ప్రారంభించిన మెట్రో పూర్తయ్యేనాటికి రూ. 22 వేల కోట్లకు చేరిందని, ఆ తర్వాత గత ప్రభుత్వంలో పదేండ్ల పాటు మెట్రో విస్తరణపై ఆలోచన చేయలేదన్నారు. ఆ రోజుల్లో దేశంలో ఢిల్లీ మెట్రో మొదటి స్థానంలో ఉంటే హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో ఉండిందని, విస్తరణ చేయని కారణంగా ఇప్పుడు 9వ స్థానానికి పడిపోయిందని చెప్పారు. మెట్రో 2వ దశ విస్తరణ చేపట్టడానికి ఎల్ అండ్ టీని ఒప్పించి ఒప్పందం చేసుకోవాలని కేంద్రం సూచించిందని, అయితే ప్రతి ఏటా రూ.350 కోట్ల నుంచి రూ. 400 కోట్ల నష్టాలొస్తున్నాయని, ఆ నష్టాల కారణంగా 2వ దశ విస్తరణ చేపట్టలేమని ఎల్ అండ్ టి తేల్చిచెప్పిందన్నారు. ఈ దశలో మొదటి దశ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో విస్తరణ చేపట్టాలని మళ్లీ కేంద్రం సూచించిన నేపథ్యంలోనే ఆ దిశగా కార్యాచరణ పూర్తి చేశామని సిఎం తెలిపారు. హైదరాబాద్ మహానగంలో అన్ని వైపుల మెట్రోను విస్తరించడానికి, అన్ని రూట్లలో మెట్రో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం రూ. 30 వేల కోట్ల విలువైన మెట్రో ప్రాజెక్టును రూ. 15 వేల కోట్లకు ఎల్ అండ్ టీ నుంచి కొనుగోలు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో అనేక ప్రాజెక్టులకు 8 నుంచి 11 శాతం వడ్డీకి రుణాలను తీసుకుంటే, మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో స్వాధీనం కోసం కేవలం 4 శాతం వడ్డీకి ఐఆర్‌ఎఫ్‌సి నుంచి ఎల్ అండ్ టికి చెల్లించాల్సిన రూ.13,600 కోట్ల కోసం ఒప్పందం చేసుకున్నామని వివరించారు. అందుకోసం ఫీజు రూపేణా సంస్థకు రూ.84 కోట్లతో పాటు ఈక్విటీగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 1400 కోట్లను కూడా చెల్లించామని తెలిపారు. రుణ ఒప్పందానికి సంబంధించి లావాదేవీలన్నీ పూర్తయ్యాయని, ఐఆర్‌ఎఫ్‌సితో తెలంగాణ ప్రభుత్వానికి మధ్యన కుదిరిన ఒప్పందం ప్రకారం సోమవారం నిధుల చెల్లింపు జరగాల్సి ఉండగా ఐఆర్‌ఎఫ్‌సి నుంచి నిధుల విడుదల ఆగిపోయిందని అన్నారు. అందుకు కారణం ఎవరని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకమని, జరిగిన ఒప్పందాలను రాష్ట్ర ఎంపిలకు అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వివరిస్తామని సిఎం తెలిపారు.

### జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో

# తెలంగాణ క్రీడాకారుల సత్తా

**2 స్వర్ణాలు, 4 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 11 పతకాలు**

**రాష్ట్ర చరిత్రలో తొలిసారి జాతీయ స్థాయిలో విశేష విజయాలు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయస్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఉత్తరాఖండ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కియో) ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్2026లో తెలంగాణ జట్టు 11 పతకాలు సాధించి చరిత్ర సృష్టించింది. సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్ విభాగాల్లో రాష్ట్రం నుంచి ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు వివిధ కేటగిరీల్లో పోటీపడి 2 స్వర్ణ, 4 రజత, 5 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం నుంచి తొలి సారిగా 11 పతకాలు సాధించడం విశేషమని తెలంగాణ స్పోర్ట్స్ కరాటేడో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్యాల రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులు, కోచ్‌లను తెలంగాణ స్పోర్ట్స్ కరాటేడో అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ తెలంగాణ కరాటే క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కఠిన సాధన, కోచ్‌ల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని విజేతలు పేర్కొన్నారు. తెలంగాణ కరాటే రంగానికి ఈ విజయం కొత్త ఉత్సాహాన్ని నింపిందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సూపర్ ఓవర్లో ఓడిన ఇండియా

**లంక క్రికెటర్లతో సూర్యవంశీ ఘర్షణ..**



ముక్కోణపు వన్డే టోర్నీలో డంబుల్లాలో ఇండియా–ఏతో సోమవారం జరిగిన రసవత్తర మ్యాచ్‌లో శ్రీలంకఏ జట్టు సూపర్ ఓవర్‌లో విక్టరీ కొట్టింది. తొలుత ఇద్దరి మధ్య మ్యాచ్ టై కాగా, ఆ తర్వాత సూపర్ ఓవర్ ఆడారు. సూపర్ ఓవర్‌లో శ్రీలంక విధించిన లక్ష్యాన్ని భారత్ అందుకోలేకపోయింది. సూపర్ ఓవర్‌లో ఏడు రన్స్ తేడాతో ఇండియా ఓడింది. తొలి మూడు బంతులను షెడ్జ్ ఆడగా, చివరి మూడు బంతులను సూర్యవంశీ ఆడారు. కానీ అతను కేవలం 5 రన్స్ మాత్రమే చేశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత శ్రీలంక ప్లేయర్లు, సూర్యవంశీ మధ్య వాగ్వాదం జరిగింది. సూర్యవంశీ, లంక ప్లేయర్లు ఒకర్ని ఒకరు తోసుకున్నారు. ఓ లంక ప్లేయర్ ఆ గొడవను ఆపాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా 49.2 ఓవర్లలో 265 రన్స్ చేసి ఆలౌటైంది. అయితే చేజింగ్లో తగ్గాఫార్ నడిచింది. ఇరు జట్లు విజయం కోసం తీవ్రంగా పోరాడాయి. నిర్ణీత 50 ఓవర్లో శ్రీలంక ఏ జట్టు 9 వికెట్లు కోల్పోయి 265 రన్స్ చేసింది. ఆఖరి బంతికి రెండు రన్స్ అవసరం కాగా, చమిక గుణశేఖర రనౌట్ అయ్యాడు. దీంతో మ్యాచ్ టై అయ్యింది. మ్యాచ్ టై కావడంతో.. శ్రీలంక, భారత కెప్టెన్లు సూపర్ ఓవర్ ఆడేందుకు సముఖత వ్యక్తం చేశారు. కాసేపు మైదానంలోనే అంపైర్లతో చర్చ జరిగింది. అప్పటికే లైట్ డిమ్ కావడం వల్ల సూపర్ ఓవర్ జరుగుతుందో లేదో టెన్షన్ ఉండే. కానీ సూపర్ ఓవర్లో ఫస్ట్ శ్రీలంక బ్యాటింగ్ చేసింది. భారత పేసర్ అర్షద్ ఖాన్ ఆ ఓవర్ వేశాడు. ఆ సూపర్ ఓవర్లో శ్రీలంక వికెట్ నష్టపోకుండా 16 రన్స్ స్కోరు చేసింది. 17 రన్స్ టార్గెట్తో సూపర్ ఓవర్లో బరిలోకి దిగిన భారత్.. కేవలం 10రన్స్ మాత్రమే చేసింది. దీంతో శ్రీలంక ఏ జట్టును విజయం వరించింది. ఇండియన్ ఇన్నింగ్స్లో సూర్యవంశీ 21, రుతురాజ్ 37, సూర్యాంశ్ షెడ్జ్ 72, విప్రాజ్ నిఘమ్ 51 రన్స్ చేశారు. చేజింగ్లో లంక బ్యాటర్ సమరవిక్రమ అద్భుత బ్యాటింగ్ చేశాడు. అతను కీలకమైన 93 రన్స్ చేశాడు. లంక బ్యాటర్లలో డిక్వెల్ల 37, ఫెర్నాండో 22, వనుస సహాన్ 25 రన్స్ చేశారు. అయితే థ్రిల్లింగ్గా సాగిన మ్యాచ్లో చివరకు ఎందుకు ఘర్షణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. సూర్యవంశీ, షెడ్జ్ జోడిని సూపర్ ఓవర్లో విజయవంతంగా లంక బౌలర్లు అడ్డుకోగలిగారు.

## యువతరంగం

# ఉపాధి..ఓ సవాలు..

ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత యువత భవిష్యత్తుకు పెద్ద సవాలుగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం యువత నిరుద్యోగిత రేటు సుమారు 13 శాతం వద్ద కొనసాగుతోంది. అయితే సమస్య కేవలం ఉద్యోగాల కొరతతో మాత్రమే పరిమితం కావడం లేదు. ఉద్యోగాలు లభించినప్పటికీ వాటి నాణ్యత తక్కువగా ఉండటం, తాత్కాలిక లేదా అస్థిర ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటం కూడా యువత జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో విద్య పూర్తిచేసిన యువతకు తమ అర్హతలకు తగిన ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారింది. ఫలితంగా చాలామంది తక్కువ వేతనాలు ఇచ్చే ఉద్యోగాలు లేదా పార్ట్ టైమ్ పనుల్లో చేరాల్సి వస్తోంది. ఇలాంటి ఉద్యోగాల్లో ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, ఆరోగ్య ప్రయోజనాలు, పదోన్నతి అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయి. ఈ పరిస్థితిని ప్రికేరియస్ వర్క్ లేదా అస్థిర ఉపాధిగా పేర్కొంటారు. నిరుద్యోగిత, అస్థిర ఉపాధి, ప్రచ్ఛన్న నిరుద్యోగం వంటివి యువత ఆర్థిక స్థితిపై మాత్రమే కాకుండా వారి మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతున్నాయి. స్థిరమైన ఆదాయం లేకపోవడం వల్ల భవిష్యత్తుపై అనిశ్చితి పెరుగుతుంది. ఇల్లు కొనుగోలు చేయడం, కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవడం, ఉన్నత విద్య లేదా నైపుణ్యాభివృద్ధికి పెట్టుబడి పెట్టడం వంటి జీవిత లక్ష్యాలు ఆలస్యమవుతాయి. ఈ పరిస్థితులు ఆందోళన, నిరాశ, ఆత్మవిశ్వాసం కోల్పోవడం వంటి సమస్యలకు దారితీస్తాయి. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందడం, ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం పెరగడం కూడా ఉద్యోగ విపణిలో మార్పులకు కారణమవుతున్నాయి. కొన్ని సంప్రదాయ ఉద్యోగాలు కనుమరుగవుతుండగా, కొత్త నైపుణ్యాలు అవసరమయ్యే ఉద్యోగాలు పెరుగుతున్నాయి. అయితే యువతలో అందరికీ ఈ మార్పులకు అనుగుణంగా శిక్షణ పొందే అవకాశాలు సమానంగా లభించడం లేదు. దీంతో నైపుణ్యాల లోటు, ఉపాధి మధ్య అంతరం పెరుగుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. మార్కెట్ అవసరాలకు అనుగుణమైన




నైపుణ్య శిక్షణ, వృత్తి విద్య, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, యువతకు స్థిరమైన, గౌరవప్రదమైన ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి పెట్టాలి. యువతకు నాణ్యమైన ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చినప్పుడే ఆర్థికాభివృద్ధి మరింత సమగ్రంగానూ, స్థిరంగానూ కొనసాగుతుంది.

## పెరుగుతున్న మానసిక అనారోగ్యం!




మానసిక ఆరోగ్య సంక్షోభం నేటి ప్రపంచంలో ముఖ్యంగా యువతను ప్రభావితం చేస్తున్న అత్యంత ఆందోళనకరమైన సమస్యగా మారింది. ఇటీవల వచ్చిన అనేక అధ్యయనాలు, నివేదికలు యువతలో మానసిక ఆరోగ్య సూచికలు క్షీణిస్తున్నాయని, ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయని వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటిగా అధిక స్క్రీన్ టైమ్‌ను పరిశోధకులు పేర్కొంటున్నారు. వారి అభిప్రాయం ప్రకారం, స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వేదికలు, ఆన్‌లైన్ గేమ్స్, వీడియో స్ట్రీమింగ్ సేవలు యువత జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. విద్య, వినోదం, సామాజిక సంబంధాల కోసం డిజిటల్ పరికరాలపై ఆధారపడటం పెరిగింది. అయితే, రోజుకు అనేక గంటలపాటు స్క్రీన్‌ల ముందు గడపడం మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. సోషల్ మీడియాలో ఇతరుల జీవితాలను చూసి తమను తాము పోల్చుకోవడం వల్ల అసంతృప్తి, ఆత్మవిశ్వాసం తగ్గడం, జీవితంపై నిరాశ వంటి భావనలు కలుగుతున్నాయి. అలాగే నిరంతరం వచ్చే నోటిఫికేషన్లు, సమాచార ప్రవాహం మెదడుపై అదనపు ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. నివేదికలు మరో ముఖ్యమైన అంశాన్ని కూడా సూచిస్తున్నాయి. స్క్రీన్‌ల వినియోగం పెరుగుతున్న కొద్దీ ప్రత్యక్ష మానవ సంబంధాలు తగ్గుతున్నాయి. గతంలో స్నేహితులు, కుటుంబ సభ్యులు, పొరుగువారితో ముఖాముఖి సంభాషణలు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం చాలామంది యువకులు ఆన్‌లైన్ సందేశాలు, వీడియో కాల్స్, సోషల్ మీడియా ద్వారా మాత్రమే సంబంధాలు కొనసాగిస్తున్నారు. సాంకేతికంగా అనుసంధానమై ఉన్నప్పటికీ, భావోద్వేగపరంగా ఒంటరితనం పెరుగుతోంది. ప్రత్యక్ష సంభాషణల ద్వారా అభివృద్ధి చెందే సహానుభూతి, భావ వ్యక్తీకరణ, సమస్యలను కలిసి పరిష్కరించే నైపుణ్యాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. ఇది వ్యక్తిగత సంబంధాల నాణ్యతను కూడా ప్రభావితం చేస్తోంది. స్నేహాలు, కుటుంబ బంధాలు, సామాజిక అనుబంధాలు ఉపరితల స్థాయికే పరిమితమవుతున్నాయి. ఫలితంగా, యువతలో ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తగ్గి, చిన్న సమస్యలకే తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అధిక స్క్రీన్ వినియోగం నిద్రలేమి, శారీరక చురుకుదనం తగ్గడం వంటి సమస్యలను కూడా పెంచి, అవి మానసిక ఆరోగ్యంపై మరింత ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల యువతలో మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి డిజిటల్ పరికరాల వినియోగాన్ని సమతుల్యంగా ఉంచడం అవసరం. కుటుంబ సభ్యులు, స్నేహితులతో ప్రత్యక్షంగా సమయం గడపడం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన మానవ సంబంధాలను పెంపొందించుకోవాలి. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూనే, నిజ జీవిత అనుబంధాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా యువత మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి

**ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు ఉధృతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు కోరారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఎఐటియుసి ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో శింగు నర్సింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మిక వర్గం ఎనిమిది గంటల పని, కనీస వేతనాలు, సంఘ హక్కులను కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయమని కేంద్రానికి తెలియజేయాలని, శతాబ్దాల కాలంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక సంక్షేమ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న' కార్మికులకే అల్పాహార పథకం బాధ్యతలు

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ వినతి**




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో వంట కార్మికులు కలిసి ఎంపిఎస్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం నీలాదేవి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్ రెడ్డి, విద్యానగర్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కల్పలతకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, ప్రైవేట్ సంస్థలకు ఈ పథకాన్ని అప్పగించవద్దని డిమాండ్ చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన 9 నెలల పెండింగ్ బిల్లులను, పారితోషిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ ఏడాది ప్రారంభించే అల్పాహార పథకం బాధ్యతలను మధ్యాహ్న భోజన కార్మికులకే అప్పగించి, దానికి సంబంధించిన విధివిధానాలను ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం వంట కార్మికులకు రూ. 10,000 వేతనాన్ని వెంటనే అమలు చేయాలని, కొడిగుడ్లు, గ్యాస్, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వంట కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చి, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కార్మికులు ఎం.సంతోష్, విమల, రేఖ, సుజాత, దేవమ్మ, రూప, అనసూయ, సంధ్యారాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల హక్కుల పరిరక్షణ,

# సింగరేణి రక్షణకు పోరాటం

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్**



**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణి రక్షణ కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో పిఎఓసి2లో గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ 8న యాజమాన్యానికి సమ్మె నోటు ఇవ్వడం జరిగిందన్నారు. సమ్మె నోటీసులో 31 డిమాండ్లను చేర్చడం జరిగిందన్నారు. సింగరేణి మేనేజ్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేనిచో సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సింగరేణి రక్షణ కార్మికుల హక్కుల పరిరక్షణ కొరకు పోరాటం చేస్తామన్నారు అవసరమైతే సమ్మెకు కూడా వెనకాడమన్నారు కార్మికులందరూ సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియాలో పికెఒసి 2 డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ రాకపోతే మణుగూరుకు భవిష్యత్తు ఉండదని, సింగరేణికి కూడా ఆర్థికంగా నష్టపోవడమే కాక సింగరేణితో పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన మణుగూరు, పరిసర ప్రాంతాల ప్రజల ఉపాధి, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మణుగూరు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వరంగ సంస్థలైన బిటిపిఎస్, హెవీ వాటర్ ప్లాంట్, బిపిఎల్ తదితర సంస్థలు ఈ ప్రాంత బొగ్గుతోటే మనుగడ సాధిస్తున్నాయని, సింగరేణి సంస్థ బొగ్గు వెలికి తీయకపోతే ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేల కుటుంబాలు ఉపాధికి దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందన్నారు. బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా సింగరేణిని ఈ ప్రాంతంలో సజీవంగా ఉంచేందుకై 'సేవ్ సింగరేణి–సేవ్ మణుగూరు' నినాదంతో అన్ని యూనియన్లను, పార్టీలను కలుపుకొని కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి వై.రామ్ గోపాల్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, బి.సురేందర్‌రావు, శనిగరపు కుమారస్వామి, బి.రవికుమార్, సుదీప్, జానకిప్రసాద్, నాగుల సతీష్, బత్తుల కృష్ణ, నరహరి, ప్రవీణ్, ఇమాముద్దీన్, టి.నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇండ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్ ఇవ్వాలి

**సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి**




**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం) :** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్స్ సౌకర్యం కల్పించే విధంగా ప్రజా ఉద్యమ చేపట్టాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం సిపిఐ మండల సమితి సమావేశం యాస బుచ్చి రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మండల పరిధిలోని కాజవే వంతెనలను నిర్మించాలని, మండలంలోని రహీంఖానపేట గ్రామం వద్ద బస్సులను ఆపాలని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్స్ సౌకర్యం కల్పించే విధంగా ప్రజా ఉద్యమ చేపట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, ఉప్పల ముత్యాలు, మారుపాక వెంకటేష్, ఎండి నహీమ్, బత్తిని నరేష్, నాయకులు పాశీకంటి లక్ష్మి నర్సయ్య, జల్లి రాములు, జక్కా దయాకర్‌రెడ్డి, గుర్రం రాజమణి, కూరెల్ల మచ్చగిరి, సోలిపురం లింగారెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, మారుపాక అంజయ్య, కల్వల నర్సయ్య, కాసరబోయిన సత్తయ్య, మజ్జిగ నరసింహ, సోమన్నబోయిన నరసింహ, సూదగాని పృథ్వీరాజ్, దుర్గపతి నరసింహ, తాళ్లపల్లి నరసింహ రైతు సంఘం నాయకులు కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, భాష బోయిన జన్నయ్య, అంబోజు రాములు, భాష బోయిన సర్వయ్య పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని అరికట్టాలి

**ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ అక్రమ్ మాలిక్**



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి మహమ్మద్ అక్రమ్ మాలిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. 20 నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచి విద్యార్థులు, తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. పాఠశాలలు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు, షూలు, టైలు, బెల్టులు తదితర వస్తువులను బలవంతంగా విక్రయిస్తూ అధిక మొత్తాలను వసూలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికయిన నిబంధనలను పట్టించుకోకుండా విద్యను వ్యాపారంగా మార్చి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని మహమ్మద్ అక్రమ్ మాలిక్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రాకేష్, మహేష్, వినోద్, సాయి, గని పాల్గొన్నారు.

### యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

# కల్పించడంలో పాలకులు విఫలం

**ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి**




**ప్రజాపక్షం/హనుమకొండ :** యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలమైయ్యారని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి ఆరోపించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం హనుమకొండ జిల్లా సమావేశం గిన్నారపు రోహిత్ అధ్యక్షతన జరగగా సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలను అంధకారంలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులకు తగిన బడ్జెట్ కేటాయించి వాటిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి పౌరునికి అందుబాటులో ఉండే ప్రజా వైద్య సేవలను ప్రభుత్వం హామీ ఇవ్వాలని సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కోరారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నార్లాపురం రాజు, జిల్లా కార్యదర్శిగా గిన్నారపు రోహిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుగులోత్ సురేష్, ఉపాధ్యక్షులుగా కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, సహాయ కార్యదర్శిగా షేక్ హాజీ, కోశాధికారిగా ఈదునూరి కళ్యాణినితో పాటు జిల్లా కమిటీ సభ్యులను 21 మందిని ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎన్ఎ.స్టాలిన్, మాస్కొ సుదీర్, గుగులోత్ సురేష్, కేతపాక ప్రసాద్, షేక్ హాజీ, తాటికొండ ప్రశాంత్, పూజారి నరేందర్, పెనుకుల మధు, రెసోజు రాజు, శ్రీనివాస్, కొత్తపల్లి శ్రీకాంత్, ఈదునూరి కళ్యాణి, మనుకొండ శిరీష, ఈర్ల లావణ్య, కొండోజు అలౌకిక, బోగి రమా, కవిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్'పై అప్రమత్తంగా ఉండాలి

ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలి

టిపిసిసి జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని, ఓటర్ల జాబితా నుంచి ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో సిఎం మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అనుమానాస్పద ఓట్ల పేరుతో భారీ స్థాయిలో ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. 2028 ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా 2026 అక్టోబర్ నాటికే ఖరారవుతుందని, ఇప్పుడే అప్రమత్తంగా లేకపోతే తర్వాత చేసేదేమీ ఉండదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో బీఎల్‌వోలతో ముఖ్య నాయకులు సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. ఉపాధి, ఇతర అవసరాల కోసం వలస వెళ్లిన ఓటర్లు ఇంట్లో లేకపోవడం వల్ల వారి ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈనెల 20వ తేదీలోపు జిల్లా ఇన్‌చార్జి మంత్రులు సంబంధిత పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జిలతో సమీక్షలు నిర్వహించాలని సిఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత ఇన్‌చార్జిలకు సమాచారం అందించాలని సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థాయిలో ప్రత్యేక మానిటరింగ్ బృందాలు ఏర్పాటు చేయాలని, గాంధీభవన్‌లో వార్ రూమ్ ఏర్పాటు చేసి బూత్ స్థాయి వరకు ప్రతిరోజూ నివేదికలు సేకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ సర్ విషయంలో దేశంలో జరిగిన పరిణామాలు మనం గమనించాలి.. బిజెపి, ఎన్నికల కమిషన్ ఓట్ చోరీనే పనిగా పెట్టుకుందన్నారు. పాత ఓటర్ లిస్ట్‌కు ఇప్పటి ఓటర్ లిస్ట్‌కు చిన్న చిన్న పొరపాట్లు ఉన్నా ఓట్ తొలగిస్తారన్నారు. ఓట్‌ను నిలబెట్టడానికి అవసరమైన అన్ని పత్రాలు సిద్ధం చెస్కోని సిద్దంగా ఉండాలి, అందుకోసం ప్రతి కార్యకర్త అవగాహన పెంచుకొని ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ అత్యంత కీలకమైందని, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ మ్యాపింగ్, డౌట్ ఓట్ల పరిశీలన వంటి అంశాలను నిశితంగా గమనించాలని చెప్పారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగించే ప్రమాదం ఉందని ఆరోపించిన ఆయన, కృత్రిమ మేధ ఆధారంగా సోషల్ మీడియా విశ్లేషణల ద్వారా కూడా మద్దతుదారుల ఓట్లను గుర్తించి తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, పార్లమెంట్ ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా తుది రూపు దాల్చే వరకు పూర్తి స్థాయిలో నిఘా కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు.

## రుచుల రాజధానిగా

# హైదరాబాద్‌కు జాతీయ గౌరవం

ఇండియా టుడే టూరిజం అవార్డ్స్‌లో 'నేషనల్ కలినరీ డెస్టినేషన్' అవార్డు

-అవార్డు స్వీకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాదీ బిర్యానీ నుంచి తెలంగాణ సంప్రదాయ వంటకాల వరకు దేశ విదేశాల ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్న హైదరాబాద్ నగరానికి మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. దేశంలోని ఉత్తమ ఆహార పర్యాటక గమ్యస్థానంగా హైదరాబాద్ ఎంపికై, ఇండియా టుడే టూరిజం అవార్డ్స్ 2026లో 'నేషనల్ కలినరీ డెస్టినేషన్' అవార్డును కైవసం చేసుకుంది. గోవాలో సోమవారం నిర్వహించిన ఇండియా టుడే టూరిజం సదస్సులో ఈ అవార్డును కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఇండియా టుడే గ్రూప్ చైర్మన్ అరుణ్ పూరీ, ఎడిటోరియల్ డైరెక్టర్ రాజ్ చెంగప్పతో పాటు వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. అవార్డు స్వీకరణ అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, హైదరాబాద్‌కు లభించిన ఈ గుర్తింపు నగర ఆహార వారసత్వానికి, తెలంగాణ పర్యాటక రంగం సాధిస్తున్న పురోగతికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరు గాంచిన హైదరాబాదీ బిర్యానీ, ఇరానీ చాయ్, తెలంగాణ సాంప్రదాయ వంటకాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ, ఆధ్యాత్మిక, ఎకో, అడ్వెంచర్ పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన చెప్పారు. పర్యాటక మౌలిక సదుపాయాల విస్తరణ, మెరుగైన అనుసంధానం, సందర్శకులకు నాణ్యమైన అనుభవాల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈ అవార్డుతో హైదరాబాద్ ప్రపంచ ఆహార నగరాల జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరుచుకుందని, తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమిస్తుందని మంత్రి పేర్కొన్నారు.భారతదేశంలో పర్యాటక అభివృద్ధి, గమ్యస్థానాల ప్రచారం, సందర్శకుల అనుభవాల మెరుగుదలకు విశేష కృషి చేసిన రాష్ట్రాలు, సంస్థలు, పర్యాటక రంగ భాగస్వాములను ప్రతి ఏడాది ఇండియా టుడే టూరిజం అవారడ్స్ ద్వారా సత్కరిస్తారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి కూడా పాల్గొన్నారు.

## తెలంగాణ వారినే జడ్జీలు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను రాష్ట్రానికి చెందిన అర్హులైన న్యాయవాదులు, న్యాయాధికారులతోనే భర్తీ చేయాలని తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. న్యాయమూర్తుల నియామకాలలో తెలంగాణ మూలాలున్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సామాజిక న్యాయ సూత్రాలకు అనుగుణంగా అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ సోమవారం అసాధారణ సర్వసభ్య సమావేశంలో తీర్మానం ఆమోదించింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయమూర్తుల నియామకాల కోసం కొలీజియం పరిశీలిస్తున్న ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న మధ్యాహ్నం 1.45 గంటలకు హైకోర్టు ప్రాంగణంలో నిరసన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి కె. నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటన జారీ చేశారు.

## జివికె గౌతమి పవర్ పిటిషన్ డిస్మిస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) ప్రకారం ఆదాయపు పన్ను శాఖకు చెల్లించిన రూ.24.39 కోట్ల మినిమమ్ ఆల్టర్నేట్ ట్యాక్స్ (ఎంఏటీ)ను వడ్డీతో సహా తిరిగి చెల్లించేలా ఏపీ ట్రాన్స్‌కోను ఆదేశించాలని కోరుతూ జీవీకే గౌతమి పవర్ లిమిటెడ్ (ప్రస్తుతం ఆర్‌ఎస్‌పీఎల్) దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. పిటిషన్‌ను విచారణార్హం కాదని పేర్కొంటూ రూ.లక్ష జరిమానా విధించింది. అంతేకాకుండా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌సి)ల ద్వారా ఉత్పత్తి సామర్థ్యానికి మించి తీసుకున్నట్లు ఆరోపణలున్న రూ.1109 కోట్ల బకాయిల వసూళ్ల విషయంలో విద్యుత్ సంస్థల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై దర్యాప్తు చేపట్టాలని ఏపీ, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీలను ఆదేశించింది. పీపీఏ నిబంధనల ప్రకారం చెల్లించిన ఎంఏటీ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని కోరుతూ జీవీకే గౌతమి పవర్ 2016లో హైకోర్టును ఆశ్రయించింది. అనంతరం దివాలా పరిష్కార ప్రక్రియలో కంపెనీని ఆర్‌ఎస్‌పీఎల్ స్వాధీనం చేసుకోవడంతో, పిటిషన్‌లో జీవీకే గౌతమి పవర్ స్థానంలో ఆర్‌ఎస్‌పిఎల్ పేరును నమోదు అయ్యింది. పన్ను చెల్లించాలన్న పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక చెప్పిన తీర్పులో ఎపిఇఆర్‌సి ఉత్తర్వుల అమలుకు చట్టపరమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో రిట్ పిటిషన్ దాఖలు చేయడం సరికాదన్నారు. ఎపికి చెందిన కేసును తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పిటిషన్‌ను రూ.లక్ష జరిమానాతో కొట్టివేశారు. జీవీకే పవర్ దివాలా ప్రక్రియ ప్రారంభమైన తరువాత కూడా రూ.1109 కోట్ల బకాయిల వసూళ్ల కోసం రెజల్యూషన్ ప్రొఫెషనల్ ఎదుట క్లెయిమ్ దాఖలు చేయని అధికారుల పాత్రపై అనుమానాలు ఉన్నందున దీనిపై విచారణ చేపట్టాలని ఏపీ, తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీలను ఆదేశిస్తూ తీర్పు చెప్పారు

## నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపు ఆదేశాలివ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం గుబ్బడిలోని తమ 4.30 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చడాన్ని సవాలు చేస్తూ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, ఆయన సోదరుడు అశోక్‌కుమార్ షావిలి హైకోర్టును ఆశ్రయించారు. తమ భూమిని నిషేధిత జాబితాలో చేర్చుతూ జిల్లా కలెక్టర్ గత ఏడాది నవంబరు 6న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. 1980లో అసలు పట్టాదారుల నుంచి ఈ భూమిని కొనుగోలు చేశామని, అప్పటి నుంచి తమ స్వాధీనంలోనే ఉందని పిటిషనర్లు తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో విక్రయదారుల పూర్వీకుల పేర్లు నమోదై ఉన్నప్పటికీ, ఎలాంటి ఆధారాలు లేకుండా రికార్డులకు విరుద్ధంగా నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఈ అంశం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధికి చెందినదని పేర్కొంటూ సంబంధిత న్యాయమూర్తి ముందుకు మంగళవారం విచారణకు ఉంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

# ప్రజాభవన్‌లో ఘనంగా డిప్యూటీ సిఎం జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, సిఎం, మంత్రులు, ప్రముఖులు

ఆరు గ్యారంటీల థీమ్‌తో 120 కేజీల భారీ కేక్ కట్టింగ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలు సోమవారం ప్రజాభవన్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. నిత్యం ప్రజాసేవలో నిగమన్నమవుతూ, రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న డిప్యూటీ సిఎంకు భగవంతుడు ఆయు, ఆరోగ్య, ఐశ్వర్యాలను ప్రసాదించాలంటూ ప్రముఖులు ఆకాంక్షించారు.

**ప్రముఖుల శుభాకాంక్షల వెల్లువ..** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమాల ద్వారా డిప్యూటీ సిఎంకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉదయం నుంచే ప్రజాభవన్‌కు మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలు, అధికారులు భారీగా తరలివచ్చారు. భట్టి విక్రమార్కను కలిసి బొకేలు, శాలువాలతో సత్కరించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సిడబ్ల్యుసి సభ్యులు రుద్రరాజు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, వేముల వీరేశం, శాసనసభ్యులు వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బిఎల్ఆర్, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు అన్వేష్ రెడ్డి, నరసింహారెడ్డి, పోదెం వీరయ్య, నాయుడు సత్యం, బండ్లు శోభారాణి, రాయల నాగేశ్వరరావు, శివసేనా రెడ్డి, చరణ్ కౌశిక్, సరిత తిరుపతయ్య, బిసి కమిషన్ మెంబర్ రాపోలు జయప్రకాష్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ స్నిగ్ధ పట్నాయక్, సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్‌కో సిఎండి హరీష్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న ఆరు గ్యారంటీల కేక్..** ఉప ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని మధిర నియోజకవర్గం బోనకల్ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు కొమ్మినేని రమేష్ బాబు ప్రత్యేకంగా 120 కేజీల భారీ కేకును తయారు చేయించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరు గ్యారంటీలు', ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భట్టి విక్రమార్క చేపట్టిన చారిత్రాత్మక 'పీపుల్స్ మార్చ్ పాదయాత్ర' చిత్రాలతో ఈ కేకును అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం అందరినీ ఆకట్టుకుంది. ప్రజాభవన్‌లో భట్టి ఈ కేక్‌ను కట్ చేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రారంభం

మీ వివరాలను సరిచూసుకోండి !

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టామని భారత ఎన్నికల సంఘం తెలిపింది. వలసలు, ద్వంద్వ నమోదు, మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం వంటి సమస్యలను పరిష్కరించి, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ఈనెల 25 నుండి ప్రారంభమై, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ముగుస్తుంది.

**సవరణ ప్రక్రియ ముఖ్యమైన తేదీలు..**

జూన్ 25 నుండి జూలై 24 వరకు : బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాల గణన చేపడతారు.

**ఈనెల 31 :** ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటర్ల జాబితా ప్రచురణ. వచ్చేనెల 31 నుండి ఆగస్టు 30 : క్లెయిమ్లు, అభ్యంతరాల దాఖలుకు అవకాశం.

**జూలై 31 నుండి సెప్టెంబర్ 28 :** నోటీసుల జారీ, విచారణ, ధృవీకరణ, క్లెయిమ్‌ల పరిష్కారం.

**అక్టోబర్ 01న :** తుది ఓటర్ల జాబితా విడుదల.

**ఇంటింటికీ 'ఎన్యూమరేషన్ ఫారమ్' పంపిణీ**

ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ప్రతి ఇంటిని కనీసం 3 సార్లు సందర్శిస్తారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లకు ముందే ముద్రించిన 'ఎన్యూమరేషన్ ఫారమ్'లను రెండు ప్రతులలో అందించి, వాటిని ఎలా పూరించాలో మార్గదర్శకత్వం చేస్తారు. ఓటర్లు వివరాలు పూరించిన తర్వాత, ఒక ప్రతిని బిఎల్‌ఓలు తీసుకుని, రెండో ప్రతిపై రశీదు ఇచ్చి ఓటరుకు అందజేస్తారు. ఒకవేళ ఓటరు ఇంట్లో అందుబాటులో లేకపోతే, కుటుంబంలోని ఎవరైనా వయోజన సభ్యుడు ఈ ఫారమ్‌ను పూరించి, సంతకం చేసి ఇవ్వవచ్చు. విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో ఉన్న కుటుంబ సభ్యుల వివరాలను కూడా ఇంట్లోని వయోజనులు పూర్తి చేసి సమర్పించవచ్చు. ఒకవేళ ఎన్యూమరేషన్ ఫారమ్ అందకపోతే, ఓటర్లు అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా బుక్ కాల్ విత్ బిఎల్‌ఓ సదుపాయం ద్వారా తమ బూత్ స్థాయి అధికారిని సంప్రదించవచ్చు. ఫారమ్‌లో ఆధార్ నెంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికం మాత్రమే. ఫొటో పాతదైనా, తప్పుగా ఉన్నా కొత్త ఫొటోను అక్కడ అంటించవచ్చు.

**ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించే సదుపాయం**

భౌతికంగా అందుబాటులో లేని వారు లేదా కుటుంబం మొత్తం ఊర్లో లేని వారు భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ https://voters.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లోనే ఎన్యూమరేషన్ ఫారమ్ పూర్తి చేయవచ్చు. ఓటర్ల జాబితాలోని పేరు, ఆధార్ కార్డులోని పేరు మ్యాచ్ అయిన వారు మొబైల్ నంబర్ లేదా ఈపిఐసి కార్డ్ నంబర్ ద్వారా లాగిన్ అయి, ఓటిపి ధృవీకరణ, ఇసైన్ ద్వారా ఫారమ్ను విజయవంతంగా అప్‌లోడ్ చేయవచ్చు.

**కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు**

కొత్త ఓటర్లు ఈ సంవత్సరం అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే వారు బిఎల్‌ఓ ఇచ్చే ఫారమ్6, డిక్లరేషన్ ఫారమ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కొత్త ప్రాంతాలకు మారిన వారు జూలై 31న ముసాయిదా జాబితా వచ్చిన తర్వాత ఫారమ్ 8 ద్వారా చిరునామా అప్డేట్ కోసం ఈఆర్‌ఓకి దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఫారమ్ తిరిగి ఇవ్వకపోతే పేరు తొలగింపు !**

ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారమ్‌లను జూలై 24 లోపు ఖచ్చితంగా బిఎల్‌ఓకి తిరిగి ఇవ్వాలి. ఎవరి ఫారమ్ అయితే తిరిగి రాదో, వారిని గైర్హాజరు, మరణించిన, వలస వెళ్ళిన వారిగా భావించి, స్థానికంగా విచారణ జరిపిన అనంతరం వారి పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుండి తొలగిస్తారు. గణన దశలో ఓటర్లు ఎలాంటి పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే, ముసాయిదా జాబితా తర్వాత ఏవైనా వ్యత్యాసాలు ఉండి నోటీసులు వస్తే, పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికేట్, ప్రభుత్వ గుర్తింపు కార్డులు లేదా విద్యార్హత పత్రాల వంటి మద్దతు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఏదైనా సహాయం లేదా ఫిర్యాదుల కొరకు ఓటర్లు టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 1950 ను సంప్రదించవచ్చు అని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

# హైడ్రాకు మరో 140 వాహనాలు

## విపత్తు స్పందన పరికరాల కొనుగోలుకు అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ (హైడ్రా) కోసం రెండో దశలో 140 వాహనాలు, విపత్తు స్పందన పరికరాల కొనుగోలుకు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మొదటి దశలో ప్రతిపాదిత వాహనాలు, పరికరాల్లో 50 శాతం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ దశలో మంజూరైన వాహనాలు, పరికరాలను నిబంధనల ప్రకారం కొనుగోలు చేసినట్లు హైడ్రా కమిషనర్ ప్రభుత్వానికి నివేదించారు. హైడ్రా పరిధి విస్తరణ, విపత్తు స్పందన దళాల (డిఆర్‌ఎఫ్) సంఖ్య పెరగడం, ఆస్తుల పరిరక్షణ మండలాల విస్తరణ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న వాహనాలు, పరికరాలు సరిపోవడం లేదని కమిషనర్ ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మిగిలిన 50 శాతం వాహనాలు, పరికరాల కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అనుమతించిన జాబితాలో 21 డిఆర్‌ఎఫ్ ట్రక్కులు, 2 ఇన్నోవా హైక్రాస్ వాహనాలు, ఒక ఇన్నోవా, 54 స్కార్పియో వాహనాలు, 2 ట్రూప్ క్యారియర్ వ్యాన్లు, 2 బస్సులు, 37 మోటార్ బైకులు, 21 డిఆర్‌ఎఫ్ పరికరాలు ఉన్నాయి. మొత్తం 140 వాహనాలు, పరికరాలను రెండో దశలో సమకూర్చనున్నారు. ఈ కొనుగోళ్లకు సంబంధించిన వ్యయాన్ని 2026–27 బడ్జెట్ అంచనాల నుంచి భరించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## 'మెట్రో' రెండవ దశను సాధించలేకనే సిఎం కుప్పిగంతులు : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రెండవ దశ ప్రాజెక్టును కేంద్రం నుంచి సాధించలేక, తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే సిఎం రేవంత్ రెడ్డి కుప్పిగంతులు వేస్తున్నారని, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ధ్వజమెత్తారు. యుపి, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే,హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని సిఎంను డిమాండ్ చేశారు. బిజెపితో రేవంత్‌రెడ్డికి ఉన్న లోపాయికారి ఒప్పందం వల్లనే ఎన్నిసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా ఆయనను పట్టించుకోవడం లేదని కెటిఆర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం సహకరించకపోయినప్పటికీ రుణాలను సాధించి మెట్రోను పరుగులు పెట్టించిన ఘనత కెసిఆర్‌దేనని అన్నారు. తనపై వేలాడుతున్న ఓటుకు నోటు కేసు వల్లనే కేంద్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించలేకపోతున్నారన్నారు.

## 'అమ్మకు అక్షరమాల'కు విశేష స్పందిన గ్రాండ్ సక్సెస్

పరీక్షలో '83.3 శాతం' మహిళలు ఉత్తీర్ణత

పదో తరగతి పరీక్షలకు అర్హత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్య సభ్యులకు అక్షరాస్యతను అందించాలనే సంకల్పంతో ప్రారంభించిన ''అమ్మకు అక్షరమాల''కు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన లభించింది. తాజాగా నిర్వహించిన పరీక్షల్లో హాజరైన మహిళల్లో 83.3 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది మహిళలకు అక్షరాస్యత బోధన అందించగా, వారిలో 6 లక్షల 12 వేల మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 5 లక్షల 10 వేల మందికి పైగా మహిళలు ఉత్తీర్ణత సాధించారు. దీంతో లక్షలాది మంది మహిళలు ఇకపై పదో తరగతి పరీక్షలు రాసేందుకు అర్హతను పొందారు. అమ్మకు అక్షరమాల అనే కార్యక్రమ విజయం కేవలం ప్రభుత్వానిదే కాదని, రాష్ట్ర మహిళల సంకల్పం, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ ,విద్యను అభ్యసించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మహిళలను మంత్రి అభినంధించారు.

# చిన్నారులు పాఠశాలలో ఉండాలి.. పనిలో కాదు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజమంతా భాగస్వామ్యం కావాలి: మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ప్రతి చిన్నారి పాఠశాలలో ఉండాలి.. పనిలో కాదు' అనే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను సామాజిక ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే చిన్నారుల భవిష్యత్తు మారుతుందని, అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం 2026 సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని, ప్రసంగిస్తూ పేదరికం, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక మంది చిన్నారులు పనుల్లోకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి, అలాంటి పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్చడం ద్వారా వారి భవిష్యత్తును తీర్చిదిద్దవచ్చని తెలిపారు. చిన్నారుల బాల్యాన్ని కాపాడటం, వారికి నాణ్యమైన విద్యను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగా విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని గుర్తు చేశారు. గతంలో బాల కార్మికులుగా ఉన్న పలువురు ప్రస్తుతం మంచి ఉద్యోగాల్లో స్థిరపడటం విద్య శక్తికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, మంచి భవిష్యత్తు కల్పించేందుకు అందరూ భాగస్వాములు కావాలని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

# మంచిరేవులలో సర్వీస్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ

సామాజిక ప్రభావ అంచనా నుంచి మినహాయింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఇరువైపులా సర్వీస్ రోడ్డు కోసం మేజర్ బ్రిడ్జ్ నిర్మాణం, అలాగే ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 18ఎ ఇంటర్‌ఛేంజ్ నుండి మూసీ నది వెంబడి నార్సింగి రింగ్ వరకు కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటు ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా, గండిపేట్ మండలం, మంచిరేవుల గ్రామంలోని సర్వే నెంబర్లు 476, 508 లలో గల 2 ఎకరాల 19.50 గుంటల భూసేకరణ ప్రతిపాదనకు 'భూసేకరణలో పారదర్శకత, సరైన పరిహారం, పునరావాస చట్టం 2013' (తెలంగాణ సవరణ చట్టం 2016) లోని చాప్టర్–2,3 నిబంధనల (సామాజిక ప్రభావ అంచనా ఎస్ఐఎ) నుండి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. మేరకు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ జి.ఓ నెంబర్ 165 ద్వారా ఉత్తర్వులు విడుదల చేశారు.

**గ్రామం పేరు తప్పుగా పడటంతో సవరణ :** గతంలో ఏప్రిల్ 15 జారీ చేసిన జి.ఓ నెంబర్ 120 ప్రకారం, ఈ భూసేకరణ నార్సింగి గ్రామంలో ఉన్నట్లు పేర్కొంటూ సామాజిక ప్రభావ అంచనా నుండి మినహాయింపు ఇచ్చారు. అయితే, సర్వే సబ్‌డివిజనల్ రికార్డులను పరిశీలించగా, నార్సింగి గ్రామానికి బదులుగా మంచిరేవుల గ్రామం అని ఉండాల్సిందని, సర్వే నెంబర్లు తప్పుగా నమోదయ్యాయని హెచ్ఎండిఏ కమిషనర్ ప్రభుత్వానికి నివేదించారు. భూమి విస్తీర్ణం (2 ఎకరాల 19.50 గుంటలు)లో ఎలాంటి మార్పు లేనందున, సరైన గ్రామ వివరాలతో సవరించిన ప్రతిపాదనలను సమర్పించి, మినహాయింపు ఇవ్వాలని కోరారు.

**పాత జీవో రద్దు.. కొత్త నోటిఫికేషన్‌కు ఆదేశం :** హెచ్ఎండిఎ విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం, ప్రజోపయోగ ప్రాజెక్టుల అమలుకు భూసేకరణ అత్యంత కీలకమైనందున, పాత జి.ఓ నెంబర్ 120ని రద్దు చేసింది. సవరించిన వివరాల ప్రకారం మంచిరేవుల గ్రామంలోని భూసేకరణకు చాప్టర్ 2, 3 నిబంధనల నుండి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన కనీస భూమిని మాత్రమే సేకరిస్తున్నట్లు ప్రభుత్వం ధృవీకరించింది. ఈ మేరకు తెలంగాణ అధికారిక గెజెట్ అసాధారణ సంచికలో నోటిఫికేషన్‌ను ప్రచురించాల్సిందిగా స్టేషనరీ అండ్ ప్రింటింగ్ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి చర్యలు చేపట్టాల్సిందిగా హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌కు ప్రభుత్వం స్పష్టం చేసింది.



## ఇంకా ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయ్

వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేశారు. అందులో ఎన్ని ఇండ్లు పూర్తి అయ్యాయి, ఇంకా ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇంకా నిర్మాణాలు ప్రారంభించనివి ఎన్ని ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారి ఇంటికి వెళ్లి ఇండ్ల ని పరిశీలించారు. గతంలో ఏ ఇంట్లో ఉండే అని అడిగారు.ఆగవ్వ ఇంటిని పరిశీలించి ఇళ్ళు నిర్మించుకున్నావ్ కదా ఎలా అనిపిస్తుంది ఇప్పుడు అని అడిగారు. సంతోషం గా ఉందని ఎన్నో సంవత్సరాల కల ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెరవేరినందుకు చాలా సంతోషం గా ఉంది అనిఆగవ్వ తెలిపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏపీఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరి ఓటు కాపాడాలి

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/అర్వపల్లి** : అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సర్ ఓటర్ జాబితా సమయ ప్రక్రియ జూన్ 25 నుండి ప్రారంభం కానున్నదని అందుకు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొని ప్రతి ఒక్కరి ఓటును కోల్పోకుండా చూడాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 365 ఆర్టికల్ ద్వారా ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఆయుధం అన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సమస్యలను ముఖ్యమంత్రి ఏనాడూ పట్టించుకోలేదని కనీసం అధికారులతో ఏ ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించాలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, కంచర్ల రామకృష్ణారెడ్డి, గుజ్జ దీపిక, వై వెంకటేశ్వర్లు, రజాక్, ధర్మేందర్ రెడ్డి, సంకేపల్లి రఘునందన్ రెడ్డి, మొరిశెట్టి ఉపేందర్, దావుల వీరప్రసాద్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 49, ఉపాధి కల్పన 4, సర్వే ల్యాండ్ 4, హౌసింగ్ 4, జిల్లా పరిషత్ 4, విద్య శాఖ 2, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ 2, సంక్షేమ శాఖ, సివిల్ సప్లై, అటవీ, ఎస్సీ వెల్ఫేర్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

**ప్రజాపక్షం/సూర్యాపేట** : పంచాయతీ కార్యదర్శుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడిన జిల్లా పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్.కె. మెయినోద్దీన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో గరిడేపల్లి మండలంలో సీనియర్ అసిస్టెంటుగా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన తన పరిధిలోని పలువురు పంచాయితీ కార్యదర్శుల నుండి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు మెయినోద్దీన్ చేసిన వసూళ్లపై విచారణ చేపట్టగా విచారణలో పంచాయితీ కార్యదర్శుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమయ్యాయి. విచారణ నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడట్లు తేలడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## కామ్రేడ్ రామశర్మ ఆశయ సాధన కోసం పోరాటాలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** బొడ్డుపల్లి రామశర్మ ఆశయ సాధన కోసం పోరాటాలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో రామశర్మ 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ బొడ్డుపల్లి రామశర్మ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దేవరకొండ ప్రాంత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతల్లో ఒకరని రెండు పర్యాయాలు ఎంఎల్ఏగా గెలిచి కమ్యూనిస్టు పార్టీ నల్గొండ జిల్లా పార్టీ కార్యదర్శిగా, దేవరకొండ ప్రాంతాల్లో ముఖ్యంగా సాగునీటి కోసం తాగు నీటి కోసం అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, మండల పార్టీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, రంగారెడ్డి, నేరేడుగొమ్ము మండల కన్వీనర్ రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు వెంకటరాములు, మల్లయ్య, గోవర్ధన్, వెంకటయ్య, బాలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

ఎఐసిసి అబ్జర్వర్ సచిన్ సావత్, డిసిసి అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై శిక్షణ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గం బిఎల్ఏలకు టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎఐసిసి అబ్జర్వర్ సచిన్ సావత్, డిసిసి అధ్యక్షులు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభం, ప్రతి అర్హత కలిగిన ఓటరుగా నమోదు కావడం, వివరాలు సరైనవిగా ఉండేలా చూసుకోవడం అర్హులైన ఓట్లు పోకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా అవసరం అన్నారు. అందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. బిజెపి ప్రభుత్వం సర్ పేరుతో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే ముస్లిం మైనార్టీ ఇతర ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందని బిఎల్ఏలు దానికి సంసిద్ధంగా ఉండి ఓట్లు గల్లంతవ్వకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఏల పై ఉందని సూచించారు. భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గం బిఎల్ఏలకు టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎఐసిసి అబ్జర్వర్ సచిన్ సావత్, డిసిసి అధ్యక్షులు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో ఆహార భద్రతపై తనిఖీలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : జిల్లా వ్యాప్తంగా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆహార భద్రతపై జిల్లా స్థాయి సలహా కమిటి (డిఎల్ఏసి) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆహార భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు. వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందేలా పాలు, పాల ఉత్పత్తుల విక్రయదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిత్యవసర పాలు, నూనెలు, మాంసం, గుడ్లు, స్వీట్లు, సిద్ధం చేసిన ఆహార పదార్థాలపై నిఘా పెంచి, నమూనాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. 65వ జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు, దాబాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీల్లో, శిక్షణ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వారికి, చిన్న పిల్లలకు ఆహారం అందించే అంగన్‌వాడీ కార్యకర్తలకు దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు సైతం ఆహార భద్రతపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో ఆహార వస్తువుల నిల్వ, భద్రతకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమాజానికి హానికరమైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, రవాణా, అమ్మకాలపై ఆహార భద్రత, పోలీస్, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ఆదేశించారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం జిల్లాలోని చిన్న, పెద్ద ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు తప్పనిసరిగా ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని పునరుద్ఘాటించారు. వినియోగదారుల్లో చైతన్యం తేవడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కల్తీ ఆహారంపై ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్య పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కల్తీ ఆహారం లేదా నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే గూగుల్ ప్లే స్టోర్‌లోని ఫుడ్ సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా గానీ, లేదా జిల్లా ఆహార భద్రతా కార్యాలయం 9133291926, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం 08684222666, రాష్ట్ర ఆహార భద్రతా హెల్ప్‌లైన్ 9100105795, 04021111111 హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, అడిషనల్ ఎస్పి రవీందర్ రెడ్డి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్‌బాబు, డిఎంహెచ్ఓ వెంకటరమణ, డిటిడిఓ శంకర్, ఎస్‌సి డిడి దయానందరాణిపాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తం : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : అనధికారిక, సర్టిఫైడ్ లేని, ప్యాకింగ్ లేని విత్తనాలను కొనకుండా నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ రైతులను కోరారు. గ్రామాలలోకి వచ్చి దళారుల వద్ద విడి విత్తనాలు కొనవద్దు అన్నారు. ఇవి వాడటం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉండడంతోపాటు రైతులు పడే శ్రమ అంతా వృధా అవుతుందని పేర్కొన్నారు. విత్తనాలను కేవలం ప్రభుత్వం సూచించిన అధీకృత విత్తన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని, విత్తనాలు కొన్నప్పుడు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోతే, విత్తనాలు అమ్మిన వ్యాపారస్తులను ప్రశ్నించడానికి, వ్యవసాయాధికారులను ఆశ్రయించడానికి ఈ రశీదు కీలకం అన్నారు. నాణ్యతలేని, శుద్ధి చేయని నకిలీ విత్తనాలు అమ్మవద్దని అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలను విక్రయించే దళారులు, వ్యాపారులపై విత్తనాల చట్టం బి.ఎన్.ఎస్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడంతోపాటు ఆర్గనైజ్డ్ క్రైమ్ కింద కేసులు నమోదు చేసి, వారిని జైలుకు పంపడం జరుగుతుందన్నారు. ఏదైనా సమస్య తలెత్తినా, నకిలీ విత్తనాలపై సమాచారం ఉన్నా వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలని లేదా పోలీసులకు డయల్ 100, 112, సూర్యాపేట జిల్లా కంట్రోల్ రూమ్ 8712686026కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**ఫిర్యాదులపై స్పందించి బాధితులకు బరోసా కల్పించాలి**

పోలీసు అధికారులు ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# ఎఫ్ఎల్ఎన్‌లో నల్లగొండ జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు

విద్యార్థులకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ఎఫ్ఎల్ఎన్‌లో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం బొట్టుగూడలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, మర్రిగూడెం పాఠశాలను సందర్శించి తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని చెప్పారు.విద్యార్థులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) సామర్థ్యాలు పెంచాల్సిన అవసరం ఉందని,ఇందులో భాగంగా ఉపాధ్యాయులకు అక్టోబర్, నవంబర్‌లో పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి విద్యార్థికి మాతృభాషతో పాటు హిందీ,ఇంగ్లీష్ తప్పనిసరిగా చదవడం, రాయడం, మాట్లాడడం వచ్చి ఉండాలన్నారు.జిల్లాలో మూతపడిన కొన్ని ప్రాథమిక పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని సర్పంచ్‌లు కోరుతున్నారని, వాటిని కూడా ప్రారంభిస్తామని చెప్పారు.పాఠశాలలు,హాస్టళ్లలో చిన్నచిన్న మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖ అధికారి పి.సుశీందర్ రావు,కార్పొరేటర్లు శంకరయ్య,మోహన్ రెడ్డి,పాఠశాల యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో గోడు విన్నా..

# సమస్యలకు పరిష్కారం ఎక్కడ?

ఫిర్యాదులకు స్పందన కరువు..కలెక్టరేట్ చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

**ప్రజాపక్షం/నల్లగొండ**: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం బాధితులకు ఆశలు కల్పిస్తున్నప్పటికీ,అనేక ఫిర్యాదులకు పరిష్కారం దొరకడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని తమ గోడును వినిపిస్తున్న బాధితులు నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాధితులు బస్సు ఛార్జీలు,జిరాక్స్ పత్రాల ఖర్చులు భరిస్తూ పలుమార్లు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వినతిపత్రాలు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపిస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో చర్యలు లేకపోవడంతో సమస్యలు పెండింగ్‌లోనే ఉంటున్నాయని చెబుతున్నారు.సోమవారం జరిగిన ప్రజావాణిలో చింతచెట్టు తండా నిర్వాసితుల సమస్య, చలకుర్తి ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్ అంశం, వీర్లపాలెం భూ బాధితుల నష్టపరిహారంఉద్యోగాల డిమాండ్ వంటి పలు సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.అయితే గతంలో కూడా ఇలాంటి వినతులు సమర్పించినప్పటికీ పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదని బాధితులు పేర్కొన్నారు.ప్రజావాణి కేవలం వినతిపత్రాల స్వీకరణకే పరిమితం కాకుండా,ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు. సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపితేనే ప్రజావాణి కార్యక్రమం తన లక్ష్యాన్ని నెరవేర్చినట్లవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.కొండమల్లేపల్లి మండలం చింతచెట్టు తండా గ్రామస్థులు పెండ్లిపాకల రిజర్వాయర్ విస్తరణ కారణంగా గ్రామంలోని అన్ని ఇళ్లను ఆర్ అండ్ఆర్ ప్యాకేజీలో చేర్చి సురక్షిత పునరావాసం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. గతంలో కూడా నిర్వాసితులుగా మారిన తమ కుటుంబాలు మరోసారి అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

చలకుర్తి గ్రామానికి చెందిన ఎం. రాజావర్ధన్‌రెడ్డి ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అదే విధంగా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ టౌన్‌షిప్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు తమకు నష్టపరిహారం చెల్లించడంతో పాటు పవర్ ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజావాణిలో సమస్యలు వినిపిస్తున్నప్పటికీ పరిష్కార ప్రక్రియ ఆలస్యం కావడంతో బాధితులు పలుమార్లు కలెక్టరేట్‌కు రావాల్సి వస్తోందని, దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఫిర్యాదులపై వేగంగా స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.





## ఫీజుల దోపిడీని అరికట్టాలి

డిఇఒకు ఎఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ వినతిపత్రం

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో డీఈవో బిక్షపతికి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అక్రమంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజులు నియంత్రణ చట్టం అమలు చేయాలని, అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని అన్నారు. మార్కెట్ రేట్ కంటే ఎక్కువ పెట్టి అమ్ముతున్నారని విద్యార్థుల తల్లితండ్రులు పిల్లల చదువు కోసం తమ రెక్కలు ముక్కలు చేసుకొని కష్ట పడుతుంటే వారి శ్రమను ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల రూపంలో, యూనిఫామ్ రూపంలో, పాఠ్య పుస్తకాల రూపంలో దోచుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు విక్రయిస్తే సహించేది లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని, విద్యార్థుల కోసం మూత్ర శాలాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సాయికుమార్, గోగు వరలక్ష్మి , చిప్పలపల్లి వంశీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్వర న్యాయానికి లోక్ అదాలత్‌లు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సత్వర న్యాయం అందించడానికి లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యాంసుందర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరిన్‌లు తెలిపారు. సోమవారం స్థానిక న్యాయవాదులతో, పోలీసు అధికారులతో విడివిడిగా ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సమీక్ష సమావేశాలలో వారు మాట్లాడుతూ పూర్వం రచ్చబండల వద్ద గ్రామ పెద్దలుచేసిన పంచాయతీ తీర్మాణాల రూపంలో చట్టబద్దత కలిగిన మధ్యవర్తిత్వం చట్టం రూపొందించబడినదని ఆ చట్టం ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు తమ వివాదమును పరిష్కరించుకున్నట్లయితే దానికి చట్టబద్దత లభిస్తుందన్నారు. జనాభా పెరుగుదల మూలంగా వ్యక్తుల మధ్య కక్షలు కార్పణ్యాలు ఏర్పడి వివాదాలు చెలరేగి కేసులు నమోదు అవుతున్నాయని, ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకునే వారిని చైతన్య పర్చాలని న్యాయవాదులను కోరారు. కక్షిదారులు న్యాయస్థానాలకు వచ్చే అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే వారి వివాదాల పరిష్కారానికి గ్రామ న్యాయాలను ఏర్పాటు చేసే ప్రక్రియ న్యాయ వ్యవస్థ పరిశీనలో ఉన్నదని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు రమణారెడ్డి, కాల్వ శ్రీనివాసరావు, సుంకరి ప్రదీప్తి, శృతి, శమీనా, సైదాహుస్సేన్, రామలక్ష్మారెడ్డి, వెంకటేష్‌నాయక్, చందు, సతీష్, వీరు, మహేష్, బ్రహ్మాచారి, మీసాల అంజయ్య, నాగపాషా, హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు ఎస్ఐ లు నరేష్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ఎయిమ్స్ డైరెక్టర్ అమిత అగ్రవాల్



**ప్రజాపక్షం/బీబీనగర్** : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్ అమితా అగ్రవాల్ అన్నారు. సోమవారం ప్రపంచ రక్తదాన దినోత్సవ పురస్కరించుకొని ఎయిమ్స్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఆమె కోరారు. సంస్థ నుండి 93 మంది వాలంటీర్లను ఏర్పాటు చేసి రక్తదానం చేయాలని ప్రచారం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్.నితిన్, అశోక్ జెన్. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
మంగళవారం
16-06-2026
www.prajapaksham.in

“దుల్కర్ సల్మాన్ నటించిన తాజా చిత్రం ‘ఐ యామ్ గేమ్’. ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొత్త పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్ అత్యంత స్టైలిష్ అవతార్లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచారు.”

రీల్

# ఆగస్టు 20న ‘ఐ యామ్ గేమ్’ రిలీజ్



దుల్కర్ సల్మాన్ నటించిన తాజా చిత్రం ‘ఐ యామ్ గేమ్’. ఈ సినిమా నుంచి తాజాగా విడుదలైన పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొత్త పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్ అత్యంత స్టైలిష్ అవతార్లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 20న ఓనం పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.దుల్కర్ సల్మాన్ సొంత నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్, ఆయన కెరీర్లోనే అత్యంత భారీ చిత్రంగా రూపొందుతోంది. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన, స్క్రీన్‌ప్లే అందించారు.దక్షిణ భారతదేశంలోని వందకు పైగా లొకేషన్లలో చిత్రీకరించిన ‘ఐ యామ్ గేమ్’, ప్రస్తుతం మలయాళ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఇండస్ట్రీలోనే భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ తన కెరీర్‌లో ఇప్పటివరకు కనిపించని అత్యంత స్టైలిష్, మాస్ అవతార్లో కనిపించబోతున్నారు. మెగా బ్లాక్బస్టర్ ‘లోకా’ తర్వాత వేఫరర్ ఫిలిమ్స్ నుంచి రాబోతున్న మరో ప్రతిష్టాత్మక చిత్రం ఇదే. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ థ్రిలర్‌లో ఆంటోని వర్గీస్, మిస్కిన్, కాయడు లోహర్, కతిర్, పార్థ్ తివారి, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తుండగా, యాక్షన్ సన్నివేశాలను ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్స్ అన్బరివ్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జిమ్షి ఖలీద్,సంగీతం: జేక్స్ బిజోయ్,ఎడిటింగ్: చమన్ చాకో, లైన్ ప్రొడ్యూసర్: బిబిన్ పెరుంబిల్లి.

## జూన్ 26న ‘రిస్క్’ విడుదల




జి.కె మిరాకిల్స్ బ్యానర్‌పై ఘంటాడి కృష్ణ జూన్ 26న ‘రిస్క్’ విడుదలదర్శకత్వంలో, సందీప్ అశ్వ హీరోగా తెరకెక్కిన యూత్ఫుల్ సస్పెన్స్ థ్రిల్లర్ రిస్క్ ప్రపంచవ్యాప్తంగా జూన్ 26న థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్, పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి అంచనాలు పెంచాయి. ఈ చిత్రంలోని మెలోడీయస్ సాంగ్ దేవుడు వరమందిస్తే ను బ్లాక్బస్టర్ డైరెక్టర్ త్రినాథ్ రావు నక్కిన లాంచ్ చేశారు. ఇప్పటికే ఈ పాటతో పాటు సినిమాకు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు గంటాడి కృష్ణ, హీరో సందీప్ అశ్వ, నిర్మాతలు రవి సురేష్ రెడ్డి, గుర్రం నర్సిములు, కోప్రొడ్యూసర్ గడ్డం రవి కుమార్, కోడైరెక్టర్ బన్నీ కోయల్ కార్ పాల్గొన్నారు.ప్రేమ, స్నేహం, యూత్ ఎమోషన్స్, సస్పెన్స్ అంశాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జగదీష్ కొమరి.

## హార్ట్ టచ్చింగ్‌గా ‘సింగ్ గీతం’

గోల్డెన్ బ్లాక్ బస్టర్ ఈవెంట్‌లో డైరెక్టర్ అనిల్ రావిపూడి



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు రూపొందించిన తాజా చిత్రం ‘సింగ్ గీతం’. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బ్రమ్హ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లోనమై ఈ చిత్రం విడుదలై నడుస్తున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ సినిమా చూశాను. చాలా బాగుంది. చాలా వెరైటీగా ఉంది. చాలా హార్ట్ టచింగ్‌గా ఉంది. కానీ నాకు లోలోపల ఒక ఫీలింగ్ వచ్చింది. మనం ఒక సినిమా తీసి, చాలా కష్టపడి ట్రైలర్ కట్ చేసి రిలీజ్ చేస్తుంటాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమా రిలీజ్ చేసి హిట్ కొట్టాడు. నేనూ కూడా ట్రైలర్ లేకుండా అందంగా ప్రమోట్ చేసి సినిమా చేయాలని ఉంది. ఒక సినిమా రిలీజ్ అయి, మంచి టాక్ తెచ్చుకుని, సక్సెస్ ఈవెంట్ జరుగుతున్న సమయంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ చేయడం నిజంగా చాలా వింతగా, చాలా కొత్తగా ఉంది అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ఇది ఆయన 40 ఏళ్ల కల. అలాంటి కలలో మేము భాగం కావడం చాలా ఆనందంగా ఉంది.సింగీతం గారు దర్శకుడిగా ఉంటే,మంచి డబ్బులు, పేరు తీసుకొస్తాయి. బిగ్గెస్ట్ మ్యూజికల్ సాటిస్ఫాక్షన్ ఇచ్చిన సినిమా సింగ్ గీతం. ఈ సినిమాకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. మమ్మల్ని ఎంతో ఇన్‌స్పైర్ చేసిన సింగీతంకి థాంక్యూ. 94 ఏళ్ల వయసులో కూడా ఆయనలో ఉన్న ఫైర్కు మనందరం హ్యాట్సాఫ్ చెప్పాలి అని తెలిపారు. నిర్మాత నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. సావిత్రి గురించి రీసెర్చ్ చేస్తున్నప్పుడు తొలిసారి సింగీతంని కలిశాను. మాయాబజార్ సినిమాకు పనిచేసిన ఆయన, సావిత్రిని డైరెక్ట్ చేసిన దర్శకుడు, ఆదిత్య 369 తీసిన లెజెండరీ ఫిల్మ్‌మేకర్. అలాంటి ఆయనను ఒకసారి కలవడమే జీవితాంతం గుర్తుండిపోయే మెమరీ అనుకున్నాను. కానీ ఆ జర్నీ ఇంతదూరం వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఆయన కలకు తెరరూపం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది అని చెప్పారు. హీరోయిన్ అహల్య. హీరో అయాన్ , హీరోయిన్ శాలిని తదితరులు పాల్గొన్నారు.

## క్రైమ్ థ్రిల్లర్‌గా ‘ఇసకపట్నం’



భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఒటిటి వేదిక ప్రైమ్ వీడియో తన తాజా తెలుగు ఒరిజినల్ సిరీస్ ‘ఇసకపట్నం’ ట్రైలర్ హైదరాబాద్ లో ఘనంగా విడుదల చేసింది. గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించిన ఈ ఏడు ఎపిసోడ్ల క్రైమ్ థ్రిల్లర్ ను ప్రశాంత్ రఘుతి రచించగా, తాజుద్దీన్ సయ్యద్ మాటలు అందించారు. తమడా మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాహుల్ తమడా, సైదీప్ రెడ్డి బొర్రా నిర్మించిన ఈ సిరీస్ లో ఐశ్వర్య రాజేష్, సముద్రఖని ప్రధాన పాత్రలు పోషించారు. వీరితో పాటు సునీల్, నరేష్ అగస్త్య, మెరిన్ ఫిలిప్, సుధాకర్ కోమకుల, రాజీవ్ కనకాల, మైమ్ గోపీ, రోహిణి, బెనర్జీ, జ్వాల కోటి, రవి వర్మ, రాజా చెంబోలు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. జూలై 2 నుంచి ప్రైమ్ వీడియో లో తెలుగు భాషతో పాటు తమిళం, హిందీ డబ్బింగ్ వెర్షన్‌లు, 15 భాషల సబ్ టైటిల్స్ తో ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా ప్రాంతాలలో ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది.ఈ సందర్భంగా దర్శకుడు గ్యారీ బిహెచ్ మాట్లాడుతూ ఇసాకపట్నం ఒక కల్పిత ప్రపంచంలో సాగే కథ అయినప్పటికీ, ఇందులో పాత్రలు, వారి భావోద్వేగాలు చాలా నిజాయితీ గా ఉంటాయి. ఆశ, ప్రేమ, కోల్పోవడం, ప్రతీకారం వంటి అంశాలు ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతాయి. ప్రేక్షకులను చివరి వరకు ఉత్కంఠ లో ఉండే ఎన్నో ట్విస్టులు ఇందులో ఉన్నాయి అని తెలిపారు. సముద్రఖని మాట్లాడుతూ ఈ కథలోని బలమైన భావోద్వేగాలు, నా పాత్రలో ఉన్న వైవిధ్యాలు నన్ను ఆకట్టుకున్నాయి. ఆశ, ప్రతీకారం, అధికారం కోసం మనుషులు ఎంత దూరమైనా వెళ్తారనే విషయాన్ని ఈ కథ బలంగా చెబుతుంది. నా కెరీర్లో ఇప్పటివరకు చేయని భిన్నమైన పాత్ర ఇది అన్నారు. ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ పవర్, సంఘర్షణ తో నిండిన ప్రపంచంలో తనదైన నిర్ణయాలతో ముందుకు సాగే మహిళా భారతి కనిపిస్తుంది. ఆమె ధైర్యం, బలహీనత, ఆత్మవిశ్వాసం కలగలిపిన పాత్ర. ఈ పాత్రను పోషించడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభవం అని చెప్పారు. సునీల్ మాట్లాడుతూ ఇసకపట్నం ప్రపంచం చాలా వాస్తవంగా ఉంటుంది. ప్రతి పాత్రకు వారి సొంత లక్ష్యాలు, సంఘర్షణలు ఉంటాయి. నేను ఇప్పటివరకు చేయని కొత్త తరహా పాత్రలో కనిపించను అన్నారు. నరేష్ అగస్త్య మెరిన్ ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

## అనిరుధ్ తాజా సంచలనం ‘అరవింద్’ పాట



సంగీత సంచలనం..రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఆయన తన సొంత ఇండిపెండెంట్ లేబుల్ అల్బుకర్కీ రికార్డ్స్‌తో పాటు యూనివర్సల్ మ్యూజిక్ ఇండియాతో కలిసి చేసిన ‘అరవింద్’ పాటను రిలీజ్ చేశారు. ఈ కాంబోలో రిలీజైన తొలి పాట ఇది. తెలుగు, తమిళ భాషల్లో ఒరిజినల్ పాప్, హిప్ హాప్ ఆధారంగా రూపొందిన ఈ ట్రాక్తో అనిరుద్ తన సంగీత ప్రపంచంలోని పరిధిని దాటి కొత్త ఆధ్యాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిరుద్ మాట్లాడుతూ ‘అరవింద్’ అంటే ప్రతి ఒక్కరిలో ఉండే ఓ తరహా వ్యక్తిత్వమే. మన అందరి జీవితాల్లో ఓ అరవింద్ ఉంటాడు. అయితే తన ప్రతిభను చూపించడానికి ఒక్క అవకాశం కోసం ఎదురుచూస్తోన్న ఓ స్వతంత్ర కళాకారుడి కథను ఈ పాట చెబుతుంది. అలాగే నేటి డిజిటల్ ప్రపంచంలో ఉన్న విపరీతమైన పోటీలో పెద్ద స్థాయికి చేరుకునే సమయంలో ఒక ఇండిపెండెంట్ ఆర్టిస్ట్ ఎదుర్కొనే సవాళ్లను ఇది చూపిస్తుంది అన్నారు. అల్బుకర్కీ రికార్డ్స్ ద్వారా రాబోయే రోజుల్లో వివిధ రకాలైన ఇండిపెండెంట్ మ్యూజిక్ ప్రాజెక్ట్స్ , కాన్సెప్చువల్ ప్రాజెక్ట్సను డెవలప్ చేసి రిలీజ్ చేయటానికి అనిరుద్ సిద్ధమవుతున్నారు. ఇప్పుడు ఇండియాలోనే బిగ్గెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా అనిరుద్ మారిపోయారు.

## ‘భోగి’ కోసం యాక్షన్ క్లైమాక్స్ చిత్రీకరణ



శర్వానంద్ హీరోగా పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ చిత్రం ‘భోగి’. దర్శకుడు సంపత్ నందితో శర్వా చేస్తున్న మొదటి సినిమా ఇదే. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్నారు. పల్లెటూరి యువతిగా కథానాయిక అనుపమ పరమేశ్వరన్ కనిపించిన ఫస్ట్‌లుక్ కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో హై ఆక్టేవ్ ఎమోషనల్ యాక్షన్ క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. ఈ సన్నివేశాన్ని మునుపెన్నడూ చూడని స్టయిల్ లో రూపొందిస్తున్నారు. ఈ కీలకమైన క్లైమాక్స్ లో శర్వా రిస్కీ స్టంట్లతో తన నటనలో సరికొత్త కోణాన్ని ప్రజెంట్ చేయబోతున్నారు. సినిమాలోని ఈ కీలక భాగాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఈ షెడ్యూల్ 20 రోజుల పాటు కొనసాగనుంది.ఈ చిత్రంలో డింపుల్ హయతి మరో కథానాయికగా నటిస్తోంది. 1960ల నాటి నేపథ్యంలో సాగే ‘భోగి’ చిత్రం, తెలంగాణమహారాష్ట్ర సరిహద్దులోని ఒక ఫిక్షనల్ విలేజ్ లో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు.తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలో ఆగస్టు 28న ‘భోగి’, రక్షాబంధన్ పండుగ ఈ సినిమా విడుదల కానుంది.

# కౌలురైతు చట్టం అమలు చేయాలి

వెంటనే గుర్తింపు కార్డులివ్వాలి

పలువురు వ్యవసాయ నిపుణులు, కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్:రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని,గుర్తింపు కార్డులు ఇవ్వాలని,కౌలురైతు చట్టాన్ని అమలు చేయాలని పలువురు వ్యవసాయ నిపుణులు, కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలోని ‘కౌలు రైతులు’ ఎదుర్కొంటున్న సమస్యలపైన రాష్ట్ర వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాములు నాయక్, కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, భూమి సునీల్, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, స్పెషల్ ఆఫీసర్ కేశవులు, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు కన్నెగంటి రవి, కొండల్, కిరణ్, కౌలు రైతుల సాధన కమిటీ సభ్యులు, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు,కౌలు రైతులు, అధికారులు సంధ్యారాణి, హరి వెంకట ప్రసాద్, రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, పంట రుణాల లభ్యత, యూరియా సరఫరా, పంట విక్రయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కౌలు రైతు చట్టం2011’ను అమలు చేయాలని పలువురు వక్తలు సూచించారు.

**కౌలు రైతుల సమస్యలు సామాజిక,ఆర్థిక కోణాలతో ముడిపంది..:హరగోపాల్**

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్య సామాజిక,ఆర్థిక కోణాలతో ముడిపడిందన్నారు.భూమి ఇచ్చినప్పటికీ యాజమాన్య హక్కులకు ఎలాంటి భంగం కలగదనే నమ్మకాన్ని భూ యజమానుల్లో కల్పించే విధంగా చట్టపరమైన రక్షణ అవసరమని సూచించారు. కౌలు రైతులు బలహీన వర్గమని, ప్రభుత్వం వారికి అండగా నిలవాలని సూచించారు. ప్రొఫెసర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ కౌలు రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ తరహాలో బలమైన కౌలు చట్టాలు తెలంగాణలోనూ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.కన్నెగంటి రవి మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత కౌలు రైతుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. మహిళా రైతు చుక్కమ్మ మాట్లాడుతూ విత్తనాల కొనుగోలు నుంచి పంట కోత వరకు కౌలు రైతులు అప్పులపైనే ఆధారపడుతున్నారన్నారు.

**కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి: కోదండరెడ్డి**

ప్రతి కౌలు రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు కార్డులను జారీ చేసి, వాటిని ప్రతి 11 నెలలకు ఒకసారి పునరుద్ధరించే విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్టు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి తెలిపారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి రైతు కమిషన్ కట్టుబడి ఉందన్నారు. కౌలు రైతు చట్టం2011ను అమలు చేయాలని ఫిబ్రవరిలోనే ప్రభుత్వానికి లేఖ రాశామని గుర్తు చేశారు. యూరియా పొందడంలో ఇబ్బందులు, పంట రుణాల లభ్యత, పంట విక్రయంలో ఎదురవుతున్న అవరోధాలు, గుర్తింపు కార్డుల జారీ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. భూమి సునీల్ మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, భూ యజమానుల అంగీకారం లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. యూరియా పంపిణీ, పంట విక్రయాల్లో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించవచ్చన్నారు.

## కుట్రను అడ్డుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)




ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, మాజీ ఎంఎల్‌సి ప్రొఫెసర్ నాగేశ్వర్, మహేంద్ర యూనివర్సిటీ లా డీన్, కేంద్ర సమాచార కమిషన్ మాజీ సభ్యులు ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ముఖ్యవక్తలుగా హాజరవ్వ గా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, ఇ.టి.నరసింహ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఎం.బాలనర్సింహ, కలవేణ శంకర్,సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు. దేశ రాజకీయ పరిస్థితులు మార్చేందుకే ‘సర్’ను ప్రవేశపెట్టారని పరకాల ప్రభాకర్ విమర్శించారు. బిహార్‌లో 63 లక్షల ఓట్లను తొలగించారని, పూర్తి స్థాయిలో లేక్కలు తీసుకుంటే ఆ సంఖ్య 80 లక్షలు చేరుతుందని, పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షలు, తమిళనాడులో 97 లక్షలు, కేరళలలో 27 లక్షల ఓటర్లను తొలగించారని, ఉత్తరప్రదేశ్‌లో కూడా 2.83 కోట్ల ఓట్లర్లను తొలగిస్తే ఎవ్వరూ మాట్లాడటం లేదన్నారు. ‘సర్’ ప్రక్రియ పూర్తయిన తరువాత ఒకే ఇంటిపైన 8 వందల ఓట్లు ఉన్నాయని, అందులో అన్ని మతా లు, అన్ని కులాల వారికి చెందిన ఓట్లు ఉండటం ఆశ్చర్యమని, ఆ ఇంటిని పరిశీలించేందుకు కొంతమంది ప్రయత్నిస్తే, అక్కడ అసలు ఆ ఇల్లే లేదని వివరించారు. ‘సర్’ నిర్వహించిన తర్వాత కూడా ఇలాంటి అనేక సంఘటనలు చూశామన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఓట్ల తొలగిస్తున్నారని మండిపడ్డారు.తొలగించిన ఓటర్లలో ముస్లీం, క్రిస్టియన్ మైనార్టీలతో పాటు ఆదివాసీ, దళితులు, పేద, సామాన్య ఓటర్లే అత్యధిక శాతం ఉన్నారని ప్రభాకర్ తెలిపారు. ఎన్నికలు జరగని రాష్ట్రాలైన రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో కూడా సర్ నిర్వహించి, ఓటర్లను తొలగించారని, ఈ విషయం రాజకీయ పార్టీలకు అవసరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ‘సర్’ ప్రక్రియ పూర్తయిన తర్వాత దేశంలో ఓటు ఉన్నావారు,ఓటు లేని వారు అని రెండు రకాల వారు ఉంటారన్నారు. ఇదే జరిగితే ఓటు లేని వారి వద్దకు ఎవ్వరూ వెళ్లారని అన్నారు. తద్వారా ఓట్లు లేనివారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సంక్షేమ పథకాలతో పాటు కనీస సౌకర్యాలు కూడా అందని పరిస్థితులు నెలకొంటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన ఓటర్లతో ఓటర్ల సంఘాన్ని ఏర్పాటు చేసి, ఓటు హక్కు పునరుద్దరణకు పోరాటం చేయాలని పరకాల ప్రభాకర్ పిలుపునిచ్చారు.

**ఇజ్రాయిల్ తరహా వ్యవహరిస్తున్నారు...: నాగేశ్వర్**

ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ తరహా నాన్ జూయిస్ బతక కూడదనే దోరణిని భారతదేశంలో కూడా తీసుకొస్తున్నారని విమర్శించారు. గాజాలో 70 లక్షలమందిని చంపేశారన్నారు. సౌత్ ఆఫ్రికాలో 7080 శాతం భూములు తెల్లవారి అధినంలో ఉంటాయని, దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రంగంలో దిగారని, అదే తరహాలో భారత దేశంలో కూడా ఆస్మదీయులైన ఓటర్లను తయారు చేసుకున్నారని విమర్శించారు.ఎన్నికల్లో పోటీ చేయాలంటే రిటర్నింగ్ అధికారి నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని, ఇందుకు కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ సంఘటననే ఉదాహరణగా గుర్తు చేశారు.

**చట్టాలపై సంపూర్ణ అవగాహన అవసరం: మాడభూషి**

ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ నాన్ అప్లికేబుల్ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారన్నారు. నాన్ అప్లికేబుల్ అని అంటే ఇక పోటీ చేయడానికి అవకాశం ఉండబోదని, ఓటరు జాబితాలో కూడా ఇదే మాదిరిగా ఓట్లను తొలగింపు ప్రక్రియ చేస్తున్నారన్నారు. ఓట్లు లేని వాళ్ల ఎక్కడికి పోవాలని ఆయన ప్రశ్నించారు. ఆధార్ ఉన్నంత మాత్రాన సిటిజన్ కాదని, పాస్‌పోర్ట్ కూడా ఉండాలని, పాస్ పోర్ట్ ఉంటే కూడా కాదని, ఓటు హక్కు ఉండాలని, ఇవన్ని లేకుంటే పౌరసత్వం రాని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఓటు పవర్‌గా మారిందని, ఓటు ఎటు జారీ పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు.

**‘ఓటు’ ఆయుదాన్ని కాపాడుకుందాం..: కూనంనేని సాంబశివరావు**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని,దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థను, ఓటు హక్కును కాపాడేందుకు సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే మేధావులు,చట్ట నిపుణులతో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సులో వచ్చిన సూచనల ఆధారంగా రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను, ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. ఓటర్లను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్ స్థాయి ఏజెంట్లు చురుగ్గా వ్యవహరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా తప్పులు లేని జాబితా రూపొందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌరుల స్వేచ్ఛ కోసం సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) దేశ భవితవ్యాన్ని నిర్ణయించే ప్రక్రియ అని అన్నారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వలసకూలీలు ఇలా చాలా మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారి పరిస్థితిపైన స్పష్టత లేదన్నారు. ఎక్కువ శాతం ఓట్లు పోయేవి పేదలవేనని అన్నారు.

## అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

స్పందించడం కంటే వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి నివారణ చర్యలు చేపట్టడం అత్యంత కీలకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు రెవెన్యూ, విపత్తుల నిర్వహణ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని, రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో తెలంగాణ అంతటా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు ఊపందుకుని వారం రోజులపాటు కొనసాగవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించాయని, ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతోందని తెలిపారు. జూన్ 14 నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాలు, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకినట్లు వివరించారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు ఉందన్నారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అన్ని జిల్లాల అధికారులు నిరంతర అప్రమత్తతతో విధులు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## కేంద్రం నోరు మెదపదేం?

(మొదటి పేజీ తరువాయి)

ఎరువులు, ఇతర నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. గ్లోబల్ సౌత్‌లో ఒక ముఖ్యమైన దేశంగా భారత ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణను ఖండించాలని, అమెరికాకు వ్యతిరేకంగా గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకకు భారతదేశం నాయకత్వం వహించాలని , మరణించిన భారతీయ నావికుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా నిరసన తెలియజేయాలని, భారతీయ నావికుల హత్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు అమెరికా చర్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, ఈ మరణాలకు బాధ్యులైన వారిని శిక్షించేందుకు భారత ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని దౌత్యపరమైన మార్గాలను అనుసరించాలని కూడా డిమాండ్ చేస్తాయని పేర్కొన్నారు.

## అభిజీత్ దీప్కేపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

లీక్, నిరుద్యోగం వంటి సమస్యలపై నిరసన తెలిపేందుకు పెద్ద సంఖ్యలో యువకులు గుమిగూడిన షహీద్ స్మారక్ వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, దీప్కే నిరసన ప్రదేశానికి చేరుకుని, మద్దతుదారుల భుజాలపై మోసుకెళ్తుండగా, గుంపులోని కొందరు యువకులు ఆయనను చెంపదెబ్బ కొట్టారు. ఈ ఘటన అనంతరం, ఆయన మద్దతుదారులు నిందితులను పట్టుకుని, పోలీసులు జోక్యం చేసుకునేలోపే వారిపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారని అధికారులు తెలిపారు. నిరసనకారులు అవినీతి, పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా నినాదాలు రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు, యువతకు సంబంధించిన సమస్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ, నిరుద్యోగం తదితర సమస్యలపై సిజెపి ఈ నిరసనను నిర్వహించిందని పోలీసులు తెలిపారు.

## ఆకలితో ఉండొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అల్పాహార పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి బడిబాట కార్యక్రమం చేపట్టామన్నారు. డ్రాపౌట్ విద్యార్థులను బడిలోకి తీసుకురావడం, ప్రైవేటు పాఠశాలల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా చేయడం ఈ కార్యక్రమ ముఖ్యోద్ధేషమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రూ.740కోట్లు వెచ్చించి అల్పాహార పథకాన్ని చేపట్టిందన్నారు. పిల్లలు మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. బాగా చదువుతూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు.

ఈ పథకం ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికి వర్తిస్తుందని చెప్పారు. రోజుకో తీరు చొప్పున అల్పాహారం మెనూ ఉంటుందనా న్నరు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ స భ్యులు అనిల్‌కుమార్ యాదవ్, శాసన సభ్యులు దానం నాగేందర్, యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, మన్నా ట్రస్ట్ సిఇఓ లీనా జోసెఫ్, డిఇఓ యా దయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com